మరవరాని మన చరిత్ర
రూ॥40/-
పేజీలు:40



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 27, సంచిక: 81 | మంగళవారం | 03-09-2024 | హైదరాబాద్   Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar   పేజీలు: 12 | ఖమ్మం : 12+8 | కరీంనగర్ : 12+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00


## హెల్త్ క్యాంపులు

రాష్ట్రంలోని వరద ప్రభావిత ప్రాంతాలు, పునరావాస కేంద్రాల్లో మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయాలని ఆరోగ్యశాఖ అధికారులను మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. అవసరమైన వారందరికీ పరీక్షలు నిర్వహించి, మందులను అందజేయాలని సూచించారు. వరదల తీవ్రత ఎక్కువగా ఉన్న ఖమ్మం జిల్లాలో పది వైద్య బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి బృందంలో ఒక స్పెషలిస్ట్ డాక్టర్లు, సిబ్బంది, టెస్టులు చేయడానికి అవసరమైన పరికరాలు, మెడిసిన్ ఉండేలా చర్యలు తీసుకోవాలని సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు.

# జాతీయ విపత్తుగా ప్రకటించండి

- భారీ వర్షాలతో రూ.5,438 కోట్లు నష్టం
- రాష్ట్రంలో పర్యటించాలని ప్రధానికి విజ్ఞప్తి
- దెబ్బతిన్న పంటకు ఎకరానికి రూ.10వేలు
- నష్టపోయిన ప్రతి ఇంటికిరూ.10వేలు
- మృతుల కుటుంబాలకు పరిహారం రూ.5 లక్షలకు పెంపు
- విపత్తులను ఎదుర్కొనేందుకు టిజిడిఆర్‌ఎఫ్ ఏర్పాటు
- భారీ వర్షాలపై హైదరాబాద్, ఖమ్మం సమీక్షా సమావేశాలలో సిఎం రేవంత్ రెడ్డి
- డిప్యూటీ సిఎం మంత్రులతో కలసి వరద ప్రాంతాల్లో పర్యటన

ఖమ్మంలో వరద బాధితులను ఓదార్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి





### మృతుల కుటుంబాలకు పరిహారం రూ.5 లక్షలకు పెంపు

వర్షాలు, వరదలతో చనిపోయిన వారి కుటుంబాలకు పరిహారం రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలకు, పాడి పశువులకు ఇచ్చే పరిహారం రూ.30 వేల నుంచి రూ.50 వేలకు, మేకలు, గొర్రెలకు రూ.3 వేల నుంచి రూ.5 వేలకు పరిహారం ఇవ్వాలని ముఖ్యమంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం జిఒ విడుదలైంది.

ప్రజాపక్షం / హైదరాబాద్/ఖమ్మం

భారీ వర్షాలతో పెద్ద సంఖ్యలో ప్రాణ నష్టం, లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినందున జాతీయ విపత్తుగా ప్రకటించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రాథమిక అంచనా ప్రకారం రూ.5,438 కోట్లు నష్టం జరిగినట్లు తెలిందని ఆయన తెలిపారు. సోమవారం మధ్యాహ్నం నాటికి 16 మంది మృతి చెందారని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ఆలోచన చేసి కేంద్ర ప్రభుత్వం పెద్దన్న పాత్ర పోషించి నిధులు విడుదల చేయాలని ఇదే సందర్భంలో ప్రధాన మంత్రి తెలంగాణలో పర్యటించి ప్రజల కష్టాలను తెలుసుకుని స్పందించాల్సిందిగా కోరుతున్నానని ఆయన తెలిపారు. ఈమేరకు ప్రధానికి లేఖ రాయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ముఖ్యమంత్రి ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో తొలుత హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ఉదయం సమీక్ష నిర్వహించారు. అతి తక్కువ సమయంలో ఇంత భారీ వర్షాలు కురవడానికి కారణాలు, గత రెండు రోజులు, రేపటి పరిస్థితులను సిఎం వాతావరణ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఊహించిన దానికన్నా ఎక్కువ వర్షాలు వచ్చాయని, గతంలో అయిదేళ్లకో, పదేళ్లకో ఇలా వచ్చేవని, ఇటీవల తరచూ వస్తున్నాయని, దీనిపై మరింత అధ్యయనాలు తరువాయి 2లో



# అధైర్యపడొద్దు

## యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని వరద ముంపు గ్రామాల్లో పర్యటన

ప్రజాపక్షం/కొత్తగూడెం/పాల్వంచ/ఖమ్మం

భారీ వర్షాలకు ముంపుకు గురై ఇబ్బందులు పడుతున్న గ్రామీణ ప్రజలు అధైర్యపడొద్దని యుద్ధ ప్రాతిపదికన నష్టనివారణ చర్యలు చేపట్టామని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. పాల్వంచ మండల పరిధిలో వర్షాలు, వరదలకు ముంపుకు గురైన ఉల్వనూరు, మందెరకలపాడు, మల్లారం, కిన్నెరసాని, రాళ్ళవాగు, యానంబైలు ప్రాంతాలను సోమవారం కూనంనేని సందర్శించారు. మండల తహసీల్దార్,



ఖమ్మంలో వరద బాధితులను పరామర్శిస్తున్న సిపిఐ నేతలు

ఎంపిడిఒ, నీటిపారుదల, వ్యవసాయ, అటవీ శాఖ, విద్యుత్, రోడ్లు భవనాల శాఖ అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. మందెరకలపాడు వంతెనకు గండి పడి సుమారు ఏడు ఊర్లకు రాకపోకలు స్తంభించడంతో స్పందించిన కూనంనేని అధికారులను ఆదేశించడంతో యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి రాకపోకలను పునరుద్ధరించారు. వరద ఉధృతితో నిరుచేరి ఇబ్బందులు పడుతున్న కుటుంబాలను పరామర్శించి జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు, బాధితులకు పరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. గ్రామాలను సందర్శించిన సందర్భంలో దెబ్బతిన్న రోడ్లను, విద్యుత్‌లైన్లను తక్షణమే పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. వరదతాకిడికి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ముందస్తు సమాచారం అందించినప్పటికి గ్రామీల సందర్శనకు గైర్హాజరైన వ్యవసాయ శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ రోడ్లు, విద్యుత్ పునరుద్ధరణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని, పంటల నష్టంపై వ్యవసాయ అధికారులు తక్షణమే సర్వేచేపట్టి నివేదికను ప్రభుత్వానికి అందించాలని ఆదేశించినట్లు తెలిపారు. పర్యటనలో కూనంనేని వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, జిల్లా నాయకులు ముత్యాల విశ్వనాథం, తరువాయి 12లో



# 5న మరో అల్పపీడనం

రాష్ట్రంలో మరో మూడు రోజులు వర్షాలే

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో మరో మూడురోజుల పాటు భారీ వర్షాలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం కొన్ని జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు. మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయన్నారు. రానున్న 12 గంటల్లో వాయుగుండం బలహీనపడుతుందన్నారు. ఈ నెల 5 నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతాన్ని ఆనుకొని వాయువ్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించారు. రుతుపవన ద్రోణి జైసల్మేర్, రైసేన్, చింద్వారా, తూర్పు విదర్భ ప్రాంతంలోనున్న వాయుగుండం కేంద్రం గుండా తెలంగాణ, మచిలీపట్నం మీదుగా వెళ్తుందని, ఆగ్నేయ దిశగా తూర్పు మధ్య బంగాళాఖాతం వరకు తరువాయి 2లో

# నేడు 11 జిల్లాలకు భారీ వర్ష సూచన

అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి

జిల్లా కలెక్టర్లు, ఎస్‌పిలకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశం

ప్రజాపక్షం /హైదరాబాద్



రాష్ట్రంలోని 11జిల్లాల్లో మంగళవారం సైతం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. వాతావరణ శాఖ అంచనా మేరకు భారీ వర్షాలు పడే అవకాశం ఉన్న కురిసే ఆదిలాబాద్, జగిత్యాల, కామారెడ్డి, కొమరం భీం ఆసిఫాబాద్, మెదక్,మేడ్చల్ మల్కాజిగిరి, నిర్మల్, నిజామాబాద్, పెద్దపెల్లి, సంగారెడ్డి, సిద్ధిపేట జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. డిజిపిజితేందర్, విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, ఫైర్ సర్వీసుల డిజి నాగి రెడ్డి, నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్‌లతో కలిసి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆయా జిల్లాల్లో వరదల పరిస్థితి, పునరావాస, సహాయక చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా సి.ఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, భారీ వర్షాలు కురిసే అవకాశమున్న ఈ జిల్లాల కలెక్టర్లు ముందస్తు ప్రణాళిక రూపొందించుకొని ఏలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండ అన్ని రకాలుగా ముందుస్తు జాగ్రత్తలు చర్యలు తీసుకోవాలని అదేశించారు. ఇప్పటికే గత 5 రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రానున్న భారీ వర్షాల వల్ల పరిస్థితులు తీవ్రంగా ఉండే అవకాశ ఉన్నందున పోలీసు తదితర శాఖల సమన్వయంతో పటిష్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. స్థానిక పరిస్థితుల బట్టి ఆయా జిల్లా కలెక్టర్లు విద్యా సంస్థలకు సెలవుపై నిర్ణయం తీసుకోవాలని సూచించారు. స్వర్ణ, కడెం ప్రాజెక్టుల గేట్లను తెరవడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను సరక్షిత ప్రాంతాలకు తరలించాలని నిర్మల్ కలెక్టర్ ను ఆదేశించారు. నిర్మల్‌కు 31 సభ్యులు, నాలుగు బొట్లు ఉన్న ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాన్ని పంపించినట్లు తెలిపారు. ఎస్ఆర్ఎస్‌పి తరువాయి 2లో





ఫొటో : అంజి, ఖమ్మం





# జల ప్రళయం జనం కకావికలం

కన్నీరు మిగిల్చిన కుంభవృష్టి

ప్రజాపక్షం/ న్యూస్ నెట్‌వర్క్

వాయుగుండం ప్రభావంతో కురిసిన కుంభవృష్టికి రాష్ట్రం అతలాకుతలమైంది. గంటల వ్యవధిలో కురిసిన కుండపోతకు 8 ప్రాంతాల్లో అత్యధికంగా 40 నుంచి 52 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఖమ్మం జిల్లా కాకరవాయిలో అత్యధికంగా 52.19 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. పోటెత్తిన వరదతో వాగులు, వంకలు పొంగిపొర్లి ప్రవహించగా, గ్రామాలతో పాటు లోతట్టు కాలనీల్లోని ఇళ్లను నీరు చుట్టుముట్టింది. లోతట్టు ప్రాంతాలను వరద ముంచెత్తగా, జనం ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని భయంతో గడపాల్సి వచ్చింది. జల ప్రళయం ఖమ్మం జిల్లాలోని వేలాది మంది జీవితాలను చిన్నాభిన్నం చేసింది. చివరకు కన్నీరు మిగిల్చింది. రికార్డు స్థాయిలో వచ్చిన వరద వందలాది మంది జీవిత గమనాన్ని మార్చివేసింది. అధికార యంత్రాంగ అంచనా వైఫల్యం, తరలింపులో నిర్లక్ష్యం బాధితుల పాలిట శాపంగా మారింది. వరద ముంపుకు గురైన ప్రాంత ప్రజలది ఒక్కొక్కరిది ఒక్కొక్క గాథ. కొన్ని గంటల్లోనే వరద నీరు ముంచెత్తడంతో కట్టు బట్టలతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పరుగులు పెట్టారు. ఇంట్లో ఏ ముంది అన్న ధ్యాస కంటే బతకడం ఎలా అన్న ఆందోళన పరుగులు పెట్టేలా చేసింది. ఫలితంగా చివరకు కట్టు బట్టలే మిగిలాయి. వరద బాధిత ప్రాంతాల్లో ఏ ఇంటిని కదిలించినా కన్నీటి వ్యథే. ఏ ఆధారం లేక రేకులు వేసుకుని జీవిస్తున్న ఓ నిరుపేద కుటుంబం ఇప్పుడు రోడ్డున పడింది. ఉన్న రేకులు కొట్టుకుపోవడంతో ఆ తల్లి పైకప్పులు లేని గూటిలో దీనంగా కాలం గడుపుతుంది. ముఖ్యంగా మున్నేరు బాధిత కుటుంబాలలో పిల్లలది ఓ దురదృష్టకర ఘటన. చదువుకునే పుస్తకాలు, ధృవపత్రాలు, ల్యాప్‌టాప్‌లు అన్ని వరదలో కొట్టుకుపోయాయి. మిగిలినవి తడిసి ముద్దయ్యాయి. ఆదివారం ఇల్లు చేరిన ఓ బాలిక ఇంటికి వెళ్లి తడిసిన తన పుస్తకాల సంచిని చూసుకుని పుస్తకాలను ఆరబెట్టుకుంటున్న తీరు కంటతడిపెట్టించింది. ఓ చిరు వ్యాపారి పెళ్లిళ్ల సీజన్ కదా అని ఇంట్లో మూడు లక్షల రూపాయల విలువైన సామాను తెచ్చిపెట్టుకున్నాడు. మొత్తం వానకు తడిసిపోవడంతో గుండెలవిసేలా రోదిస్తున్నాడు. మోతి నగర్, వెంకటేశ్వర నగర్, కవిరాజ్ నగర్, పంపింగ్ వెల్ రోడ్డు, బొక్కలగడ్డ, ప్రకాష్‌నగర్ తదితర ప్రాంతాలలో 10 అడుగుల మేర నీరు తరువాయి 2లో

# నిందితులైతే ఇళ్లు కూల్చేస్తారా!

రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం

అన్ని రాష్ట్రాలకు వర్తించేలా త్వరలోనే గైడ్‌లైన్స్‌ను రూపొందిస్తామని ధర్మాసనం వెల్లడి



**న్యూఢిల్లీ :** క్రిమినల్ కేసులలో ఉన్నాడన్న ఆరోపణలపై నిందితుల ఇండ్లను బుల్డోజర్లతో కూల్చివేయడం ఏమిటని ప్రభుత్వాల తీరుపై సుప్రీం కోర్టు తీవ్ర అసహనం వ్యక్తంచేసింది. సోమవారం ఇండ్ల కూల్చివేతలపై పలు రాష్ట్రాల నుంచి దాఖలైన పిటిషన్లపై జస్టిస్ బిఆర్. గవాయ్, కెవి.విశ్వనాథన్‌లతో కూడిన సుప్రీం తరువాయి 12లో

# గాజాలో కాల్పులు విరమించాలని ఇజ్రాయెల్‌లో రోడ్డెక్కిన జనం

దేశవ్యాప్త ప్రదర్శనల్లో పాల్గొన్న 5 లక్షల మంది

ప్రధానిపై తీవ్ర ఆగ్రహం

సమ్మెకు దిగిన కార్మికులు

వైద్య, విమాన, పౌర సేవలకు తీవ్ర విఘాతం

**జెరుసలేం :** గాజాలో ఆరుగురు బందీల మృతదేహాలు లభ్యమైన నేపథ్యంలో ఇజ్రాయెల్‌లో ప్రధాని బెంజామిన్ నెతన్యాహూపై ప్రజల్లో తీవ్ర ఆగ్ర హం వ్యక్తమవుతోంది. తక్షణమే కాల్పుల విరమ ణ ఒప్పందం చేసుకోవాలని, బందీలను వెనక్కి ర ప్పించాలని డిమాండ్ చేస్తూ దేశంలో అతిపెద్ద కార్మిక సంఘం 'హిస్టాడ్రుట్' సోమవారం ఒక్క రోజు సమ్మెకు దిగింది.సుమారు 8 లక్షల మంది సభ్యులు కలిగిన ఈ కార్మికసంఘం సమ్మెకు భారీ స్పందన లభించింది. వైద్యులు, బ్యాంకు ఉద్యోగులు, విమానాశ్రయ సిబ్బంది సమ్మెలో పాల్గొనడంతో వైద్య సేవలు, రవాణా, బ్యాంకింగ్ రం సేవలు నిలిచిపోయాయి. అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాల రాకపోకలకూ తీవ్ర అంతరాయం కలిగింది. ఆదివారం అర్ధరాత్రి నుంచే దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో జరుగుతున్న నిరసన ప్రదర్శనలు సాగుతున్నాయి. టెల్ అవీవ్‌లో సుమారు 3 లక్షల తరువాయి 12లో



# సెబీ చైర్‌పర్సన్‌కు ఐసిఐసిఐ నుంచి వేతనం

కాంగ్రెస్ సంచలన ఆరోపణ



**న్యూఢిల్లీ:** ఇప్పటికే హిండెన్‌బర్గ్ నివేదికలో ఆరోపణలు ఎదుర్కొన్న సెబీ చైర్‌పర్సన్ మాధవి బచ్‌పై కాంగ్రెస్ పార్టీ తాజాగా మరో సంచలన ఆరోపణ చేసింది. ఒకవైపు 2017 నుంచి చైర్‌పర్సన్‌గా సెబీ నుంచి వేతనం తీసుకుంటూనే, మరో వైపు నాటి నుంచి నేటి వరకు ఐసిఐసిఐ బ్యాంకు నుంచి కూడా ఆమె వేతనం స్వీకరిస్తున్నారని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి జై రామ్ రమేశ్ ఆరోపించారు. ఇది పరస్పర విరుద్ధ ప్రయోజనం, లాభదాయ పదవి నిబంధనల కిందకు వస్తుందన్నారు. ఈ మేరకు సోమవారం నాడు జైరామ్ రమేశ్ తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. నియంత్రణ మండలి సెబీ చైర్‌పర్సన్‌ను నియమించి అపాయింట్‌మెంట్స్ కమిటీ చైర్మన్‌గా ఉన్న ప్రధాని మోదీకి ఈ విషయం తెలుసా అని ఆయన ప్రశ్నించారు. సెబీకి పూర్తి సమయం చైర్‌పర్సన్‌గా ఉన్న మాధబి బచ్ వద్ద ఐసిఐసిఐ, దాని అనుబంధ సంస్థలకు తరువాయి 12లో




# హసీనాను అప్పగిస్తారా? లేదా?

## తేల్చిచెప్పాలని భారత్‌కు బంగ్లాదేశ్ అల్టిమేటం



**ఢాకా:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాను తమకు అప్పగిస్తారా? లేదా? అసలు అప్పగించే ఉద్దేశం ఉందా? అంటూ భారత్‌ను బంగ్లాదేశ్ ప్రశ్నించింది. ఏదో ఒకటి తేల్చిచెప్పాలంటూ అల్టిమేటం ఇచ్చింది. మీడియా వర్గాల ప్రకారం బంగ్లాదేశ్ విదేశీ వ్యవహారాల సలహాదారు ఎండి తౌహీద్ హుసైన్ మాట్లాడుతూ, హసీనాను బంగ్లాదేశ్ కు రప్పించేందుకు యూనస్ ప్రభుత్వం ఏమైనా చేస్తుందని ప్రజలకు భరోసా ఇచ్చారు. భారత్‌కు ఎన్నిసార్లు చెప్పినా, ఆమెను అప్పగించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం తలచుకుంటే ఎలాగైనా హసీనాను తీసుకురాగలదని ధీమా వ్యక్తం చేశారు. అసలు హసీనా భారత్ లో ఎక్కడుండో బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వానికి తెలుసా? అని ఓ మీడియా ప్రతినిధి ప్రశ్నించినప్పుడు ''ఆ విషయం భారత్ నే అడగండి' అంటూ తౌహీద్ హుసైన్ అసహనం వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్ లో చెలరేగిన విద్యార్థుల నిరసన హద్దులు మీరడంతో హసీనా ప్రాణ భయంతో ఇండియాలో ఆశ్రయం పొందారు. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం హసీనా, ఆమె బంధువుల దౌత్య పాస్ పోర్ట్‌లను రద్దు చేసింది. హసీనాకు భారత్ ఆశ్రయం కొనసాగిస్తే రెండు దేశాల మధ్య భవిష్యత్ సంబంధాలు దెబ్బతింటాయని కూడా బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఫఖ్రుల్ ఇస్లాం ఆలంగీర్ ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఏదిఏమైనా హసీనాకు భారత్ ఆశ్రయం కల్పించడంపై బంగ్లాదేశ్‌లో అసహనం, ఆగ్రహం వ్యక్తమవతున్నాయి. ఈ అంశం ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం చూపే ప్రమాదం లేకపోలేదు.

అరగంటలో షాపింగ్ మాల్ లూటీ

# ఎగబడ్డ జనం..

**కరాచీ:** పాకిస్తాన్ ఆర్థిక సంక్షోభం ఏ స్థాయిలో ఉందో నిరూపించే ఘటన కరాచీలో చోటు చేసుకుంది. తక్కువ ధరకే షర్టులు కొనేందుకు ఒక షాపింగ్ మాల్‌పై ఎగబడిన జనం, అరగంట లోపే దానిని లూటీ చేసేశారు. పాక్ మీడియా కథనాల ప్రకారం, విదేశాల్లో ఉంటున్న పాకిస్తాన్ వ్యాపారవేత్త ఒకరు 'డ్రీమ్ బజార్' పేరుతో ఓ షాపింగ్ మాల్‌ను ప్రారంభించనున్నట్టు ప్రకటించాడు. మాల్‌ను మొదలుపెట్టిన రోజున 50 రూపాయలకే ఒక షర్టును అమ్మనున్నట్టు తెలిపాడు. ఈ వార్తకు సోషల్ మీడియాలో విపరీతమైన ప్రచారం లభించింది. తక్కువ ధరకే షర్టు వస్తుందన్న ఆశతో, వేలాది మంది ఆ షాపింగ్ మాల్ వద్దకు చేరారు. తొలి అవకాశాన్ని దక్కించుకోవడం కోసం ఎవరికివారే పరుగులు తీయడంతో తొక్కిసలాట మొదలైంది. అక్కడికి చేరుకున్న వారి సంఖ్య సుమారు లక్షకు చేరడంతో, వారిని ఏ విధంగా నియంత్రించాలో అర్థంగాక పోలీసులు కూడా చేష్టలుడిగి నిలుచుండిపోయారు. 50 రూపాయలకు షర్టుతోపాటు, ఇతర వస్తువులను, ముఖ్యంగా నిత్యావసరాలను కూడా అత్యంత తక్కువ ధరకే ఇవ్వనున్నట్టు సదరు వ్యాపారవేత్త ప్రకటించమే, భారీ సంఖ్యలో ప్రజలు డ్రీమ్ మాల్‌కు ఎగబడడానికి కారణమైంది. దూసుకొస్తున్న వారిని నిలువరించడానికి మాల్ గ్లాస్ డోర్‌ను మూసివేసినా ఫలితం లేకపోయింది. వేలాది మంది దానిని ధ్వంసం చేసి మరీ లోనికి చొచ్చుకెళ్లారు. అరగంట వ్యవధిలోనే మాల్‌ను లూటీ చేశారు. ఒక మంచి ఉద్దేశంతో ప్రారంభమైన మాల్‌ను ఈ విధంగా లూటీ చేయడాన్ని పలువురు తీవ్రంగా ఖండిస్తున్నారు. పాకిస్తాన్‌ను ఇకపై ఎవరూ నమ్మరని వాపోతున్నారు.




ఫిలిప్పీన్స్‌లో వరద బీభత్సం కొనసాగుతున్నది. గత 24 గంటల్లో కనీసం 9 మంది మృతి చెందగా, పలువురు గల్లంతయ్యారు. ఫిలిప్పీన్స్ వాతావరణ శాఖ అధికారక ప్రకటనను అనుసరించి, 'యాగి' తుపాను క్వెజాన్ ప్రావిన్స్‌ను దారుణంగా దెబ్బతీసింది. ఇన్‌ఫాంటా పట్టణంలో మరణాలు సంభవించాయి. కొంత మంది వరద నీటిలో కొట్టుకుపోయారు. విపత్తు నిర్వహణ బృందాలు పలు ప్రాంతాల్లో నీటిలో చిక్కుకుపోయిన వారిని రక్షిస్తున్నాయి. తుపాను కారణంగా గంటకు 115 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయి. దీనితో సహాయక చర్యలకు అంతరాయం ఏర్పడుతున్నది. స్థానికంగా 'ఎన్‌టెంగ్' అని పిలిచే ఈ తుపాను గంటకు 15 కిలోమీటర్ల వేగంతో వాయువ్య దిశగా, లుజాన్ ప్రావిన్స్ వైపు పయనిస్తున్నది. దీని ప్రభావంతో ఆకస్మిక వరదలు సంభవించే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కోరింది.



అమెరికాలో మరోసారి కాల్పుల మోత మోగింది. హవాయిలో ఆదివారం అర్ధరాత్రి ఓ దుండగుడు జరిపిన కాల్పుల్లో నలుగురు మృతి చెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. చనిపోయిన వారిలో ముగ్గురు మహిళలు, ఒకరు పురుషుడు ఉన్నారని సమాచారం. ఘటనకుగల కారణాలు ఇంకా తెలియరాలేదు.

ఉక్రేన్‌పై రష్యా

# ప్రతీకార దాడి

**కీవ్:** ఉక్రేన్‌పై రష్యా మరోసారి డ్రోన్లు, క్రూయిజ్, బాలిస్టిక్ క్షిపణులతో విరుచుపడింది. శనివారం అర్ధరాత్రి ఉక్రేన్ ఏకంగా 158 డ్రోన్లను ప్రయోగించగా, అందుకు ప్రతీకారంగా రష్యా ఎదురుదాడి చేసింది. మాస్కోలోని రెండు ప్రాంతాలతోపాటు మరో 9 చోట్ల ఈ దాడులు జరిగాయి. కస్క్ ప్రాంతంలో 46 డ్రోన్ల దాడులు చోటు చేసుకున్నాయి. బ్రియాన్స్‌లో 34, వోరోనెజ్‌లో 28, బెల్గోరోడ్‌లో 14 చొప్పున డ్రోన్ దాడులు జరగడంతో రష్యా అప్రమత్తమైంది.

ప్రతీకార దాడులకు దిగింది. ఉక్రేన్ రాజధాని కీవ్ సహా పలు కీలక నగరాలపై వాటిని ప్రయోగించింది. సోమవారం తెల్లవారుజామున కీవ్‌లో అనేక వరుస పేలుళ్లు సంభవించాయని ఉక్రేన్ వైమానిక దళం ప్రకటించింది. వెంటనే అప్రమత్తమై ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు పేర్కొంది. కీవ్‌లోని హోలోసివ్స్కీ, సోలోమియాన్స్కీ జిల్లాలకు అత్యవసర సేవా బృందాలను రప్పించినట్లు కీవ్ మేయర్ విటాలి క్లిట్ష్కో తెలిపారు. షెవ్‌చెంకివ్‌స్కీ జిల్లాలో శిథిలాలు పడటం వల్ల ఒకరు గాయపడినట్లు వెల్లడించారు. మరో వైపు, రష్యా జరిపే ప్రతి ఒక్కదాడికి తిరిగి సమాధానం ఉంటుందని, శత్రువు తప్పకుండా దాన్ని స్వీకరించాల్సి వస్తుందని ఉక్రేన్ అధ్యక్ష కార్యాలయ అధిపతి ఆండ్రీ యెర్మాక్ తన టెలిగ్రామ్ అకౌంట్‌లో పోస్ట్ చేశారు. ఇలావుంటే, పదికిపైగా క్రూయిజ్, బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్స్‌తో రష్యా దాడులకు పాల్పడిందని కీవ్ నగర సైనిక పరిపాలనా అధిపతి సెర్హా పాప్కో తెలిపారు. మరో వైపు, ఉక్రేన్‌లోని రెండవ అతిపెద్ద నగరమైన ఖార్కివ్‌లో కూడా పేలుడు సంభవించిందని ఉక్రేన్ మీడియా పేర్కొంది. ఈ విషయాన్ని ఖార్కివ్ ప్రాంత అధిపతి ఒలేహ్ సినీహుబోవ్ ధ్రువీకరించారు. ఖార్కివ్‌లోని ఇండస్ట్రియల్ని జిల్లాపై సోమవారం తెల్లవారుజామున వైమానిక దాడులు జరిగాయని పేర్కొన్నారు. ఈ దాడి వల్ల ఒక నివాస భవనం, అనేక ఇతర నివాస సముదాయాలకు నిప్పంటుకుందని చెప్పారు.




ద. కొరియా అధ్యక్షుడు యూల్‌పై

# విమర్శల వెల్లువ



**సియోల్:** దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యూల్ తీసుకున్న ఏకపక్ష నిర్ణయంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం పార్లమెంటు (నేషనల్ అసెంబ్లీ) సమావేశాలు ప్రారంభంకాగా, తొలిరోజు కార్యక్రమానికి హాజరు కాకూడదని ఆయన తీర్మానించుకోడానికి ప్రధాన ప్రతిపక్షం డెమోక్రాటిక్ పార్టీ తప్పుపట్టింది. వివరాల్లోకి వెళితే, దక్షిణ కొరియాకు చెందిన పలువురు అధికారులతోపాటు, అధ్యక్షుడు యూల్ భార్య కిమ్ కియోన్ హీపైన కూడా అధికార దుర్వినియోగం, అవినీతి, ఆశ్రిత పక్షపాతం, నిధులు స్వాహా వంటి ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయాన్ని ప్రతిపక్ష పార్టీలు ప్రధానంగా ప్రస్తావిస్తున్నాయి. నిందితులపై కఠిన చర్యలు అవసరమని డిమాండ్ చేస్తున్నాయి. కాగా, పార్లమెంటు సమావేశాల తొలి రోజున, సభకు రావడం దక్షిణ కొరియాలో ఆనవాయితీగా వస్తున్నది. 1980 దశకాల్లో, సైనిక నియంతృత్వం నుంచి మయటపడి, ప్రజాస్వామిక దేశంగా అవతరించిన నాటి నుంచి ఇప్పటి వరకూ అధ్యక్షుల్లో ఎవరూ ఈ విధంగా పార్లమెంటు సమావేశాల తొలిరోజున సభకు గైర్హాజరు కాలేదు. కానీ, తన భార్య, ఇతర అధికారుల అవినీతి అంశం పార్లమెంటులో చర్చకు వస్తుందని భయపడ్డారో లేక అక్కడ అధికారికంగా ఏదో ఒక సమాధానం ఇవ్వాల్సి వస్తుందని ఆందోళన చెందారో తెలియదుగానీ, సభకు హాజరయ్యేందుకు ఆయన నిరాకరించారు. ఈ విషయంపై అధ్యక్షుడి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. అవినీతి ఆరోపణలపై కమిటీ నియామకం వంటి విషయాలను చర్చించి, ఒక నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యత పార్లమెంటుపై ఉందని ఆ ప్రకటనలో పేర్కొంది. ఒక స్పష్టమైన విధానాన్ని లేదా నిర్ణయాన్ని ప్రకటించనిదే అధ్యక్షుడు యూల్ సభకు హాజరుకావడంలో అర్థం ఉండదని వ్యాఖ్యానించింది. అయితే, ప్రజలు మాత్రం ఆయన తీరుపై మండిపడుతున్నారు. ప్రజా సమస్యలను చర్చించి, పరిష్కరించాల్సిన పార్లమెంటు సమావేశానికి కూడా హాజరుకాకపోవడం ఆయన పొరపాటు చేశాడనే విషయాన్ని రుజువు చేస్తున్నదని వ్యాఖ్యానిస్తున్నారు. ఈ కొత్త సంప్రదాయం దేశ భవిష్యత్తుకు మంచిది కాదని స్పష్టం చేస్తున్నారు.

# జాతీయ విపత్తుగా ప్రకటించండి

(మొదటి పేజీ తరువాయి



జరుగుతున్నాయని వాతావరణ శాఖ అధికారులు సిఎంకు వివరించారు. మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గం ద్వారా ఖమ్మంకు వెళ్లిన ముఖ్యమంత్రి తొలుత పాలేరు నియోజక వర్గంలోని పాలేరు ప్రాజెక్టును పరిశీలించారు. పలు చోట్ల దెబ్బతిన్న రోడ్లను పరిశీలించి ఖమ్మం సమీపంలోని మున్నేరు వరద బాధిత ప్రాంతాలలో పర్యటించారు. రాజీవ్ గృహ కల్ప, బొక్కలగడ్డ, మోతి నగర్ తదితర ప్రాంతాలలో పర్యటించి ప్రజలు అధైర్యపడవద్దని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని అభయమిచ్చారు. తక్షణ సాయం అందిస్తామని తెలిపారు. పంట దెబ్బతిన్న ప్రతి ఎకరానికి రూ.10వేలు, నష్టపోయిన ప్రతి ఇంటికి రూ.10వేలు సాయం అందిస్తామని చెప్పారు. అంతకు ముందు హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో మాట్లాడారు. వర్షాలు ఎక్కువగా ఉండే జిల్లాల కలెక్టర్లు, అన్ని విభాగాల అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను అవసరమైతే వెంటనే సహాయక శిబిరాలకు తరలించాలని సిఎం ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్లలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి 24 గంటలు పర్యవేక్షణ కొనసాగించాలని రేవంత్‌రెడ్డి సూచించారు. చెరువులు, కల్వర్టులు, లోలెవల్ కాజ్‌వేలు ఇతర ప్రదేశాల్లో వివిధ శాఖల అధికారులతో పర్యవేక్షణ చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. వాతావరణ పరిస్థితులపై ప్రతి మూడు గంటలకో బులెటిన్ విడుదల చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. 25 పెద్ద టవర్లు కూలిపోయినప్పటికీ విద్యుత్తు సిబ్బంది వెంటనే కరెంట్ సరఫరాను పునరుద్ధరించారని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. అదే విధంగా 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్తు సమస్యలు, ప్రమాదాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సిఎం ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వారిని గుర్తించి తక్షణమే పునరావాస కేంద్రాలకు తరలించి నష్టాలను నివారించాలని చెప్పారు. వాగులు, వంకలు పొర్లుతున్న దృష్ట్యా దెబ్బతిన్న రోడ్లు, వరద ప్రవహిస్తున్న రోడ్లపై నుంచి ఎవరూ దాటే ప్రయత్నం చేయవద్దని ముఖ్యమంత్రి హెచ్చరించారు. రెవిన్యూ, పోలీసు, ఇతర విభాగాల అధికారులు బృందాలు ఏర్పడి అన్ని చోట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

**పంట నష్టం వివరాలు సేకరించాలి**

**ఇళ్లు కూలిపోయిన వారికి ఇందిరమ్మ ఇళ్లు**

రైతులకు జరిగిన పంట నష్టంపైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షించారు. ప్రాథమిక అంచనాల ప్రకారం లక్షన్నర ఎకరాలకుపైగా పంట నష్టం వాటిల్లిందని అధికారులు తెలిపారు. నాలుగు లక్షలకుపైగా ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు వార్తలు వస్తున్నాయని, తక్షణమే రంగంలోకి దిగి పంట నష్టం వివరాలు సేకరించాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. కామారెడ్డిలో వరదలు వచ్చినప్పుడు పంట నష్ట పరిహారం వెంటనే విడుదల చేశామని, ప్రస్తుతం అలా చేసేందుకు ఏర్పాట్లు చేయాలని సిఎం అన్నారు. నష్టం వివరాలను సమగ్రంగా పేర్కొంటూ కేంద్ర ప్రభుత్వ బృందాలు సైతం తక్షణమే పంట నష్ట పరిశీలనకు వచ్చే ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇళ్లు కూలిపోయిన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. రైల్వే లైన్ సైతం కొట్టుకుపోవడం, పదుల సంఖ్యలో రోడ్లు, చెరువులకు గండి పడడం, విద్యుత్ స్తంభాలు కూలిపోవడం, ఇతర ఆస్తి నష్టాలు చోటుచేసుకున్నందున స్వయంగా ప్రధానమంత్రిని పర్యటనకు రావాలని కోరుతూ లేఖ రాయాలని సిఎస్‌కు ముఖ్యమంత్రి సూచించారు.

**విపత్తులను ఎదుర్కొనేందుకు టిజిడిఆర్ఎఫ్ ఏర్పాటు**

**యువ పోలీసులకు ఎన్‌డిఆర్ఎఫ్ తరహాలో శిక్షణ**

భవిష్యత్తులో ఇలాంటి విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తెలంగాణ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (టిజిడిఆర్ఎఫ్) ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలోని 8 బెటాలియన్లలో మూడో వంతు యువ పోలీసులకు ఎన్‌డిఆర్ఎఫ్ తరహాలో శిక్షణ ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిజిపిని ఆదేశించారు. భారీ వర్షాలు, వరదల సమయంలో ఎన్‌డిఆర్ఎఫ్ నుంచి తక్షణం సిబ్బంది ఎందుకు అందడంలేదని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. మనం పెట్టిన ఇండెంట్ ఆధారంగా వాళ్ల దగ్గర ఉన్న బలగాలను పంపుతారని, ఇందుకు సమయం పడుతుందని అధికారులు బదులిచ్చారు. స్పందించిన ముఖ్యమంత్రి మన బెటాలియన్లలోని యువ పోలీసులకు ఎన్‌డిఆర్ఎఫ్ తరహాలో శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఎక్విప్‌మెంట్ సమస్యగా ఉంటుందని అధికారులు తెలపగా, ఎంత ఖర్చయినా ఫర్వాలేదని, వెంటనే కొనుగోలు చేయాలని సిఎం సూచించారు. ఒడిశా, గుజరాత్‌లో అలా శిక్షణ ఇచ్చి బృందాలు ఏర్పాటు చేసుకున్నాయని అధికారులు తెలపగా, అవసరమైతే అక్కడి విధానాలను అధ్యయనం చేయాలని, అక్కడి అనుభవం ఉన్నవారితో శిక్షణ ఇప్పించాలని సిఎం సూచించారు. దానికోసం ఒక మాన్యువల్ రూపొందించాలని, ప్రతి సీజన్ ముందు శిక్షణ ఇప్పించిన సిబ్బందితో రిహార్సల్స్ చేయించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**జిహెచ్ఎంసి, కమిషనరేట్ల పరిధిలో**

నగరంలో ఎక్కడా చిన్న అవాంఛనీయ సంఘటన చోటుచేసుకోవడానికి వీల్లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. విద్యుత్, ట్రాఫిక్, తాగునీరు, పారిశుధ్యం విషయాల్లో అప్రమత్తంగా ఉండాలని సిఎం సూచించారు. ట్రాఫిక్‌కు నిరంతరం పర్యవేక్షించాలని, విద్యుత్ సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సహాయ శిబిరాలను తరలించాలని సూచించారు. నిత్యం పనికి వెళ్లే కూలీలు పనులు ఉండక ఇంటి దగ్గరే ఉండిపోతారని, వారిని గుర్తించి బియ్యం, పప్పులు, నిత్యావసర సరకులు పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సమీక్షలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, డి.శ్రీధర్‌బాబు, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంఎల్ఎ దానం నాగేందర్, ఎంపి ఎం.అనిల్‌కుమార్ యాదవ్, సిఎస్ శాంతి కుమారి, డిజిపి డాక్టర్ జితేందర్, అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# జల ప్రళయం.. జనం కకావికలం

చేరాయి. ఇంట్లో ఉన్న ఏ ఎలక్ట్రానిక్ వస్తువూ పనికొచ్చే పరిస్థితి లేదు. ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు, టివిలు చాలా మంది ఇండ్ల నుంచి కొట్టుకుపోయాయి. ఉన్నవి పనికి రాకుండాపోయాయి. ఇక ఇంట్లో ఉన్న నిత్యావసర వస్తువు ఏది ఉపయోగపడే పరిస్థితి లేదు. శరీరం పై ఉన్నవి తప్ప మార్చుకోవడానికి మరో గుడ్డ లేదు. స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీలు లేదా అధికారులు తినడానికి అందిస్తున్నారు కానీ చాలా మంది రేపటి పరిస్థితి ఏమిటి అని తీవ్ర వేదనకు గురవుతున్నారు. ఖమ్మం నగరంలోని మున్నేరు పరివాహక ప్రాంతాల్లో వ్యాపారులు, మధ్య తరగతి ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. ఏ రోడ్డు చూసినా బురదమయమే. ఇండ్లనిండా బురదే. నెల రోజులకు సరిపడా నిత్యావసర వస్తువులను అందించడంతో పాటు ప్రతి పేద కుటుంబానికి కనీసం ఐదు లక్షల పరిహారాన్ని ప్రకటిస్తే తప్ప జీవించే పరిస్థితి కనిపించడం లేదు. ఈ ముంపుకు కారకులై నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికార యంత్రాంగంపై తగు చర్యలు తీసుకోవాలని బాధిత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. తమకు తగిన పరిహారం వెంటనే అందించాలని ప్రభుత్వాన్ని అర్థిస్తున్నారు.

**విషాదకర సంఘటనలు మిగిల్చిన భారీవర్షం**

**దెబ్బతిన్న పంటలు, రహదారులు, డైనేజీ వ్యవస్థ**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో కురిసిన భారీ వర్షాలు జనజీవనాన్ని అస్తవ్యస్తం చేశాయి. వరంగల్ నగరంలో అన్ని కాలనీలు, శివారు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుపోయాయి. పలు ప్రాంతాలలో రోడ్లు, రైల్వే ట్రాక్‌లు ధ్వంసం కావడంతో పాటు రోడ్లపైకి వరద నీరు చేరి ప్రయాణికులు అష్టకష్టాలు పడ్డారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు, వరదలు పంటలకు తీరని నష్టాన్ని కలిగించాయి. వరంగల్ , హన్మకొండ జిల్లాలలో సాధారణం కంటే మించి వర్షపాతం నమోదు అయింది. వరంగల్ జిల్లాలో ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 694 మి.మి. నమోదు కావాల్సి ఉండగా 875 మి.మి.వర్షపాతం నమోదు అయింది. అలాగే హనుమకొండ జిల్లాలో ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 667 మి.మి.లు నమోదు కావాల్సి ఉండగా 795 మి.మి.ల వర్షపాతం నమోదు అయింది. ఒక్క ఆదివారమే వరంగల్ జిల్లాలో 54.4 మి.మిలు, హనుమకొండ జిల్లాలో 37.1 మి.మి.ల వర్షపాతం నమోదు అయింది. మహబూబాబాద్ జిల్లాలో జిల్లా సరాసరి 29.67 సెంటీమీటర్ల రికార్డు స్థాయిలో నమోదైన వర్షపాతం జనాన్ని అతలాకుతలం చేసింది. మున్నేరువాగు, ఆకేరువాగు, పాలేరు వాగులు పొంగి పొర్లడంతో అనేక గ్రామాలు, గిరిజన తండాలు నీటమునిగాయి. కేసముద్రం మండల పరిధిలోని అన్నారం వద్ద చెరువులు, కుంటలు నిండంతో పాటు కట్టలు తెగిపోవడం వల్ల రైల్వే ట్రాక్ తెబ్బతిని, రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మహబూబాబాద్, కేసముద్రం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులతో వెళ్లాల్సిన రైళ్లను నిలిపివేయడంతో ప్రయాణికులు వారి గమ్యస్థానాలకు చేరుకోలేక నానాఅవస్థలు పడ్డారు. తాడ్వాయి మండల వ్యాప్తంగా పంటపొలాల్లో ఇసుకమేటలు వేశాయి. నష్టపోయిన రైతులకు పరిహారం వెంటనే అందజేయాలని తాడ్వాయి మండలంలోని పలు గ్రామాల రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం వద్ద ఆకేరు వాగు పొంగి ప్రవహిస్తున్న విషయాన్ని గమనించకుండా ఎయిర్‌పోర్టు కోసం బయలు దేరిన ఖమ్మం జిల్లా కారేపల్లి తండాకు చెందిన తండ్రి, కూతురు సహా వారు ప్రయాణిస్తున్న కారు కూడా కొట్టుకుపోయిన ఘటనలో తండ్రికూతుళ్లు మరణించిన వార్త అందరినీ కలచివేసింది.గల్లంతైన నునావత్ మోతీలాల్ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఆకేరు ఏటికి కొద్ది దూరంలో అశ్విని మృతదేహం కారు ఆచూకీ లభించగా, మృతదేహాన్ని కారును ఒడ్డుకు చేర్చారు. అశ్విని మృతదేహానికి ఆదివారం పోస్ట్‌మార్టం నిర్వహించగా, సోమవారం మోతీలాల్ మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు మరిపెడ ఎస్‌ఐ బొలగాని సతీష్ తెలిపారు.

**మహబూబ్ నగర్‌లోనలుగురు మృతి: భారీగా పంట నష్టం**

గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఉమ్మడి పాలమూరు జిల్లా తీవ్ర నష్టాన్ని చవిచూసింది. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని నారంపేట జిల్లా మద్దూరు మండలం కొత్తపల్లిలో మట్టి ఇల్లు కూలి ఇద్దరు మృతి చెందారు. గద్వాల జిల్లా కేంద్రంలో, నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో మరో ఇద్దరు మృతిచెందారు. భారీ వర్షాల మూలంగా జిల్లాలోని చెరువులు కుంటలు పొంగి పొరుతున్నాయి. పత్తి, వరి, మొక్కజొన్న, కందులు తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కోట్లల్లో నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనాలు వేస్తున్నారు. కృష్ణా నదికి భారీగా వరద పోటెత్తడంతో జూరాల ప్రాజెక్టులోని 40 గేట్లను ఎత్తి నీటిని కిందికి వదిలారు. శ్రీశైలం ప్రాజెక్టులోని 10 గేట్లను ఎత్తి కిందికి నీటిని వదులుతున్నారు. మహబూబ్ నగర్ జిల్లాలోని కోయిల్ సాగర్ ప్రాజెక్టుకు సంబంధించి 13 గేట్లను ఎత్తి నీటిని కిందికి వదిలారు. జిల్లాలోని అన్ని రిజర్వాయర్లు నిండుకుండలను తలపిస్తున్నాయి.

**జనగామను కమ్మేసిన కారు మబ్బులు**

మూడో రోజు సైతం జనగామను వర్షం, కారు మబ్బులు కమ్మేశాయి. సోమవారం రోజంతా ముసురు వర్షం కురిసింది. భారీ వర్షాలతో చెరువులు నిండి అలుగు పోస్తున్నాయి. వరద ప్రభావం కొంత మేరకు తగ్గినా రోడ్డు డైవర్షన్లు తెగిన ప్రాంతాల్లో వాహన రాకపోకలు ఇంకా ప్రారంభం కాలేదు. వర్షం వలన జరిగిన నష్టాన్ని అధికారులు అంచనా వేస్తున్నారు. జనగామ జిల్లాలో 5వేల ఎకరాకు పైగా వరి, పత్తి పంట దెబ్బతిన్నట్లు ప్రాథమిక సమాచారం. ఇక జిల్లా కలెక్టర్‌తో పాటు అధికార యంత్రాంగ పూర్తిగా సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. సోమవారం భారీ వర్షమే కురిసింది. జిల్లా వ్యాప్తంగా 801మిల్లీ మీటర్ల నమోదు కాగా యావరేజ్‌గా 66.8 మిల్లీ మీటర్లు నమోదైంది. అత్యధికంగా బచ్చన్నపేలో నమోదు కాగా అత్యల్పంగా దేవరుప్పులలో 17.6 మిల్లీ మీటర్లు నమోదైంది. శనివారం రాత్రి నుండి, ఆదివారం మధ్యాహ్నం వరకు కురిసిన భారీ వర్షానికి హుస్నాబాద్‌కు వెళ్లే రహదారి నానుగుపహాడ్ వద్ద తెగిపోయింది, పాలకుర్తి రూట్‌లో పటేల్‌గూడెం వద్ద, నర్మెటకు వెళ్లె దారిలో మేకలగట్టు వద్ద రోడ్డు డైవర్షన్లు తెగాయి. ఇంకా పునరుద్ధరించకపోవడంతో రాకపోకలు పున: ప్రారంభం కాలేదు. దీనితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**కుండపోత.. తీరని వ్యథ...**

తుఫాన్ ప్రభావంతో కురిసిన కుండపోత వర్షం సూర్యాపేట వాసులను తీరని వ్యథకు గురి చేసింది. వరదలతో ప్రాణ, ఆస్తి, పంట నష్ట భారీ స్థాయిలో జరిగింది. తుఫాన్ ప్రభావంతో సూర్యాపేట జిల్లాలో గత నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం రాత్రి నుండి ఆదివారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. 30 సెంటిమీటర్ల వర్షపాతం రికార్డు స్థాయిలో నమోదైంది. అత్యధికంగా హుజూర్ నగర్, కోదాడ నియోజకవర్గాల్లో వర్షాలు నమోదు కాగా అదే స్థాయిలో నష్టం కూడా జరిగింది. తుఫార్ ప్రభావంతో జరిగిన నష్టంపై అధికారులు అంచనాలు వేసి ప్రభుత్వానికి నివేదికను అందజేశారు. జిల్లాలో మొత్తం 21 చెరువులు దెబ్బతినగా 15 గ్రామాల నుండి 2750 మందిని అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. 8 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు.

ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా ఏడు పశువులు మృత్యువాత పడ్డాయి. 7 పక్కా ఇండ్లు నేలమట్టం కాగా పాక్షికంగా 44 ఇండ్లు దెబ్బతిన్నాయి. వరద నీటితో 20వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. ఇది ఇలా ఉంటే హైద్రాబాద్‌విజయవాడ ప్రధాన రహదారి వర్షం దెబ్బకు ధ్వంసమైంది. అలాగే ఖమ్మంసూర్యాపేట, కోదాడ ఖమ్మం రహదారులు కూడా దెబ్బతినడంతో పాటు వరద నీరు రోడ్లపై చేరడంతో కోతకు గురయ్యాయి. దీంతో ఆయా ప్రాంతాల నుండి రాకపోకలు నిలిచిపోయాయి.

నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ప్రవహించే నడిగూడెం మండలం కాగిత రామచంద్రపురం వద్ద గండిపడింది. కాల్వ నీరు పెద్ద ఎత్తున పంట పొలాల నుండిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. కోదాడ మండలంలోని గోండ్రియాల గ్రామం నీట మునిగింది. కోదాడ నుండి మేళ్ళచెరువు వెళ్లే మార్గంలో కందిబండ చెరువులో నీరు భారీగా రావడంతో వరద ఉదృతికి వంతెనపై నిర్మించిన రోడ్డు బీటలువారి సోమవారం నాడు కూలిపోయింది. దీంతో ఆ మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. కోదాడ, హుజూర్‌నగర్, సూర్యాపేట పట్టణంలోని చెరువులు, కుంటలు, నాలాలు వర్షపు నీటితో ఉప్పొంగుతున్నాయి.

**పొంగి పోర్లుతున్నా చెరువులు,వాగులు,చెక్ డ్యాం**

ఎడతేరిపి లేకుండా గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షం మూలంగా సిద్దిపేటలో జనజీవన స్థంబించిపోయింది. సోమవారం ముసురు వానతో ముంచెత్తింది. సిద్దిపేట జిల్లా పరిధిలో కురిసిన వర్షం మూలంగా లోతట్టు ప్రాంతలన్ని జలమయమయ్యాయి.జిల్లా వ్యాప్తంగా చెరువులు, చెక్‌డ్యాంలు, వాగులు నిండి పొంగి పొర్లుతున్నాయి. సిద్దిపేట కోమటి చె రువు నిండి మత్తడి దూకుతోంది.

# 5న మరో అల్పపీడనం

(మొదటి పేజీ తరువాయి

ఉందన్నారు. హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాలలో రాగల 24 గంటల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుందన్నారు. నగరంలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు లేదా బలమైన ఈదురు గాలులతో ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందన్నారు. సోమవారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. పలు చోట్ల ఉరుములు, మెరుపులు, గంటకు 3040 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందన్నారు. మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అక్కడక్కడ వానలు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామన్నారు.

**ఆదివారమంతా కుంభవృష్టే..**

రాష్ట్రంలో ఆదివారమంతా కుంభవృష్టి కురిసింది. వరుణిడి దెబ్బకు రాష్ట్రమంతా తడిసి ముద్దైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. చాలా ప్రాంతాల్లో రోజంతా వర్షం కురుస్తునే ఉంది. పలు జిల్లాల్లో జనజీవనం స్తంభించిపోయింది. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి, చిన్నగూడురు మండలాల్లో ఆదివారం అత్యధికంగా 45 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అదే జిల్లాలోని నర్సింహులుపేట మండలంలో 40.5 సెం.మీల వర్షం కురిసింది. మొత్తంగా రాష్ట్రంలోని 16 మండలాల్లో 30 సెం.మీలకు పైగా వర్షపాతం నమోదైంది.

# నేడు 11 జిల్లాలకు భారీ వర్ష సూచన

ప్రాజెక్ట్ నుండి ప్రస్తుతం 20, వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని, ఈ నీటి పరిమాణం మరింత ఎక్కువైతే నే పరీవాహక ప్రాంతాల్లో తగు ముందు జాగ్రత చర్యలను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మహారా ష్ట్ర పరీవాహక ప్రాంతం నుండి వచ్చే వరద నీటిని ఎప్పటి కప్పుడు తెలుసుకొని తగు జాగ్రత్తలు చేప్టందుకు మహారాష్ట్ర అధికారులతో సమన్వ యం చేసుకోవాలని సూచించారు. కల్వర్టులు, వా గుల వద్ద సంబంధిత లైన్ విభాగం అధికారులతో సంయుక్త బృందాలను ఏర్పాటు చేసి నిఘా ఉంచాలని అన్నారు. హైదరాబాద్ నుండి ఏలాంటి సహాయ సహకారాలు కావాలన్న తమను సంప్రదించాలని కలెక్టర్లను కోరారు. జిల్లా కలెక్టరేట్ లలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ లు 24 / 7 పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. డిజిపి జితేందర్ మాట్లాడుతూ, మంగళవారం వరకు భారీ వర్ష సూచన ఉన్న జిల్లాల్లో ఎస్‌పిలు జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకొని పనిచేయాలని ఆదేశించామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించడానికి క్రేన్ లను కూడా సిద్ధంగా ఉంచుకోవాలని సూచించామన్నారు.



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా సోమవారం తన నివాసంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డిలతో కలసి వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పిస్తున్న దృశ్యం.

## వైఎస్‌కు చిన్నారెడ్డి ఘన నివాళి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దివంగత వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం హైదరాబాద్ లోని పంజగుట్ట సెంటర్‌లో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలువేసి రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి ఘనంగా నివాళులు అర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంతో పాటు నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన ఘనత వైఎస్సార్ కే దక్కుతుందని చిన్నారెడ్డి కొనియాడారు. వైఎస్సార్‌లేని లోటు తీర్చలేదని, ఆయన పాలన ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో చిరస్థాయికగా నిలిచిపోతుందని తెలిపారు.



## వైఎస్ఆర్‌కు కాంగ్రెస్ శ్రేణులు నివాళి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డికి కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నివాళ్లు అర్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం ఎక్కడికక్కడ వైఎస్ విగ్రహాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘంటించారు. వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా గాంధీ భవన్ లో టిపిసిసి కార్య నిర్వహక అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఎంపీ అనిల్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, రోహిన్ రెడ్డి, చల్లా నర్సింహారెడ్డి, నిరంజన్, కుమార్ రావ్, అల్లం భాస్కర్, మెట్టు సాయి కుమార్, బొజ్జ సంధ్యా రెడ్డి, ప్రేమలత అగర్వాల్ తదితరులు వైఎస్ఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అంతకు ముందు పంజాగుట్ట లోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలు చల్లి నివాళులు అర్పించారు.

## పారదర్శకంగా యువజన కాంగ్రెస్ ఎన్నికలు

### ఎంఎల్‌సి మహేష్ కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** యువజన కాంగ్రెస్ ఎన్నికలు పారదర్శకంగా జరగాలని ఎంఎల్‌సి, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ (ఇంచార్జ్ ఆర్గనైజేషన్) మహేష్ గౌడ్ పేర్కొన్నారు. సోమవారం గాంధీభవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు పారదర్శకంగా సజావుగా జరగాలంటే రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఎవరు ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన వద్దు అని ఎఐసిసి ఆదేశించిందన్నారు. నాయకులు అందరూ ఎఐసిసి సూచనలు పాటించి యువజన కాంగ్రెస్ ఎన్నికలు ప్రజాస్వామ్య బద్ధంగా సజావుగా జరిగేలా సహకరించగలని విజ్ఞప్తి చేశారు.



## 'బ్రహ్మకుమారీస్'ఒప్పందం ఉపసంహరించుకోవాలి

### ఎంఎల్‌సి కోదండరామ్‌కు ఎఐవైఎఫ్ వినతిపత్రం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎస్‌సి గురుకులాల్లో మానసిక ఉల్లాస తరగతులకు ఆధ్యాత్మికం పేరుతో మత రాజకీయాలను బోధించేందుకు బ్రహ్మకుమారీస్ సంస్థతో చేసుకోనున్న ఒప్పందాన్ని ఉపసంహరించుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఎఐవైఎఫ్)రాష్ట్ర అధ్యక్షుడువలి ఉల్లా ఖాద్రీ, , ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఒప్పందం రద్దయ్యేలా చూడాలని, శాస్త్రీయ దృక్పథాన్ని దెబ్బతీసేలా గురుకుల కార్యదర్శి నిర్ణయాలపై చర్యలు తీసుకోవాలని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని టిజెఎస్ అధ్యక్షుడు, ఎంఎల్‌సి ప్రొఫెసర్ కోదండరామ్‌ను కోరారు. ఈ మేరకు ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఎంఎల్‌సి కోదండరామ్‌ను కలిసి వారు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. అధ్యాత్మికం పేరుతో మత ఛాందస విధానాలను బోధించే బ్రహ్మకుమారీస్ సంస్థతో చేసుకోనున్న ఒప్పందాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఉల్లా ఖాద్రీ,కల్లూరు ధర్మేంద్ర అన్నారు. ఆర్ఎస్ ఎస్ భావజాలాన్ని విద్యార్థుల మెదల్లోకి చొప్పించే విధంగా బ్రహ్మకుమారీస్ సంస్థతో ఒప్పందం ఉన్నదని ఆరోపించారు. గురుకులాల పరిధిలోని విద్యార్థుల్లో ఆందోళనను తగ్గించి, ఆత్మహత్యలను అరికట్టేందుకు వారికి అవగాహన కల్పించడంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించే చర్యలు అభినందనీయమని, ఈ తరగతుల్లో ప్రధానంగా ధ్యానం, మోటివేషన్, ఆందోళన నుంచి బయటపడేలా సైకాలజిస్టులతో క్లాసులను ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్‌సి గురుకులాల్లో చేపట్టిన ఉపాధ్యాయుల బదిలీల్లో స్టూడెంట్ కౌన్సెలింగ్ సెల్ మూతపడిందని, వాటిని సత్వరమే నియామకాలు చేపట్టి కౌన్సిలర్లు,మానసిక నిపుణుల పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎ ఐ వై ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి. సత్య ప్రసాద్ పాల్గొన్నారు.

## ప్రజల మధ్యనే ప్రభుత్వం ఉండాలి

### జగదీష్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వర్షాల కారణంగా మృతిచెందిన మృతుల కుటుంబాలకు రూ 25 లక్షల ఎక్స్‌గ్రేషియాను చెల్లించాలని బిఆర్ఎస్ మాజీ మంత్రి జి.జగదీష్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం, ప్రజల మధ్యనే ఉండాలని సూచించారు. హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంఎల్‌సి శేరి సుభాష్ రెడ్డితో కలిసి జి.జగదీష్ రెడ్డి మాట్లాడుతూ వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా 20 జిల్లాల్లో వర్ష ప్రభావం ఉన్నదన్నారని చెప్పారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో ప్రభుత్వంవిఫలమైందని ఆరోపించారు. గంటల తరబడి బాధితులు ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూశారన్నారు. కోదాడలో ఎవరి హయాంలో కబ్జాలు జరిగాయో చర్చకు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సిద్ధమా అనిజగదీష్ రెడ్డి సవాల్ విసిరారు.

# ప్రభుత్వ ఆసుపత్రులలో భద్రత కట్టుదిట్టం

ఈనెల 14 వరకు ప్రభుత్వానికి నివేదిక

మంత్రి దామోదర రాజనర్సింహ్మ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వ ఆసుపత్రులలో భద్రతను కట్టుదిట్టం చేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. మహిళా వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది, నర్సింగ్ ఆఫీసర్లకు రక్షణగా 'షీ టీమ్' బృందాలతో రాత్రి సమయంలో పెట్రోలింగ్ నిర్వహించేలా నిబంధనలు రూపొందించాలన్నారు. అన్ని టీచింగ్ హాస్పిటల్‌లలో శాశ్వత ప్రతిపాదికన అవుట్ పోస్టులను నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సుప్రీంకోర్టు నిబంధనల మేరకు రాష్ట్ర, జిల్లా స్థాయిలలో హాస్పిటల్స్ సేఫ్టీ కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు, భద్రతాపరమైన నియమాలను రూపొందించాలని ఆదేశించారు. దీనికి సంబంధించి ఈ నెల 14 వరకు ప్రభుత్వానికి నివేదిక ను సమర్పించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు, మెడికల్ కాలేజీలలో సెక్యూరిటీ బలోపేతం అంశంపైన సుప్రీం కోర్టు నిబంధనలపైన హైదరాబాద్‌లోని సచివాలయంలో సోమవారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో తెలంగాణ మెడికేర్ సర్వీస్, పర్స న్స్, మెడికేర్ సర్వీస్ ఇనిస్టిట్యూషన్స్ చట్టాలపైన చర్చించారు. ఆస్పత్రి వైద్యులు, నర్సులు భద్రతలో భాగంగా 'యాక్ట్ 11 ఆఫ్ 2008' ప్రకారం కేసును నమోదు చేయాలని ఈ సమీక్షలో నిర్ణయించారు. ఇప్పటివరకు నమోదైన కేసుల వివరాలను వెంటనే సమర్పించాలని మంత్రి అధికారులకు ఆదేశించారు.

ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న టిమ్స్ ఆసుపత్రులలో ఇప్పటికే పోలీస్ అవుట్ పోస్టులను నిర్మించేందుకు స్థలాన్ని కేటాయించామని, రాష్ట్రంలో 10 టీచింగ్ ఆస్పత్రిలో ఇప్పటికే పోలీస్ అవుట్ పోస్టులను నిర్మించామని తెలిపారు. ప్రైవేటు సెక్యూరిటీ ఏజెన్సీలు తప్పని సరి గా పిఎస్ఎఆర్ (ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ రెగ్యులేషన్స్)చట్టం 2015 ప్రకారం గుర్తింపు పొంది ఉండాలన్నారు. రాష్ట్రంలో అన్ని స్థాయిల (పిహెచ్‌సి స్థాయి నుండి అన్ని ఏరియా హాస్పిటల్స్ వరకు)ఆస్పత్రులలో భద్రతను కట్టుదిట్టం చేసేందుకు సిసి కెమెరాలను స్థానిక పోలీస్ స్టేషన్లకు అనుసంధానం చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. భద్రతపై స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ను (ఎస్‌ఒపి)రూపొందించాలన్నారు. ఆస్పత్రి వైద్యశాఖ అధికారులు, స్థానిక పోలీసులు సమన్వయంతో భద్రతను బలోపేతంచేసే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ఉమ్మడి 10 జిల్లాల ప్రతిపాదికన ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి కేసుల విచారణను వేగవంతమయ్యేలా కృషి చేయాలని అధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. హోం శాఖ, వైద్య ఆరోగ్యశాఖ విడివిడిగా సంయుక్తంగా చేపట్టాల్సిన చర్యలపై మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. ప్రతి ఆసుపత్రిలో సెక్యూరిటీ హౌజ్ ను ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షను రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి రవిగుప్త, రాష్ట్ర స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ అదనపు డైరెక్టర్ జనరల్ అనిల్ కుమార్, రాష్ట్ర ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్ వి కర్ణన్, రాష్ట్ర న్యాయ శాఖ కార్యదర్శి రెండ్ల తిరుపతి , రాష్ట్ర మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ వాణి, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్, ఎంఎన్‌జె క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు, ఎస్‌పిఎఫ్ అధికారులు త్రినాథ్ పాల్గొన్నారు.

## అధిక ధరలకు కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణం:విఎస్.బోస్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అన్ని రకాల వస్తువులఅధిక ధరలకు కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్ ఆరోపించారు. రైతులను ఆదుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆయన ధ్వజమెత్తారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దోపిడీదారులైన పెట్టుబడిదారులకు తలుపులు బార్లాతెరిచి ఉంచారని మండిపడ్డారు.ప్రపంచంలో చమురు ధరలు తగ్గినా మన దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గకపోవటంతో రవాణా ఖర్చులు పెరిగి ధరలు పెరగటం ఒక కారణమైతే, లాభాలే ప్రధానంగా చూసే కార్పొరేట్ సంస్థలకు రిటైల్ వ్యాపారంలో అనుమతించటం మరో ముఖ్యమైన కారణమని అన్నారు.

నిత్యావసర వస్తువుల వ్యాపారంలో కార్పొరేట్ సంస్థలను తొలగించి ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థను విస్తరించి బలోపేతం చేయాలని, ప్రజలకు అవసరమైన నిత్యావసర వస్తువులన్నీ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారానే ప్రజలకు అందించాలని కోరారు. అదేవిధంగా బ్లాక్ మార్కెట్ దారులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఇలాంటి చర్యలు కేంద్ర ప్రభుత్వం నిక్కచ్చిగా అమలు చేస్తే నిత్యావసర వస్తువుల ధరలు తగ్గటానికి నూటికి నూరు శాతం అవకాశం ఏర్పడుతుందని అభిప్రాయడ్డారు. అప్పుడు నిత్యావసర ధరలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

# బాధితులకు పోలీసుల చేయూత

### డిజిపి డాక్టర్ జితేందర్





**ప్రజాపక్షం/హైదరాబాద్:** వరద ముంపు ప్రాంతాల్లో బాధితులకు సహాయ సహకారాలు అందించిన పోలీసులను డిజిపి డాక్టర్ జితేందర్ అభినందించారు. పోలీసులు, జిల్లా యంత్రాంగం సహకారంతో, కేసముద్రం నుండి కాజిపేట రైల్వే స్టేషన్కు మొత్తం 72 బస్సులు బయలుదేరి, 5616 మంది ప్రయాణికులను తరలించాయి. కేసముద్రం స్టేషన్ నుండి ప్రయాణికుల అందరినీ తరలించారు. యంత్రాంగం 16 గంటలకు పైగా నిరంతరం పనిచేసింది. ఎక్కువ గంటల పాటు ఆహారం, నీరు మరియు ఇతర సౌకర్యాలు అందించాయి. రైల్వే వారు తమ గమ్యస్థానాలకు రైళ్లు ఏర్పాటు చేశారు. వరంగల్, మహబూబాబాద్ కలెక్టర్లు, కమిషనర్లు, ఎస్‌పిలు మరియు వారి బృందాలను డిజిపి అభినందించారు. భారీ వర్షాల బారిన పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్న పలువురిని రాష్ట్ర పోలీసు యంత్రాంగం నిరంతరం అప్రమత్తతతో ఆదుకుంది. మహబూబాద్ జిల్లా కేసముద్రం రైల్వే ట్రాక్ కింద ఉన్న కంకర కొంత భాగం కొట్టుకపోవడంతో రైలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న తరుణంలో స్థానిక పోలీస్ సిబ్బంది వారికి ఆహారం, సదుపాయం కల్పించి ఆదుకున్నారు. నాగర్ కర్నూలు జిల్లాలో వరద నీటిలో కొట్టుకుపోతున్న వ్యక్తిని పోలీస్ సిబ్బంది కాపాడి ప్రాణాపాయం నుంచి తప్పించారు. జిల్లాల ఎస్పీలు వారి వారి ప్రాంతాల్లో తిరుగుతూ పోలీస్ సిబ్బందిని అప్రమత్తం చేశారు.ములుగు జిల్లా ఎస్‌పి డాక్టర్ శబరీష్ ములుగు జిల్లాలోని పాస్ర నుండి తాడ్వాయి మధ్య గల జలగలించ వాగు ఉధృతంగా ప్రవహించడంతో పోలీస్ సిబ్బంది నియమించారు. జోగులాంబ గద్వాల్ ఎస్‌పి పి. శ్రీనివాసరావు జిల్లా కలెక్టర్ తో కలిసి ఎర్రబెల్లి వాగును సందర్శించారు. కోదాడ పట్టణంలో శ్రీరంగాపురం వద్ద వరదలు చిక్కుకున్న మూడు బస్సుల ప్రయాణికులను పోలీసులు కాపాడారు. చంద్రుగొండ మండలం సీతయ్య గూడెం వద్ద వెంగల్ రావు ప్రాజెక్టు వరద ఉధృతిని , గోధుమ వాగు ఉధృతిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్‌పి రోహిత్ రాజు పరిశీలించారు. భద్రాద్రి కోతగూడెం జిల్లాలో ఎస్‌పి రోహిత్ రాజు, కలెక్టర్ జితేష్ వి. పాటిల్తో కలిసి, మనుగూరు ప్రాంతంలో వరద పరిస్థితిని పరిశీలించారు. మెదక్ జిల్లా ఎస్‌పి ఉదయ్ కుమార్ రెడ్డి ఏడుపాయల వద్ద వరద ప్రాంతాలను పరిశీలించారు. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలంలో జిల్లా ఎస్‌పి సన్ ప్రీత్ సింగ్ ద్విచక్ర వాహనంపై తిరిగి వరద ప్రాంతాల పరిస్థితులను తెలుసుకున్నారు. సిద్దిపేట కమిషనర్ బి.అనురాధ మందపల్లి వాగును పరిశీలించి అధికారులను అప్రమత్తం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్‌పి అఖిల్ మహాజన్, నల్గొండ జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్, వికారాబాద్ జిల్లా ఎస్‌పి కె. నారాయణ రెడ్డి, కామారెడ్డి జిల్లా ఎస్‌పి సింధు శర్మ తదితరులు వరద ప్రాంతాన్ని సందర్శించారు. భారీ వర్షాలకు రోడ్లపై పడి ఉన్న చెట్లను వాహనాలను స్థానిక పోలీస్ సిబ్బంది తొలగించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ. శాంతి కుమారి, డిజిపి డాక్టర్ జితేందర్ పర్యవేక్షణలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పోలీస్ అధికారులు, కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు ఈ వరద సహాయక కార్యకలాపాల్లో పాల్గొన్నారు.



## వరద నష్ట నివారణ చర్యలు తక్షణమే చేపట్టాలి : ఎఐకెఎంఎస్ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర వ్యాప్తంగా గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వేలాది గ్రామాలు జలదిగ్బందనంలో చిక్కుకోవడంతో పాటు పలు జిల్లాల్లో పంటలకు తీవ్ర నష్టం వాట్లిడంతో రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని అఖిల భారత రైతుకూలీ సంఘం(ఎఐకెఎంఎస్) అధ్యక్షులు మామిడాల బిక్షపతి, కార్యదర్శి గౌని ఐలయ్యలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్షాలు కారణంగా మృతి వాత పడ్డ 18 మంది కుటుంబాలకు రూ.25లక్షల చొప్పు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు.అదేవిధంగా ప్రాథమిక అంచనా ప్రకారం ఇప్పటి వరకు రాష్ట్రంలో 15 లక్షల ఎకరాల్లో పంట నష్టం సంభవించిందని, నష్టపోయిన పంటల వివరాలను రికార్డు చేసి తగిన నష్టపరిహారాన్ని అందించడంతోపాటు వరద కోతకుగురైన,ఇసుక మేటలు వేసిన భూములు సాగులోకి తెచ్చుకొనేందుకు ఆర్థిక సహాయం చేయాలని కోరారు. ఇంకా వర్షం, వరద ప్రమాదం పొంచి ఉన్నందున ముందస్తుగానే తగిన సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## 'కులగణన'పై 48 గంటల్లో రూట్ మ్యాప్

### కలెక్టరేట్ ముట్టడిలో బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో సమగ్ర కుల గణన చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం 48 గంటల్లోగా రూట్ మ్యాప్‌ను ప్రకటించాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డియాండ్ చేశారు. బిసి రిజర్వేషన్లు పెంచిన తర్వాతే గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని, లేదంటే ఈనెల మూడవ వారంలో లక్షలాది మందితో హైదరాబాదును దిగ్బందిస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో సమగ్ర కులగణను వెంటనే ప్రారంభించి, బిసి రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తూ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యాప్త కలెక్టరేట్‌ల ముట్టడికి పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు కుందారం గణేష్ చారి ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. అనంతరం జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలోని బిసి ప్రతినిధుల బృందం జిల్లా కలెక్టర్ అనుదీప్ దుశెట్టికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ అఖిలపక్ష పార్టీలు, వివిధ ప్రజాస్వామిక సంఘాలు, ఉద్యమ సంస్థలు ముక్తకంఠంతో కులగణనను చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నప్పటికీ, ప్రభుత్వం దాటవేత వైఖరి అవలంభించడం చాలా దారుణమన్నారు. కులగణన సాధన కోసం తాము ఏ సమయంలోనైనా మెరుపు ధర్నాలకు దిగుతామని, రాష్ట్రవ్యాప్తంగా రాస్తారోకోలు, రహదారుల దిగ్బంధం, రైలు రోకోలు, మంత్రుల నివాసం ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టి, చివరగా అవసరమైతే రాష్ట్ర బందుకు కూడా వెనుకాడబోమని జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిసి కుల సంఘాల జెఎసి చైర్మన్ కుందారం గణేష్ చారి, కన్వీనర్ బాలగాని బాలరాజు గౌడ్, వేముల వెంకటేష్ బి మనిమంజరి, బిసి జన సైన్యం రాష్ట్ర అధ్యక్షుడు సింగం నగేష్, బిసి సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మాదేశి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మరింత అప్రమత్తంగా ఉన్నాం

### ఫైర్ డిజిపి నాగిరెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** వర్షాలతో అతలాకుతం అయిన రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో అధికారులు, సిబ్బంది సహాయకచర్యల్లో నిమగ్నమయ్యారని అగ్నిమాపక శాఖ డిజిపి వై.నాగిరెడ్డి తెలిపారు.మూడు రోజులుగా సాగుతున్న సహాయక చర్యల్లో 1662 మందిని రక్షించినట్లు తెలిపారు. కామారెడ్డిలో 105 మంది, ఖమ్మంలోని ఇందిరానగర్ కాలనీలో 50 మంది, మహబూబాబాద్‌లో 100 మంది, ములుగుజిల్లాలోని కొండి గ్రామంలో చిక్కుకున్న 150 మంది, సూర్యపేటలోని కోదాడా, షిరిడిసాయినగర్‌లో 450 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఖమ్మం సహాయక ఆపరేషన్‌లో గౌలిగూడ, శామీర్‌పేట్, నల్గొండ ఫైర్ స్టేషన్ అధికారులు పాల్గొన్నారన్నారు. ఎక్కువగ నష్టం కలిగిన ఖమ్మంలో 11 బోట్‌లతో పాటు వంద మంది సిబ్బంది, నల్గొండ, నాగర్‌కర్నూల్, సంగారెడ్డి, హన్మకొండ, ఖమ్మం జిల్లాల ఫైర్ అధికారులు సహాయక చర్యలో పాల్గొంటున్నారన్నారు. రహదారులకు కిరువైపుల కూలిపోయిన చెట్లను తొలగించడంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారని నాగిరెడ్డి తెలిపారు.

మిషన్‌ల సహాయంతో చెట్లను రహదారులపై నుంచి తొలగించడం జరిగిందన్నారు. ఇక వరదలో కొట్టుకుపోతున్న ఎనిమిది వాహనాలను చాకచక్యంతో ఒడ్డుకు చేర్చారు. వరదలో మరణించిన ముగ్గురి మృతదేహాలను తరలించి వారి బంధువులకు అప్పగించడం జరిగిందన్నారు.మరో 11 జిల్లాలలో వర్షప్రభావం ఉందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి హెచ్చరికలు జారీ చేయడంతో తమ సిబ్బంది ఆయా జిల్లాల్లోనే ఉండాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. సహాయక చర్యలు ఇంకా ముగిసిపోలేదని రానున్న వర్షాలను దృష్టిలో పెట్టుకుని మరింత అప్రమత్తంగా ఉన్నామన్నారు.



# సూర్యాపేట జిల్లాలోనే విద్యుత్‌శాఖకు భారీ నష్టం

వర్షాలు తగ్గేవరకూ మరింత అప్రమత్తంగా ఉండాలి

టెలీకాన్ఫరెన్స్‌లో టిజి ఎస్‌పిడిసిఎల్ సిఎండి ముషారఫ్ ఫరూఖీ



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** సూర్యాపేట్, జిల్లాలో వర్షాల ప్రభావంతో విద్యుత్ వ్యవస్థకు భారీ నష్టం జరిగిందని దాదాపు 1200 వందలకు పైగా విద్యుత్ స్తంభాలు నాలుగు సబ్ స్టేషన్లు దెబ్బతిన్నాయన్నాయని టిజి ఎస్‌పిడిసిఎల్ సిఎండి ముషారఫ్ ఫాఫరూఖీ అన్నారు. జిల్లాల, సర్కిళ్ల చీఫ్ ఇంజినీర్ల తో, సూపెరింటెండింగ్ ఇంజినీర్లతో విద్యుత్ సరఫరా పరిస్థితిపై సోమవారం ఆయన టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈదురు గాలులకు భారీ వృక్షాలు ఇతర వస్తువులు విద్యుత్ తీగలపై పడటంతో పెద్ద సంఖ్యలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయన్నారు. ముందుగా కూలిన భారీ చెట్లను వాటి కొమ్మలను తొలగించి, వాటి స్థానంలో కొత్త పోల్స్, లైన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. గత రెండు రోజుల నుండి భారీ వర్షాలు కురుస్తున్నా, వర్షాన్ని, వరదలను సైతం లెక్కచేయకుండా చాలా సాహసోపేతంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేపడుతున్న సిబ్బందిని సిఎండి అభినందించారు. సూర్యాపేట్ జిల్లాలో విద్యుత్ వ్యవస్థకు భారీ నష్టం జరిగిన క్రమంలో ప్రస్తుతం సంస్థ పరిధిలో 2417 విద్యుత్ స్తంభాలు, 21 డిటిఆర్ స్ట్రక్చర్స్, 18 సబ్ స్టేషన్స్ దెబ్బతిన్నాయన్నారు. వీటిలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 412 విద్యుత్ స్తంభాలు, 13 డిటిఆర్ స్ట్రక్చర్స్ దెబ్బతిన్నాయని నష్టం ఇంకా పెరిగే అవకాశమున్నదని అన్నారు. రాష్ట్రంలో ఇంకా భారీ వర్ష ముప్పు తొలగనందున అధికారులు, సిబ్బంది హెడ్ క్వార్టర్‌లోనే అందుబాటులో ఉండాలని, సెలవులు పెట్టుకోకుండా వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగుండా చూడాలన్నారు. పునరుద్ధరణ పనులు చేసేటప్పుడు సిబ్బంది తప్పని సరిగా స్వీయ జాగ్రత్తలు పాటించాలన్నారు.


దేవాదాయ ధర్మాదాయ శాఖ

**శ్రీ వీరభద్రస్వామి దేవస్థానము, కొత్తకొండ.**

మం|| భీమదేవరపల్లి, జి|| హనుమకొండ-505471. Email : sriveerabhadraswamydevastanam@gmail.com

లేఖ నెం.SVBST/48/2024 తేది: 02-09-2024

నోటిఫికేషన్ మెమో నెం.ఎఫ్4/8228/2024 ది:28.08.2024 శ్రీయుత కమిషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, హైదరాబాద్ వారి ఉత్తర్వుల ప్రకారము.

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, శ్రీ వీరభద్రస్వామి దేవస్థానము, భీమదేవరపల్లి మండలం. హనుమకొండ జిల్లాకు దేవాదాయ చట్టము 30/1987 (సవరించబడిన చట్టము 33/2007, తెలంగాణ ఆర్డినెన్స్ నెం. 3/2016 ననుసరించి) సెక్షన్ 15 ఉప సెక్షన్ - 1 కి లోబడి **వంశపారంపర్యం కాని ధర్మకర్తల మండలి** నియమింపబడును. కావున **ఆసక్తి గల అభ్యర్థులు ధర్మకర్తలుగా నియామకం కొరకు** వారి ధరఖాస్తులను సెక్షన్ 17నందలి ఉప సెక్షన్ - 3 ననుసరించి నిర్ణీత ప్రొఫార్మా (ఫారము - 1) లో ఈ నోటీసు ప్రచురించబడిన తేదీ నుండి 20 రోజుల లోపు శ్రీయుత డైరెక్టర్ మరియు అదనపు కమిషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, హైదరాబాద్ / శ్రీయుత ఉప కమిషనర్ / శ్రీయుత సహాయ కమిషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, వరంగల్ వారికి పంపవచ్చును.

సం/- శైలజా రామయ్యర్

DIPR R.O. No. : 3616-PP/CL/ADVT/1/2024-25 Date: 02-09-2024 ప్రిన్సిపల్ సెక్రటరీ టు గవర్నమెంట్

**శ్రీ సోమేశ్వర లక్ష్మి నరసింహస్వామి దేవస్థానము**

పాలకుర్తి గ్రా|| & మం||, జనగామ జిల్లా

Letter No. SSLNST/Tender Notice/2024. (సీల్డ్ టెండర్-కం-బహిరంగ వేలము) తేది: 31.08.2024.

దేవాదాయ ధర్మాదాయశాఖ, జనగామ జిల్లా, పాలకుర్తి గ్రా|| & మం|| శ్రీ సోమేశ్వర లక్ష్మి నరసింహస్వామి దేవస్థానము నందు తేది: 14.09.2024 శనివారము రోజున ఉ.11:00 గం.ల నుండి సీల్డ్ టెండర్-కం-బహిరంగ వేలము ద్వారా ఈ క్రింద తెలిపిన పద్దులపై టెండర్లు కోరబడుచున్నవి. పూర్తి వివరాలకోసం దేవస్థాన కార్యాలయమును సంప్రదించగలరు.

| క్ర.సం. | వేలము వివరములు | డిపాజిట్ సొమ్ము | కాలపరిమితి |
|---|---|---|---|
| 01. | కొబ్బరి కాయలు మరియు ఇతర పూజా సామాగ్రి(అభిషేక సామాగ్రి, వాహన పూజా సామాగ్రి మినహాయించి) అమ్ముకొను హక్కు | రూ.5,00,000/- | తేది: 20.11.2024 నుండి 19.11.2025 వరకు |
| 02. | తలనీలాలు ప్రోగుచేసుకొను హక్కు | రూ. 5,00,000/- | తేది: 21.10.2024 నుండి 20.10.2025 వరకు |
| 03. | కొబ్బరిచిప్పలు ప్రోగుచేసుకొను హక్కు | రూ.1,00,000/- | తేది: 04.01.2025 నుండి 03.01.2026 వరకు |

DIPR R.O. No. : 3584-PP/CL/ADVT/1/2024-25 Date: 02-09-2024 సం/- కార్యనిర్వహణాధికారి

## గ్రేటర్ హైదరాబాద్‌లో.. పూర్తి స్థాయి నీటి సామర్థ్యం దాటిన చెరువులు

**ఎఫ్‌టిఎల్ దాటిన 31 చెరువులు**

**ఎఫ్‌టిఎల్ చేరువలో మరిన్ని చెరువులు**

**ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్న అధికారులు**

**దిగువకు నీటి విడుదలకు ఏర్పాట్లు**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారీ వర్షాలకు గ్రేటర్ హైదరాబాద్‌లోని చెరువులు ఫుల్ అయ్యాయి. మొత్తం 185 చెరువులు ఉండగా, దాదాపు అన్నింటికి వరదనీరు వచ్చి చేరుతుంది. ఇందులో 31 చెరువులు ఎఫ్‌టిఎల్‌ను దాటిపోయాయి. ప్రధానంగా హుస్సేన్ సాగర్‌తో పాటు కూకట్ పల్లిలోని ఐడిఎల్ చెరువు, మైసమ్మ చెరువు, ఎల్లమ్మ చెరువు, పరికి చెరువు, హస్మత్ పేట్‌లోని హస్మత్ చెరువు, మూసాపేట్‌లోని కాముని చెరువు, నాచారంలోని పెద్ద చెరువు, పటేల్ చెరువు, ఖానా మేట్‌లోని తమ్మిడికుంట చెరువు, లింగంపల్లి గోపీ చెరువు, నల్లగండ్ల చెరువు, రాయిదుర్గ్‌లోని మల్కాచెరువు, బండ్ల గూడలోని చెరువు, హఫీజ్ పేట్ కైదమ్మ చెరువు, మదీనాగూడ ఈర్ల చెరువు, ఉప్పల్ నల్లచెరువు, యాప్రాల్ నాగిరెడ్డి కుంట, బహదూర్ పురా మిరాలంట్యాంక్, గాజులరామారం పెద్ద చెరువు, జీడిమెట్ల వెన్నచెరువు, సూరారం లింగంచెరువు, కుత్బుల్లాపూర్ హెచ్‌ఎంటి చెరువు, మణికొండ ఎల్లమ్మ చెరువు, గోల్కొండ లంగర్ హౌస్ ట్యాంక్, షేక్ పేట్ కొత్త చెరువు, బత్తూర్ చెరువులు ఫుల్ ట్యాంక్‌ని దాటిపోయాయి. అల్లాపూర్‌లోని సున్నం చెరువు, ఆర్సీపురంలోని రాయసముద్రం, హకీంపేట్‌లోని లోటస్‌పాండ్, గచ్చిబౌలిలోని గుండ్లకుంట చెరువులు ఎఫ్‌టిఎల్‌కు చేరువలో ఉన్నాయి. ఎప్పటికప్పుడు నీటి లేవల్స్‌ను జిహెచ్‌ఎంసి అధికారులు పరిశీలిస్తున్నారు. అవసరమైతే నీటిని బయటకు విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు

**ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి**

**కడెం ప్రాజెక్టును సందర్శించిన రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు**



**ప్రజాపక్షం/ప్రతినిధినిర్మల్ :** జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం రాత్రి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్‌పి జానకి షర్మిల, ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ లతో కలిసి కడెం ప్రాజెక్టును పరిశీలించారు. ప్రాజెక్టులోని వరద నీరు ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో వివరాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.మంత్రి మాట్లాడారు. వర్షాల కారణంగా ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. జిల్లాలోని ఖానాపూర్, దస్తురాబాద్, పెంబి మండలాలలో అధిక వర్షపాతం నమోదు అయినందున నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల వలన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ మంత్రికి వివరించారు. కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి అవసరమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. చెరువులో వాగుల సమీపంలోకి ప్రజలు వెళ్లకుండా రెవెన్యూ, పోలీస్ అధికారులను అప్రమత్తం చేయడం జరిగిందని తెలిపారు. రోడ్లపై వాగులు ప్రవహిస్తున్న చోట్ల బారికేడ లు ఏర్పాటు చేసి ప్రజలు, వాహనాలు వెళ్లకుండా జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ హైమద్ కిషోర్ కుమార్, డిఆర్ఓ భుజంగరావు, ఆర్డిఒలు రత్న కళ్యాణి కోమల్ రెడ్డి, డిఎస్‌పి గంగారెడ్డి, పోలీసు రెవెన్యూ నీటిపారుదల శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విపత్కర పరిస్థితుల్లో బురద రాజకీయం చేయొద్దు

**కేంద్రం నుంచి నిధులు రాబట్టాల్సిన సమయంలో అనవసర ఆరోపణలకు దిగొద్దు**

**బిఆర్‌ఎస్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం**

**వరదప్రభావిత ప్రాంతాల్లో పర్యటన**





**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్రం విపత్కర పరిస్థితులలో ఉంటే ప్రధాన ప్రతిపక్షం బురద చల్లే ప్రయత్నం చేస్తూ బురద రాజకీ యాలకు దిగిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఈ కష్ట సమ యంలో ప్రతిపక్షం, అధికార పక్షం కలిసి ప్రజ లకు చేరువై కేంద్రం నుంచి నిధులు రాబట్టాల్సిన సమయంలో అనవసర ఆరోపణలకు దిగుతున్నారన్నారు.ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వాన్ని విపక్షం నిలదీసినా ఫర్వాలేదు కానీమౌనవ్రతం ప్రతిపక్ష నాయకుడు చేపట్టడం సరి కాదన్నారు. అమెరికాలో తన స్నేహితులతో కలిసి ఎంజాయ్ చేస్తున్న కేటిఆర్ ఖమ్మంలో మంత్రులే లేరని వ్యాఖ్యానించడం బాధాకరమని ఆయన ట్విట్టర్‌లోనే కనపడుతూ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని రేవంత్ రెడ్డి విమర్శించారు. మంత్రులు భట్టి, తుమ్మల, పొంగులేటి రెండు రోజులుగా జిల్లాలో ఉండిసహాయ సహకరాలు అందిస్తుంటే అమెరికాలో ఉన్న కేటిఆర్‌కు ఏమి కనపడుతుందన్నారు. తెలం గాణ ను పదేళ్ల పాలించి లక్షల కోట్లు దోచుకున్నారని మాజీ ఉప రాష్ట్ర పతి వెంకయ్యనాయుడుస్పందించి ఆర్థిక సాయం ప్రకటించినంత మాత్రం కూడా బిఆర్‌ఎస్ ప్రకటించ లేదన్నారు. బిఆర్‌ఎస్ వెయ్యి, రెండువేల కోట్లో ప్రకటించాలన్నారు. ప్రజలను అన్ని విధాలా ఆదుకోవడమే లక్ష్యంగా పనిచేస్తామని రేవంత్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గం ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విచ్చేశారు. తొలుత పాలేరు నియోజక వర్గంలోని పాలేరు ప్రాజెక్టును పరిశీలించారు. పలు చోట్ల దెబ్బతిన్న రోడ్లను పరిశీలించి ఖమ్మం సమీపంలోని మున్నేరు వరద బాధిత ప్రాంతాలలో పర్యటించారు. రాజీవ్ గృహ కల్ప, బొక్కలగడ్డ, మోతినగర్ తదితర ప్రాంతాలలో పర్య టించి ప్రజలు అధైర్యపడవద్దని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుం టుందని అభయమిచ్చారు. తక్షణసాయం అందిస్తామని తెలిపారు. అనంతరం సహచర మంత్రులు మల్లు భట్టివిక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి తదితరులతో కలిసి కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. అధికారులు , ప్రజాప్రతినిధులతో ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని పరిస్థితి, నష్టాలను, ప్రజల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో భారీ వర్షాల కారణంగా తీవ్ర నష్టం వాటిల్లిందని దీనిని కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా గుర్తించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. ప్రాథమిక అంచనా ప్రకారం రూ.5,438 కోట్లు నష్టం జరిగినట్లు తెలిందని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా ఆలోచన చేసి నిధులు విడుదల చేయాలని ప్రధాన మంత్రి తెలంగాణలో పర్య టించి ప్రజల కష్టాలను తెలుసుకుని స్పందించా ల్సిందిగా కోరుతున్నానని ఆయన తెలిపారు.ఆర్థిక సాయం విషయంలో వెనక్కి తగ్గేదేలేదని స్పష్టంచేశారు.రాష్ట్రంలో రోడ్లు, నీటి పారుదలశాఖ, రైల్వేలు, వ్యవసాయం తదితర శాఖలకు సంబం ధించి నష్టం వాటిల్లిందని మున్సి పల్ పట్టణా ల్లోను ప్రజలు తీవ్రం గా నష్టపోయారని ఆయన తెలిపా రు. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, న ల్గొండ జిల్లాల్లో పర్యటించి ప్రధాని ప్రజల కష్టాలు తెలుసుకుని పరి హారం ప్రకటించాలన్నారు. ప్రజల కష్టం తీర్చేందుకు పాలకులు, ప్రతిపక్షం అనే తేడా లేకుండా పని చేయాలని ఆయన సూచించారు. ప్రజల ఇబ్బందులను చూస్తుంటే ఎంత సాయం చేసినా తక్కువేనన్నారు. ఖమ్మం జిల్లాలో 34 క్యాంపుల ద్వారా ఏడువేల మందిని తరలించి పునరావాసం కల్పిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఎన్‌డిఆర్‌ఎఫ్ తరహాలో ఎస్‌డిఆర్‌ఎఫ్‌ను ఏర్పాటు చేస్తున్నామని ఎనిమిది ప్రాంతాలలో ఒక్కో క్యాంపులో 100 మంది ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు వారికి కావాల్సిన సామాగ్రిని పూర్తి స్థాయిలో అందజేస్తామన్నారు. తక్షణ సాయం అందించేం దుకు వెసులుబాటు కల్పిస్తూ ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, కొత్తగూడెంజిల్లాల కలెక్టర్లకు ఐదు కోట్ల చొప్పున నిధులు అందించినట్లు రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రాథమిక స్థాయిలో పంటల నష్టాన్ని, ఇతర నష్టాలను కూడా అంచనా వేసి సత్వరం నివేదిక అందేలా చూడాలన్నారు. వరద ముంపునకు గురైన ప్రతి కుటుంబానికి రూ. 10వేల నగదు, నిత్యావసర వస్తువులను అందిస్తామని తెలిపారు. పశువులు మరణిస్తే రూ.50వేలు,గొర్రెలు, మేకలకు ఐదు వేల చొప్పున పరిహారం అందిస్తామని ఆయన తెలిపారు. పంట నష్టం నివేదిక తర్వాత నష్టాన్ని బట్టి ప్రకటన చేస్తామన్నారు. సోమ వారం రాత్రి ఖమ్మంలో ఉండి ముఖ్యమంత్రి బుధవారం మహబూబాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. సమీక్షలో ఎంపి రామసహాయం రఘు రాంరెడ్డి, సిడిఎంఏ డైరెక్టర్ విపి గౌతమ్, ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పలువురు ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# మున్నేరుకు రికార్డు స్థాయి వరద

**తక్షణ అవసరాలను తీరుస్తాం**

**పది డివిజన్లు జలమయం**

**బాధితులను ఆదుకునేందుకు వెనుకాడం**

**మీడియా సమావేశంలో మంత్రి తుమ్మల**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** 48 గంటల్లో ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో మున్నేరు పరీవాహక ప్రాంతంలో భారీ వర్షం నమోదు కావడంతో మున్నేరుకు రికార్డు స్థాయిలో వరద వచ్చిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగే శ్వర రావు తెలిపారు. ఖమ్మం నగరానికి రహదారుల దిగ్బంధం జరగడం, వాతావరణం అనుకూలించకపోవడంతో కొంత ఇబ్బంది జరిగిందని జాతీయ రహదారులపైకి సైతం పది అడుగుల పైన నీరు చేరడం ఇబ్బందికి కారణ మైందన్నారు. పది డివిజన్ల పరిధిలో వేలాది మంది నిరాశ్రయులయ్యారని వారిని అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పునరావాస కేంద్రాలకు తరలించిన వారికి భోజన సదుపాయం కల్పిస్తున్నామని, 25వేల కుటుంబాలకు నిత్యావసర వస్తువులను అందించేందుకు సైతం ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.ప్రకాష్ నగర్ బ్రిడ్జిపై ఉన్న బాధితులకు డ్రోన్ల సాయంతో ఆహార పదార్థాలు అందించి ప్రాణ నష్టం జరగకుండా కాపాడామన్నారు. క్యాంపు కార్యాలయం నుంచి రెండు రోజులుగా వేలాది మందికి భోజనం అందిస్తున్నామని తుమ్మల తెలిపారు. ఖమ్మం నగరంలో రోడ్లు బురదమయం అయ్యాయని అన్ని ప్రాంతాల నుంచి ఫైరింజన్లు తెచ్చి ఖమ్మంలో బు రద తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. బాధితులను ఆదుకునేందుకు ఎట్టి పరిస్థితుల్లోను ఖర్చుకు వెనకాడబోమన్నారు. ప్రభుత్వం ద్వారా పేదలకు చేనేత చీరలు, ఇతర దుస్తులను పంపిణీ చేసేందుకు అధికారులతో సంప్రదిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి పర్యటన తర్వాత పరిహారం, ఇతర సాయం పై దృష్టిసారిస్తామని తుమ్మల తెలిపారు.



**ముంపు ప్రాంతాల్లో మంత్రి తుమ్మల పర్యటన**

ఖమ్మం నగరంలోని ముంపుకు గురైన అన్ని ప్రాంతాల్లో తుమ్మల నాగేశ్వరరావు పర్యటించారు. వెంకటేశ్వర నగర్, బొక్కలగడ్డ, మోతీనగర్, ప్రకాష్ నగ ర్, ధంసలాపురం, కవిరాజ్ నగర్ సహా అన్ని ప్రాంతాలలో పర్యటించారు. బాధితులకు భరోసా ఇచ్చారు. బా ధితులు చెప్పిన ప్రతి సమస్యను విన్న తుమ్మల త్వరలోనే పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. మీడియా సమావేశంలో, పర్యటన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మి నారాయణ, నల్లమల వెంకటేశ్వరరావు, మలీదు వెంకటేశ్వర్లు, పలువురు కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం అందరి బాధ్యత

**ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా చర్యలు**

**తుఫాన్ బాధితులను ఆదుకుంటాం**

**సూర్యాపేట జిల్లా సమీక్ష సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి**



**ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి:** వరద సమయంలో బురద రాజకీయాలు చేయవద్దని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రతిపక్ష పార్టీలను కోరారు. ఆదపలో ఉన్నవారిని ఆదుకోవడం అందరిపై బాధ్యత ఉందన్నారు. సోమవారం హైద్రాబాద్ నుండి ఖమ్మం వెళ్తున్న ఆయన మార్గమధ్యలోని కోదాడ నియోజకవర్గం మోతె మండలం నామవరం స్టేజీ వద్ద ఓ ఫంక్షన్ హాల్‌లో తుఫాన్‌తో జరిగిన నష్టంపై మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కోదాడ, తుంగతుర్తి శాసన సభ్యులు ఉత్తమ్ పద్మవతి, మందుల సామేల్, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌లతో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. తుఫాన్ ప్రభావంతో పంట నష్టంతో పాటు ప్రాణ, ఆస్తినష్టం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సూర్యాపేట జిల్లాలో 30 సెంటిమీటర్ల అతిభారీ వర్షం నమోదైందని దీంతో నష్టం భారీగా జరిగిందని చెప్పారు. సూర్యాపేట జిల్లాలో తుఫాన్‌తో రూ. 20వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని, 21 చెరువులు దెబ్బ తిన్నాయని, ఇద్దరు వ్యక్తులు మృతి చెందారని, 7పశువులు, మేకలు, గొర్రెలు మృత్యువాత పడ్డాయన్నారు. వీటన్నింటికి నష్టపరిహారం అందిస్తామని చెప్పారు. వరద బాధితులకు సహాయం చేయడానికి ముందుకు వచ్చిన మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అమెరికాలో ఉండి ఒకతను ట్విట్టర్‌లో కామెంట్లు పెండుతున్నారని, మరోకాయన ఫాంహౌజ్‌లో ఉండి ప్రభుత్వాన్ని తప్పు పడుతున్నారని కెటిఆర్, కెసిఆర్‌లను పరోక్షంగా విమర్శించారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు తెప్పించాలని కోరారు. తక్షణమే రూ. 12వేల కోట్లు అందించాలన్నారు.

## తెలంగాణ గ్లోబల్ ఎఐ సమ్మిట్

**కర్టెన్ రైజర్ నిర్వహించిన టాస్క్**

**ఎఐపై ఆన్‌లైన్‌లో శిక్షణకు టాస్క్‌తో మాటా ఎంఓయూ**



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** తెలంగాణ గ్లోబల్ ఎఐ సమిట్ 2024 కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని తెలంగాణ అకాడమి ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ ( టాస్క్ ) సంస్థ నిర్వహించింది. సోమవారం మాసాబ్‌ట్యాంక్ లోని టాస్క్ కార్యాలయంలో పరిశ్రమలు, ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేష్ రంజన్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైనారు. సిఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సూచనల మేరకు ఈ ఈవెంట్‌ను నిర్వహిస్తున్నట్లు జయేష్ రంజన్ అన్నారు. ఈ సందర్భంగా టాస్క్ సీఈవో శ్రీకాంత్ సిన్హా, మన అమెరికా తెలుగు సంఘం ( మాటా ) ఫౌండర్ శ్రీనివాస్ గణగోని ఈ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసుకున్నారు. హైదరాబాద్ హెచ్ ఐసిసి లో ఈ నెల 5,6 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ ఏఐ సమ్మిట్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తామని వారు ఈ సందర్భంగా ప్రకటించారు. తెలంగాణలో అతిపెద్ద ఏఐ సిటిని 100 ఎకరాల్లో నిర్మించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, నిరుద్యోగ యువతకు నూతన సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ అందించేందుకు మాట లాంటి ఎన్‌ఆర్‌ఐ సంఘాలు ముందుకు రావాల్సిన అవసరం ఉందని జయేష్ రంజన్ అన్నారు. ఈ సందర్భంగా మాట ఫౌండర్ శ్రీనివాస్ గణగోని మాట్లాడుతూ మొదటి విడత కామారెడ్డి పరిధిలోని 200 మంది యువతకు ఉచితంగా ఆన్‌లైన్‌లో వివిధ రంగాల్లో శిక్షణ అందిస్తున్నామని, టాస్క్‌ను గౌరవిస్తూ ఏఐ పైనా ఇక ముందు సహకరిస్తామని తెలిపారు. అంతే కాకుండా భవిష్యత్తులో మాటా ఆధ్వర్యంలో మరిన్ని కార్యక్రమాలను తెలంగాణలో అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్ గుడురు, డాక్టర్ విజయ్ భాస్కర్ బోల్లం, ప్రశాంత్ శ్రీపెరుంబూదూర్, వరుణ్ భైరాగోని, రణధీర్ ఠాకూర్ పాల్గొన్నారు.

## అత్యాధునిక సాంకేతికతలో స్వయం సమృద్ధి సాధించాలి

**రక్షణమంత్రిత్వ శాఖ శాస్త్రీయ సలహాదారుడు డాక్టర్ సతీష్ రెడ్డి**




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఏ దేశమైనా స్వావలంబన సాధించాలంటే అత్యాధునిక సాంకేతికతలో స్వయం సమృద్ధి సాధించాలని రక్షణమంత్రిత్వ శాఖ శాస్త్రీయ సలహాదారుడు,జిఓఐ,ఎఫ్ఆర్ చైర్మన్ డాక్టర్ జి.సతీష్ రెడ్డి అన్నారు. 'వేద జ్ఞానం, ఆధునిక సాంకేతికతల' అంశంపైన హైదరాబాద్‌లోని టి హబ్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సును ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి బిట్స్ వైస్ ఛాన్సలర్, గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ ప్రొఫెసర్ రాంగోపాల్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా సతీష్ రెడ్డి మాట్లాడుతూ దేశీయ ఉత్పత్తి, ఆవిష్కరణలను ప్రోత్సహించడమే లక్ష్యంగా భారత్ ముందుకు సాగుతుందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఆవిష్కరణలతో ప్రాచీన శాస్త్ర విజ్ఞానాన్ని ఈ సదస్సు అందంగా తీర్చిదిద్దుతుందన్నారు. భారతదేశాన్ని 'విశ్వ గురువు'గా విజ్ఞానం, ఆవిష్కరణలో గ్లోబల్ లీడర్‌గా చూడాలన్నారు. హైదరాబాద్ పరిశోధన, అభివృద్ధి కేంద్రంగా నిలుస్తుందన్నారు. గత దశాబ్దంలో అనేక సంస్థలు, ల్యాబ్‌లు దేశంలో అనేక పదార్థాలను ఉత్పత్తి చేయడానికి ప్రయత్నిస్తున్నాయని చెప్పారు. వేద శాస్త్రాలలో నిరూపితమైన సాంకేతికతలు ఉన్నాయని, గూఢలిపి శాస్త్రం వంటి మెటీరియల్స్‌లో క్రిప్టోగ్రఫీ నేపథ్య అంశాలు చాలా ఉన్నాయని తెలిపారు. విద్యాసంస్థలు చాలా ఆలస్యంగా వేద శాస్త్రాలపై ఆసక్తిని కనబరుస్తున్నాయన్నారు. ప్రొఫెసర్ వి.రాంగోపాల్ రావు మాట్లాడుతూ డిఆర్‌డిఒ లాంటి సంస్థలు వ్యూహాత్మక అనువర్తనాల కోసం శాస్త్రి ఉత్పత్తి చేసిన ఈ మెటీరియల్ ఉపయోగించాయన్నారు. సమాజ ప్రయోజనం కోసం ఏదైనా చేయగలరన్నారు. ప్రాచీన విజ్ఞాన శాస్త్ర అన్వేషణ జాతీయ ఉద్యమంగా మారాలని అభిప్రాయపడ్డారు. ఇటువంటి ప్రాజెక్టులకు నిధులు సమకూర్చే అంశంలో పెద్దగా ఆసక్తి చూపడం లేదని అన్నారు. డాక్టర్ ఎబిఎస్ శాస్త్రి మాట్లాడుతూ మన మహర్షులు చెప్పినది చాలా శాస్త్రీయమైనదన్నారు. మహర్షులు వేదాల ఆధారంగా అనేక సాంకేతిక గ్రంథాలను రచించారని అన్నారు. టిహబ్ సిఇఒ ఎం. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ పురాతన భారతీయ శాస్త్రాలపై అపారమైన ఆసక్తి ఉందన్నారు. కొన్ని జాతీయవాద కథనాల ద్వారా ప్రభావితమయ్యాయన్నారు. ఐకాన్ భారత్ ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ పి. జి. రావు మాట్లాడుతూ సంప్రదాయ పరిజ్ఞానాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు కాన్ఫరెన్స్‌లో స్టార్టప్ కాన్సెప్ట్ కూడా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ శాస్త్రవేత్తలు, వేద పండితులు, సాంకేతిక నిపుణులు, పరిశ్రమ నిపుణులతో సహా కీలక వక్తలు హాజరయ్యారు. ఈ సదస్సులో జర్మన్ అసోన్ అధ్యక్షుడు డాక్టర్ ఉల్రిచ్ బెర్క్, అవధూత దత్త పీఠం డాక్టర్ వికె. గణపతి, అవధూత దత్త పీఠం, ఐఎస్‌పి యుఎస్‌ఏ చైర్మన్ డాక్టర్ బలరామ్ సింగ్, విజ్ఞాన భారతి జాతీయ అధ్యక్షుడు, సిఎస్ఐఆర్ మాజీ డిజి డాక్టర్ శేఖర్ సి మండే, సపియంజా యూనివర్సిటీ, ఇటలీ సైంటిఫిక్ రీసెర్చర్ సాహితీ శ్రీరామోజు తదితరులు హాజరయ్యారు.

# జలాశయాలు కళకళ



**ప్రాజెక్టుల్లో నీటి మట్టాలు ఇలా...**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలుగు రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు పెద్ద ఎత్తున వరదలు సంభవించాయి. ఈ క్రమంలో ఇరిగేషన్ శాఖ అధికారులు అప్రమత్తం అయి పలు చర్యలు తీసుకుంటున్నారు. అదే సమయంలో అటు ఏపి లోనూ వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. తెలంగాణతో పాటు ఏపిలోనూ ప్రాజెక్టులు పూర్తి స్థాయిలో నిండడంతో ఇరిగేషన్ శాఖ అధికారులు నీటిని కిందికి వదులుతూ అప్రమత్తంగా ఉంటున్నారు. ఉదా.. ఏపిలోవిజయవాడవంటి పట్టణాలతో పాటు పల్లెల్లోనూ వరద విజృంభించి పలు ప్రాంతాలను జలదిగ్బంధం చేసింది.ఇంకా చాలాప్రాం తాలు వరద నీటిలోనే చిక్కుకుని ఉన్నాయి. ఏకధాటిగా కురిసినవానలకు తెలుగు రాష్ట్రాల్లో వాగులు, చెరువులు పొంగి పొర్లాయి. మరోవైపు పలు నీటిపారుదల ప్రాజెక్టులు నిండుకుండలా మారాయి. ఈ నేపథ్యంలో ప్రకాశం బ్యారేజీకి భారీ ఎత్తున వరద పోటెత్తింది. పెద్ద ఎత్తున వరద ప్రవాహం రావడంతో అధికారులు 70గేట్లను ఎత్తి 11.38 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం నీటిమట్టం 24.3 అడుగుల మేర కొనసాగుతోందని అధికారులు తెలిపారు. కాల్వలకు 500 క్యూసెక్కు లు వదులుతున్నట్లు చెప్పారు. బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోందని ముంపు ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. వరద ఉద్ధృతి మరింతపెరిగే అవకాశం ఉం దని తెలుస్తోంది. వర్షాల కారణంగా కృష్ణా, గోదావరి బేసిన్‌లో వచ్చిన నీటి వివరాలను పరిశీలిస్తే...

| కృష్ణాబేసిన్‌లో.... | పూర్తి స్థాయి నీటి మట్టం | ప్రస్తుత నీటి మట్టం |
|---|---|---|
| నారాయణపూర్ | 18.55 టిఎంసిలు | 14.48 టిఎంసిలు |
| జూరాల | 5.950 టిఎంసిలు | 4.245 టిఎంసిలు |
| తుంగభద్రాడ్యాం | 105.8 టిఎంసిలు | 98.01 టిఎంసిలు |
| శ్రీశైలం రిజర్వాయర్ | 212.4 టిఎంసిలు | 209.02 టిఎంసిలు |
| పులిచింతల డ్యాం | 36.23 టిఎంసిలు | 32.489 టిఎంసిలు |
| ప్రకాశం బ్యారేజీ | 2.291 టిఎంసిలు | 2.291 టిఎంసిలు |
| **గోదావరి బేసిన్‌లో....** | **పూర్తి స్థాయి నీటి మట్టం** | **ప్రస్తుత నీటి మట్టం** |
| సింగూరు | 29.92 టిఎంసిలు | 18.20టిఎంసిలు |
| నిజాంసాగర్ | 17.80 టిఎంసిలు | 6.99 టిఎంసిలు |
| శ్రీరాంసాగర్ | 90.31 టిఎంసిలు | 69.57 టిఎంసిలు |
| లోయర్ మానేరుడ్యాం | 24.07 టిఎంసీలు | 15.09 టిఎంసిలు |
| కడెం | 7.60 టిఎంసిలు | 6.20 టిఎంసిలు |
| శ్రీపాద ఎల్లంపల్లి | 20.18 టిఎంసిలు | 18.79 టిఎంసిలు |

## చండీగఢ్‌లో రైతుల భారీ ర్యాలీ



**చండీగఢ్ :** పంజాబ్ ప్రభుత్వం వ్యవసాయ విధానాన్ని అమలు చేయడం సహా పలు డిమాండ్‌లతో వేలాది రైతులు చండీగఢ్‌లో సోమవారం నాడు ప్రదర్శన నిర్వహించారు. భార్తీ కిసాన్ యూనియన్ (ఉగ్రాహన్), పంజాబ్ ఖేత్ మజ్దూర్ యూనియన్‌ల ఆధ్వర్యంలో ఐదు రోజుల నిరసనలను ఆదివారం ప్రారంభించారు. పంజాబ్‌లోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు, వారి కుటుంబసభ్యులు పెద్ద సంఖ్యలో బస్సులు, ట్రాక్టర్‌లు, వ్యక్తిగత వాహనాలలో ఐదు రోజుల కార్యక్రమానికి ఆదివారం నాటికే చండీగఢ్‌లోని దసరా గ్రౌండ్‌కు చేరుకున్నారు. అక్కడే ధర్నా నిర్వహించారు. సోమవారం నాడు మట్కా చౌక్ నుంచి సెక్టార్ 36 వరకు ప్రదర్శన నిర్వహించేందుకు వెయ్యిమందికి చండీగఢ్ అధికార యంత్రాంగం అనుమతించింది. రైతుల ర్యాలీ నేపథ్యంలో నిత్యం రద్దీగా ఉండే మట్కా చౌక్‌లో పలు విద్యా సంస్థలు సోమవారం నాడు సెలవు ప్రకటించాయి. తమ ప్రదర్శన అనంతరం ఆప్ ప్రభుత్వానికి, ప్రతిపక్ష పార్టీలకు వినతిపత్రాలు సమర్పిస్తామని రైతు నాయకులు వెల్లడించారు. ఈ ప్రదర్శనకు పంజాబ్ ప్రభుత్వం వ్యవసాయ విధానాన్ని అమలు చేయాలని, రసాయన రహిత పంటలను ప్రోత్సహించాలని, ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలకు పరిహారమివ్వాలని, రాష్ట్రంలో డ్రగ్స్ సమస్యను అరికట్టాలని పంజాబ్ ఖేత్ మజ్దూర్ యూనియన్ ప్రధానకార్యదర్శి లచ్మన్ సింగ్ సేవేవాలా డిమాండ్ చేశారు.

## రైతులతో చర్చించేందుకు కమిటీ ఏర్పాటు: సుప్రీం కోర్టు

- రైతులతో వారంలోగా సమావేశమవ్వాలని కమిటీకి ఆదేశం



**న్యూఢిల్లీ :** రైతుల నిరసన అంశాన్ని రాజకీయం చేయవద్దని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. శంభు సరిహద్దులో నిరసన తెలుపుతున్న రైతుల సమస్యలను సామరస్యంగా పరిష్కరించేందుకు పంజాబ్, హర్యానా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ నవాబ్ సింగ్ నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీని సోమవారం ఏర్పాటు చేసింది. వారంలోగా కమిటీ మొదటి సమావేశాన్ని ఏర్పాటు చేయాలని జస్టిస్‌లు సూర్యకాంత్, ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. తక్షణమే ఆందోళన చేస్తున్న రైతుల వద్దకు వెళ్లి తమ ట్రాక్టర్‌లు, ట్రాలీలు మొదలైనవాటిని తొలగించేలా చూడాలని పేర్కొంది. పంజాబ్, హర్యానాల మధ్య శంభు సరిహద్దు నుండి ప్రయాణికుల రాకపోకలకు అంతరాయం తొలగించాలనికూడా సూచించింది. పంజాబ్, హర్యానా ప్రభుత్వాలు రెండూ కమిటీకి సూచనలు ఇవ్వడానికి స్వేచ్ఛనివ్వాలిని పేర్కొంది. కమిటీలో రిటైర్డ్ ఐపిఎస్ అధికారి పిఎస్ సంధు, దేవేందర్ శర్మ, ప్రొఫెసర్ రంజిత్ సింగ్ ఘుమాన్, పంజాబ్ అగ్రికల్చర్ యూనివర్సిటీకి చెందిన వ్యవసాయ ఆర్థికవేత్త డాక్టర్ సుఖ్‌పాల్ సింగ్ కూడా ఉన్నారు. పరిశీలనకు సంబంధించిన అంశాలను రూపొందించాల్సిందిగా ఉన్నతస్థాయి కమిటీని కోరిన ధర్మాసనం.. కమిటీకి నిపుణుల అభిప్రాయం అవసరమైనప్పుడు, ప్రత్యేక ఆహ్వానితుడిగా చౌదరి చరణ్ సింగ్ హర్యానా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బిఆర్ కాంబోజ్‌ను ఆహ్వానించాలని ప్యానెల్ చైర్మన్‌ను ఆదేశించింది. అదే విధంగా రాజకీయ పార్టీల నుండి తమకు తాము సురక్షితమైన దూరంలో ఉండాలని, ఆచరణ సాధ్యం కాని డిమాండ్లపై పట్టుబట్టవద్దని నిరసన తెలిపే రైతులను హెచ్చరించింది. రైతుల సమస్యలను రాజకీయం చేయరాదని, వాటిని దశలవారీగా కమిటీ పరిశీలించాలని సుప్రీంకోర్టు పేర్కొంది. రైతులు తమ శాంతియుత ఆందోళనలను ప్రత్యామ్నాయ ప్రాంతాలకు మార్చుకునే స్వేచ్ఛ ఉంటుందని సుప్రీంకోర్టు పేర్కొంది. ఫిబ్రవరి 13 నుంచి నిరసన తెలుపుతున్న రైతులు అంబాలా సమీపంలోని శంభు సరిహద్దులో ఏర్పాటు చేసిన బారికేడ్లను వారం రోజుల్లోగా తొలగించాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ హర్యానా ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు విచారించింది. రైతుల సమస్యలపై కోర్టుతో పాటు రెండు రాష్ట్రాలు ఆందోళన చెందుతున్నాయని, వారి ఫిర్యాదుల పరిష్కారం కోసం ఒక ఫోరమ్‌ను ఏర్పాటు చేస్తున్నామని రైతులకు తెలియజేయాలని ఆగస్టు 22న బెంచ్ పంజాబ్, హర్యానా ప్రభుత్వాలను ఆదేశించింది. 'సంయుక్త కిసాన్ మోర్చా' (నాన్ పొలిటికల్), 'కిసాన్ మజ్దూర్ మోర్చా'లు రైతు ఉత్పత్తులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) హామీ వంటి తమ డిమాండ్‌లకు మద్దతుగా ఢిల్లీకి న్యాయపోరాటం చేస్తామని ప్రకటించడంతో హర్యానా ప్రభుత్వం ఫిబ్రవరిలో అంబాలా–న్యూఢిల్లీ జాతీయ రహదారిపై బారికేడ్లు ఏర్పాటు చేసింది.

## వలసకార్మికుల కోసం ఏమి చేశారు ?

**అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం**

**న్యూఢిల్లీ :** వలస కార్మికుల కోసం రేషన్‌కార్డులు జారీ, సంక్షేమ చర్యలు చేపట్టాలని 2021లో ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు, స్పష్టమైన మార్గదర్శకాలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారన్న విషయమై సమగ్రవివరాలతో కూడిన అఫిడవిట్‌ను వెంటనే దాఖలు చేయాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. కోవిడ్19 మహమ్మారి కాలంలో వలస కార్మికులు జీవనం సాగించేందుకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. 'ఈశ్రమ్'లో రిజిస్టర్ చేసుకున్న వలస కార్మికులకు సంక్షేమ చర్యలు, రేషన్‌కార్డులు జారీ చేయాలని సుప్రీంకోర్ట్ ధర్మాసనం జూన్ 29, 2021న ఇచ్చిన తీర్పులో అధికారులను ఆదేశించింది. దేశవ్యాప్తంగా అసంఘటిత రంగంలోని కార్మికులకు సామాజిక భద్రతాచర్యలు, సంక్షేమ ప్రయోజనాలను కల్పించాలన్న ప్రాథమిక ఉద్దేశంతో కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ ఈశ్రమ్‌కు అనుసంధానిస్తూ నేషనల్ డేటా బేస్ ఆఫ్ అనార్గనైజ్ వర్కర్స్ (ఎన్‌డియుడబ్ల్యు)ను ప్రారంభించింది. 'వలస కార్మికుల శ్రేయస్సు కోసం తీసుకోవాల్సిన చర్యలపై మేం జూన్ 29, 2021న ఇచ్చిన తీర్పు, ఆదేశాలను అంగీకరించారు. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం వలస కార్మికుల కోసం ఎలాంటి చర్యలు చేపట్టిందో వివరించండి. మా తీర్పును, ఆదేశాలను పరిగణనలోకి తీసుకుని మీరు ఎటువంటి చర్యలు చేపట్టారన్న విషయమై వెంటనే ఒక అఫిడవిట్‌ను రూపొందించండి. స మగ్రవివరాలతో కూడిన ఈ అఫిడవిట్‌ను కేవలం మూ డు వారాలలో అందజేయాలి' అని జస్టిస్ రవికుమార్, సంజయ్ కరోల్ తో కూడిన ద్విసభ్య ధర్మాసనం కేంద్రాన్ని ఆదేశించింది. కోవిడ్19 ప్యాండెమిక్ పీరియడ్‌లో లాక్‌డౌన్ ప్రకటించినందువల్ల వివిధ రాష్ట్రాల నుంచి పొట్టకూటికోసం ప్రధాన నగరాలు, పట్టణాలకు వచ్చి వలస కార్మికులను బలవంతంగా వారి స్వస్థలాలైన ఢిల్లీ ఇతర రాష్ట్రాలు, ప్రాంతాలకు ప్రభుత్వాలు తిరిగి పంపించాయి. ఈ కేసులో వాదనలు ప్రారంభించిన న్యాయవాది ప్రశాంత్‌భూషణ్, జస్టిస్ కరోల్ మధ్య మాటలవేడి రాజుకుంది. ప్యాండెమిక్ ముగిసింది కాబట్టి ఈ కేసు విచారణను కూడా ముగించడం మంచిదని అభ్యర్థించడంతో జస్టిస్ కరోల్ ఆగ్రహం వ్యక్తంచేశారు. 'వినండి...కోవిడ్ అయిపోయింది. ఈ కేసును మేం క్లోజ్ చేస్తాం. అయితే రేషన్ కార్డులు జారీ చేయడంలో ఎవరికైనా ఇబ్బంది ఉన్నదా?. అలా అయితే వారు మళ్లీ హైకోర్టులను ఆశ్రయించాలా?. మీరు ఈ కేసును ఎప్పుడు క్లోజ్ చేయాలని, ఎప్పుడు చేయకూడదని మమ్ములను ఉద్దేశించి ఎందుకు ఉపన్యాసం ఇస్తున్నారు?. మేం ఈ కేసు ఆదేశాలకు అనుగుణంగానే క్లోజ్ చేస్తాం' అని జస్టిస్ కరోల్ ఆయన్ను ఉద్దేశించి చెప్పారు. దయచేసి అలా అనకండి మిలార్డ్. ప్రొసీడింగ్స్ ఇప్పటికే విస్తృతంగా జరిగాయి. ఈ విషయం ఇంతటితో ముగియాలి. ఇది న్యా యవ్యవస్థ క్రమశిక్షణకు వ్యతిరేకం. మీరు ఇలా చేయకూడదు మిలార్డ్ అని ఆవేశంతో ఊగిపోతూ ప్రశాంత్ భూషణ్ ధర్మాసనం ఉద్దేశించి అన్నారు. దాంతో ధర్మాసనం 'మీరు వాయిస్ తీవ్రతను పెంచకండి. మేం ఇరుపక్షాలు వింటాం. మేం ఆ వైపు కూడా ఉంటాం. మేం ఈ కేసును ఎందుకు ముగించకూడదో చెప్పండి' అని బెంచ్ తిరిగి సమాధానం ఇచ్చింది. 'లేదు మిలార్డ్ మీరు చెప్పిందానికి ఆవేశం వచ్చింది. నేను క్షమాపణ చెబుతున్నాను' అని ప్రశాంత్‌భూషణ్ ధర్మాసనాన్ని అభ్యర్థించారు.'2021లో జనాభా లెక్కలు పూర్తి అయితే దాని ప్రకారంగా కేంద్ర ప్రభు త్వం జనాభా సర్వే చేసింది. దాని ప్రకారంగా 10మిలియన్ల మంది ప్రజలు రేషన్ కార్డులు పొందేందుకు అర్హులుగా ఉన్నట్లు కనుగొన్నారు. అయితే ప్రభుత్వం ఇప్ప టి వరకూ రేషన్‌కార్డులను జారీచేయలేదని చెబుతోం ది' అని ప్రశాంత్‌భూషణ్ ధర్మాసనానికి వివరించారు.

## ఖర్గే కుటుంబ ట్రస్టుకు భూ కేటాయింపుపై సిఎస్ వివరణ కోరిన కర్నాటక గవర్నర్



**బెంగళూరు :** ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఆయన కుమారుడు, కర్నాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే కుటుంబం నిర్వహించే ట్రస్టుకు భూమి కేటాయింపుపై కర్నాటక రాష్ట్ర ప్రభుత్వాన్ని గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోత్ వివరణ కోరారు. దీనికి సంబంధించి గవర్నర్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి షాలిని రజనీష్‌కు లేఖ రాసినట్లు ప్రియాంక్ ఖర్గే సోమవారం ధృవీకరించారు. కాంగ్రెస్ నేతలకు వ్యతిరేకంగా వచ్చే ఫిర్యాదులపై గవర్నర్ మెరుపు వేగంతో స్పందిస్తున్నారని, బిజెపి, జెడి(ఎస్) నేతలకు వ్యతిరేకంగా వచ్చే ఫిర్యాదులపై తాబేలు వేగంతో స్పందిస్తున్నారని ఆయన ఆరోపించారు. బిజెపి నేతలకు వ్యతిరేకంగా పత్రాలు ఉన్నప్పటికీ, అవి గవర్నర్ వద్ద ఉంటున్నాయే తప్ప చర్య ఉండడం లేదని మండిపడ్డారు. ఖర్గే కుటుంబానికి చెందిన సిద్ధార్థ విహార్ ట్రస్ట్‌కు ఐదెకరాల భూమిని ఎస్‌సి కోటా కింద కర్నాటక ఇండస్ట్రియల్ ఏరియా డెవెలప్‌మెంట్ బోర్డ్ బెంగళూరుకు సమీపంలో కేటాయించడంపై కర్నాటక శాసనమండలి ప్రతిపక్ష నేత నారాయణ స్వామి ఆగస్టు 27న గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ అంశంలో కర్నాటక మంత్రి ప్రియాంక్ ఖర్గేను క్యాబినెట్ నుంచి తొలగించాలని కోరారు.

## ఆరుగురు అభ్యర్థులతో కాంగ్రెస్ రెండవ జాబితా

**న్యూఢిల్లీ :** జమ్ము కశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మరో ఆరుగురు అభ్యర్థులతో కాంగ్రెస్ సోమవారం రెండవ జాబితాను విడుదల జేసింది. జెకెపిసిసి చీఫ్ తారిఖ్ హమ్మద్ కర్రా సెంట్రల్ షల్టెంగ్ నుంచి బరిలోకి దిగనున్నారు. అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశమైంది. సమావేశం అనంతరం రెండు జాబితాను విడుదల చేసింది. జమ్ము కశ్మీర్‌లో కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) కలిసి పోటీ చేస్తున్నాయి. రియాసీ నుంచి ముంతాజ్ ఖాన్, మాతా వైష్ణోదేవి నుంచి భూపేందర్ జామ్‌వాల్, రాజౌరి నుంచి ఇఫ్తీకార్ అహ్మద్, తన్నమండి నుంచి షబ్బీర్ అహ్మద్ ఖాన్, సురన్‌కోట్ నుంచి మహమ్మద్ షాన్‌వాజ్ చౌదరిలు పోటీ చేయనున్నారు. జమ్ము కశ్మీర్‌లో మొత్తం మూడు విడతల్లో పోలింగ్ జరగనుండగా ఈ కాంగ్రెస్ తాజాగా ప్రకటించిన రెండవ జాబితాలోని నియోకవర్గాల్లో రెండవ విడతలో పోలింగ్ జరగనుంది. అయితే ఇప్పటి వరకు కాంగ్రెస్ 15 స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించింది. సోమవారం ఢిల్లీలోని ఎఐసిసి కార్యాలయంలో జరిగిన సమావేశంలో పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్, కర్రా, జమ్ము కశ్మీర్ స్క్రీనింగ్ కమిటీ చీఫ్ సుఖ్‌జిందర్ సింగ్ రంధ్వా, సీనియర్ నేత కుర్షీద్, ఇతర నేతలు హాజరయ్యారు. కాగా, అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌సి, కాంగ్రెస్ పొత్తు కుదుర్చుకున్నాయి. పొత్తులో భాగంగా ఎన్‌సి 51 స్థానాల్లో, కాంగ్రెస్ 32 సీట్లలో పోటీ చేయనున్నాయి. సిపిఐ(ఎం), జెకెఎన్‌పిపి పార్టీకు ఒక్కో సీటు చొప్పున కేటాయించాయి. గత వారం 9 మంది అభ్యర్థులతో తొలి జాబితాను విడుదల చేసింది.

## రాహుల్ ప్రధాని అవుతారు

**కాంగ్రెస్ సీనియర్ నేత అభిషేక్ సింఘ్వీ జోస్యం**



**న్యూఢిల్లీ :** లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ భావి భారత ప్రధాని అవుతారని కాంగ్రెస్ సీనియర్ నేత అభిషేక్ సింఘ్వీ జోస్యం చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత నూటికి నూరు శాతం ప్రధాని పదవిని అలంకరించే హక్కు రాహుల్‌కు ఉందన్నారు. రాహుల్‌గాంధీ చేసేదే చెబుతారని, చెప్పింది చేస్తారని సింఘ్వీ ప్రశంసించారు. లోక్‌సభలో రాహుల్ గాంధీ ప్రతిపక్ష నేతగా బాధ్యతలు స్వీకరించడంపై, ఆయనను కాబోయే ప్రధానిగా చూస్తున్నారా అని సింఘ్వీని మీడియా ప్రశ్నించగా అది బిజెపి స్నేహితులను అడగాలన్నారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం నడుస్తారని, ఆయన చెప్పేది అర్థం చేసుకుంటారని, ఇంకా ఏం చెబుతారని ఎదురు చూస్తారన్నారు. కానీ ప్రధాని మాత్రం పూర్తిగా అందుకు విరుద్ధమని విమర్శించారు. అందువల్ల సమీకరణలు మారుతున్నాయన్నారు. ఈ మేరకు ఆయన పిటిఐకి వెల్లడించారు. గాంధీని భవిష్యత్తు ప్రధానిగా చూస్తారా అని అడగ్గా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడు తప్పకుండా ఆయనను ప్రధానిగా చూస్తామన్నారు. అది ఆయన హక్కు అని, దానిని ఎవరూ కాదనలేరన్నారు. కాగా, ఐదు పర్యాయాల నుంచి ఎంపిగా ఉన్న రాహుల్ ప్రస్తుతం రాయ్‌బరేలీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గతంలో ఈ స్థానం నుంచి తల్లి సోనియాగాంధీ ప్రాతినిధ్యం వహించారు. ఈ ఏడాది జూన్‌లో రాహుల్ లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా బాధ్యతలు చేపట్టారు.

## రూ.14 వేల కోట్లతో ఏడు వ్యవసాయ పథకాలు

- కేంద్ర మంత్రివర్గం ఆమోదం
- రూ.2,291 కోట్లతో వ్యవసాయ విద్య పటిష్టత
- రూ.1,702 కోట్లతో పశు సంతతి వృద్ధి పథకం
- పండ్లతోటల అభివృద్ధికి రూ.860 కోట్లు



**న్యూఢిల్లీ :** వ్యవసాయ రంగ అభివృద్ధికి, వ్యవసాయరంగ ఆదాయాన్ని గణనీయంగా పెంచేందుకు దాదాపు రూ.14,000 కోట్లతో రూపొందించిన ఏడు పథకాలను కేంద్రమంత్రివర్గం ఆమోదించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన సోమవారం ఉదయం న్యూఢిల్లీలో జరిగిన మంత్రివర్గ సమావేశం ఈ ఏడు పథకాలకూ ఆమోదం తెలియజేసింది. వీటిల్లో రూ.2,817 కోట్లతో రూపొందించిన డిజిటల్ అగ్రికల్చర్ మిషన్, రూ. 3,979 కోట్లతో అమలుచేసే క్రాప్ సైన్స్ పథకం కూడా ఉన్నాయి. డిజిటల్ మిషన్ పథకంలో వ్యవసాయ ఉత్పత్తుల నిల్వలు, కృషి నిర్ణయాల మద్దతు వ్యవస్థలు రెంటినీ బలమైన మూలస్తంభాలుగా తీర్చిదిద్దుతారు. సమావేశం అనంతరం కేంద్ర సమాచార ప్రసారాలు, ఐటి శాఖల మంత్రి అశ్వనీ వైష్ణవ్ మంత్రివర్గ సమావేశం అనంతరం మీడియాకు ఈ వివరాలు తెలియజేశారు. వ్యవసాయరంగ ఆదాయాన్ని వృద్ధి చేసేలక్ష్యంతోనే ఈ ఏడు సమగ్ర కార్యాక్రమాలను అమలు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. వ్యవసాయ విద్యను రాబోయేకాలంలో మరింత సమర్థవంతంగా, బలోపేతంగా తీర్చిదిద్దేందుకు, సామాజిక విజ్ఞానాల అభివృద్ధికి వీలుగా రూ.2,291 కోట్లతో ఒక పథకానికి ఆమోదముద్ర వేశారు. అదేవిధంగా దేశంలో పశు సంతతి ఆరోగ్య రక్షణ, వాటి సంతతి పెరుగుదల, స్థిరీకరణ నిమిత్తం రూ.1,702 కోట్లతో రూపొందించిన పథకానికి కూడా ఆమోదం తెలియజేశారు. వీటితో పాటు రూ.860 కోట్లతో రూపొందించిన మరో ముఖ్యపథకానికి కూడా కేంద్రం ఆమోదం తెలిపింది. పండ్లతోటలను అభివృద్ధిచేసి, వాటి స్థిరత్వాన్ని సాధించేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తారు. అదేవిధంగా కృషి విజ్ఞాన కేంద్రాలను బలోపేతం చేసేందుకు రూ.1,202 కోట్లతో మరో పథకాన్ని, ప్రకృతి వనరుల యాజమాన్య నిర్వహణకు రూ.1,115 కోట్లతో మరో పథకాన్ని కూడా అమలు చేస్తారు. ఈ మొత్తం ఏడు పథకాలను అమలు చేసేందుకు రూ.13,960 కోట్లు కేటాయించారు.

**రూ.3,979 కోట్లతో క్రాప్ సైన్స్ పథకం**

వ్యవసాయ విజ్ఞానశాస్త్రాన్ని అభివృద్ధిచేయడం, వ్యవసాయ విజ్ఞాన శాస్త్రాన్ని మన దేశీయ అవసరాలకు, రాబోయే వాతావరణ మార్పులకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు వీలుగా రూ.3,379 కోట్లతో క్రాప్ సైన్స్ పథకాన్ని అమలు చేసేందుకు కూడా మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వ్యవసాయ ఆదాయం పెంచడమే ఈ పథకం ఉద్దేశమని మంత్రి అశ్వనీ వైష్ణవ్ చెప్పారు. ఆహార, పోషకాహార భద్రతా కార్యక్రమాల నిమిత్తం ఈ మొత్తాన్ని ఖర్చు చేస్తామన్నారు. 2047 నాటికి మనదేశంలో వ్యవసాయ రైతులు వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయపంటల స్థిరీకరణ సాధించేందుకు, ఆహార ఉత్పత్తులతోపాటు, పౌరులకు పోషకాహార భద్రత సమకూర్చేందుకు, వ్యవసాయరంగం పటిష్టంగా, బలంగా నిలబడేందుకు ఆరు స్తంభాల్లాగా ఈ కార్యక్రమాలను ఈ పథకంలో చేర్చామని అన్నారు. పరిశోధన, విద్య, వాతావరణాన్ని తట్టుకుని నిలబడగల వ్యవసాయ, ప్రకృతి వనరుల యాజమాన్య నిర్వహణ, వ్యవసాయ రంగంలో డిజిటలైజేషన్‌తోపాటు పశు సంతానవృద్ధి, పండ్లతోటలవృద్ధి మొదలైనవి ఈ ఏడు పథకాల్లో ప్రధాన లక్ష్యాలుగా ఉంటాయని చెప్పారు. వ్యవసాయ పరిశోధనా విద్య, మొక్కల జన్యు వనరుల సంరక్షణ, నిర్వహణ, జన్యువుల అభివృద్ధి, మెరుగుదల, వాణిజ్య పంటల అభివృద్ధితో పాటు పశుదాణా అభివృద్ధికి, వ్యవసాయానికి హాని చేసే కీటకాల నాశనం, పరిశోధన, మైక్రోబ్స్, పోలినేటర్స్ పరిశోధనలపై కూడా ఈ క్రాప్ సైన్స్ పథకం కింద దృష్టి కేంద్రీకరిస్తామన్నారు.2020 లో తెచ్చిన నూతన విద్యా విధానానికి అనుగుణంగా వ్యవసాయ విద్య–పరిశోధనలను ఆధునీకరించడం, వ్యవసాయ పద్ధతుల అమలుకు డిజిటల్ డిపిఐ, ఏఐ, బిగ్ డేటా తరతర సరికొత్త సాంతిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంకోసం భారత వ్యవసాయ పరిశోధనా మండలి అధీనంలో ఈ కార్యక్రమాలను అమలు చేస్తామని మంత్రి చెప్పారు.

**గుజరాత్‌లో సెమీ కండక్టర్ యూనిట్**

కేన్స్ సంస్థ రూ.3,307 కోట్లతో నిర్మించ తలపెట్టిన సెమీ కండక్టర్ పథకానికి కేంద్రమంత్రివర్గం ఆమోదం తెలియజేసింది. గుజరాత్‌లోని సనంద్‌లో ఈ కర్మాగారాన్ని ఏర్పాటు చేస్తారు. ఈ కర్మాగారంలో రోజుకు 60.30 లక్షల చిప్స్‌ను ఉత్పత్తి చేస్తారు. దీంతో మనదేశంలో 46 ఎకరాలలో పూర్తి స్థాయిలో ఈ సెమీ కండక్టర్ వ్యవస్థ ఆవిర్భవిస్తోందని మంత్రి అశ్వనీ వైష్ణవ్ అన్నారు. ఇది చాలా పెద్ద కర్మాగారం, ఉత్పత్తిలో కూడా భారీ లక్ష్యం ప్రతిరోజూ ఉంటుంది, ఈ ఉత్పత్తులన్నీ కేన్స్ పరిశ్రమలకు వెళతాయి'' అని ఆయన చెప్పారు. విద్యుత్ రంగ అవసరాలు తీర్చేందుకు కూడా చిప్స్‌ను ఈ కర్మాగారమే తయారు చేస్తుందని అన్నారు. త్వరలోనే ఈ కర్మాగార నిర్మాణం ప్రారంభం అవుతుందని చెప్పారు. ఇందుకోసం సనంద్‌లో భూసేకరణ కార్యక్రమం పూర్తి చేశారన్నారు. విద్యుత్ అవసరాలకు ఉత్పత్తిచేసే చిప్సను ఆటోమొబైల్‌రంగంలో, గృహోపకరణాలలో ఉపయోగిస్తారని ఆయన చెప్పారు.



## విరిగిపడ్డ కొండచరియలు..

**ఇద్దరు మృతి, పలువురికి గాయాలు**

**శ్రీనగర్ :** జమ్ము కశ్మీర్‌లో విషాదం చోటు చేసుకుంది. శ్రీమాతా వైష్ణో దేవి ఆలయ సమీపంలోని పంచి హెలిప్యాడ రోడ్డు మార్గంలో సోమవారం కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు భక్తులు మరణించారు. మరికొంత మంది భక్తులు గాయపడ్డారు. ఈ ఘటనపై సమాచారం తెలుసుకున్న వెంటనే మాతా వైష్ణో దేవి మందిరం బోర్డు రెస్క్యూ సిబ్బంది రిలీఫ్ పనులను ప్రారంభించింది. గత రెండు రోజులుగా వైష్ణో దేవి ఆలయ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో కొండచరియలు విరిగిపడ్డాయి. వాతావరణం అనుకూలించకపోవడం వల్లే కొండచరియలు విరిగిపడినట్లు స్థానికులు చెబుతున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వర్షంతో కొండచరియలు విరిగిపడగా, సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. వైష్ణో దేవి హిమకోటి పర్వతంపై పంచి హెలిప్యాడ సమీపంలో ఈ కొండచరియలు విరిగిపడ్డాయి. హెలికాప్టర్ ల్యాండ అయిన కొద్ది సెకన్లకే కొండచరియలు విరిగిపడటంతో హెలికాప్టర్ సేవలు నిలిచిపోయాయి. కొండచరియలు విరిగిపడటంతో ఫుట్‌పాత్‌పై నిర్మించిన టిన్‌షెడ్ విరిగిపోయిన ఘటనకు సంబంధించిన వీడియో బయటకు వచ్చింది. రియాసి జిల్లా కమీషనర్ మరణాలను ధృవీకరించారు. కొండచరియలు విరిగిపడటంతో హిమకోటి రహదారిపై పెద్ద ఎత్తున శిథిలాలు వచ్చి పడ్డాయి. అధికారులు వెంటనే సహాయక చర్యలు ప్రారంభించారు. ప్రతికూల వాతావరణం కారణంగా రెస్క్యూ పనిలో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మాతా వైష్ణో దేవి పుణ్యక్షేత్రం బోర్డు వర్గాల సమాచారం ప్రకారం ఇప్పటివరకు రెండు మృతదేహాలను తొలగించారు. అంబులెన్స్ ఘటనా స్థలానికి చేరుకుంది. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్నారు. వారి పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నట్లు సమాచారం. అయితే వీరిలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. హిమ్‌కోటి పర్వతంలో క్షతగాత్రులను కనుగొనే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

## ముంబయి–ఇండోర్ మధ్య రూ.18,036 కోట్లతో కొత్త రైల్వే లైన్

**న్యూఢిల్లీ :** ముంబయి – ఇండోర్ మధ్య కొత్త రైల్వే లైను నిర్మిస్తారు. మహారాష్ట్ర–మధ్యప్రదేశ్‌లలోని ఆరు జిల్లాలలో ఉన్న ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చేవిధంగా రూ.18,036 కోట్లతో 309 కిలోమీటర్లు నిడివిగల ఈ కొత్త రైల్వే మార్గాన్ని 2028–29 నాటికి పూర్తి చేస్తారు. కేంద్ర ఆర్థిక వ్యవహారాలపై నియమించిన కేంద్ర మంత్రివర్గ కమిటీ సోమవారంనాటి సమావేశంలో ఈ ప్రాజెక్టుకు ఆమోద ముద్ర వేసింది. ఈ ప్రాజెక్టు నిర్మాణ దశలో ఒక కోటీ రెండు లక్షల పనిదినా(102 లక్షల పనిదినాలు) లను సృష్టించి అనేక మందికి ఉపాధి కల్పిస్తామని మంత్రి వైష్ణవ్ చెప్పారు. ప్రధానమంత్రి గతిశక్తి జాతీయ బృహత్తర పథకం ఫలితంగా ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపడుతున్నారు. బహుముఖ అనుసంధానం కోసం సమగ్ర ప్రణాళిక ద్వారా ప్రజల రాకపోకలు,చాలా సులభంగా ప్రయాణాలు సాగిపోయేందుకు, ఉత్తమ సేవలు అందించేందుకు వీలుగా ఈ పథకాన్ని అమలులోకి తెస్తామని చెప్పారు.తద్వారా ఈ ప్రాంతంలో పర్యాటకరంగం కూడా గణనీయంగా అభివృద్ధి చెందుతుంది. దీనివల్ల దేశంలోని పశ్చిమ, నైరుతీ ప్రాంతాలలో సెంట్రల్ ఇండియాలో రైలు మార్గం దగ్గరదారిలో అందుబాటులోకి వస్తుంది. దీనివల్ల వివిధ మతాలకు చెందిన పవిత్ర ఆలయ ప్రాంతాలకు వెళ్ళే పర్యాటకుల సంఖ్య పెరుగుతుదని చెప్పారు. ఉజ్జయని, శ్రీమహాకాళేశ్వర్ జ్యోతిర్లింగ ఆలయాలకు పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది.

**ప్రయాణికులకు, సరుకురవాణాకు ప్రాధాన్యం**

అతిముఖ్యమైన ఈ ముంబయి – ఇండోర్ కొత్త రైలు రవాణా ద్వారా 90 అతి పెద్ద కర్మాగారాలకు, మరో 700 చిన్న పరిశ్రమలకు జెఎన్‌పిఎ గేట్‌వే పోర్టు నుండి ఇతర రాష్ట్రాలలో పోర్టులకు వెళ్ళేందుకు కూడా దగ్గరమార్గం ఏర్పడుతుంది. ఈ రైలు మార్గంలో 30 కొత్త రైల్వే స్టేషన్లు నిర్మిస్తారు. 1,000 గ్రామాలలో 30 లక్షలమంది ప్రజలకు కొత్తగా రైలు ప్రయాణం అందుబాటులోకి వస్తుంది. అదేవిధంగా తృణధాన్యాలను ఉత్పత్తి చేసే మధ్యప్రదేశ్‌లోని పలు జిల్లాలకు, ఉల్లిపాయలు ఉత్పత్తి చేసే మహారాష్ట్ర రైతులకు కూడా ఈ రైలు మార్గం ద్వారా సులభ రవాణా ప్రయోజనాలు కలుగుతాయి. వ్యవసాయ ఉత్పత్తులను గణనీయస్థాయిలో రవాణా చేయడానికి, ఎరువులు, కంటైనర్లు, ఇనుప ఖనిజం, ఉక్కు, సిమెంటు, పెట్రోలు, ఆయిల్, లూబ్రికెంట్స్‌ను సులభంగా రవాణా చేయడానికి ఈ రైలు మార్గం దోహదం చేస్తుంది. పర్యావరణ మిత్ర, ఇంధన ఆదా సామర్థ్యం ప్రాతిపదికపై ఈ కొత్తమార్గాన్ని నిర్మిస్తున్నారు. ఈ దగ్గరిమార్గం వల్ల 18 కోట్ల లీటర్ల చమురు దిగుమతులను తగ్గించుకోవచ్చుననీ, కార్బండైయాక్సైడ్ విడుదల కూడా 130 కోట్ల కేజీలు తగ్గుతుందనీ, ఈ కొత్తమార్గంలో కొత్తగా 5.50 కోట్ల చెట్లు నాటవచ్చుననీ మంత్రి వైష్ణవ్ చెప్పారు.

## నత్తనడకన సిబిఐ అవినీతి కేసుల విచారణ!

**6900 కేసులు పెండింగ్**
**కొన్నింటల్లో 20ఏళ్లకుపైగా జాప్యం : సివిసి**

**న్యూఢిల్లీ :** సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) దర్యాప్తు చేసిన 6,900పైగా అవినీతిలో కేసులు, వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయని సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సివిసి) వార్షిక నివేదికలో పేర్కొంది. అందులో 321 కేసులు 20 ఏళ్లకు పైగా పెండింగులో ఉన్నాయని తెలిపింది. అంతేకాకుండా 658 అవినీతి కేసుల్లో సిబిఐ దర్యాప్తు పెండింగులో ఉందని, అందులో 48 కేసుల దర్యాప్తులో ఐదేళ్లకు పైగా ఎలాంటి కదలిక లేదని వెల్లడించింది. సివిసి నివేదిక ప్రకారం 2023 డిసెంబర్ 31 వరకు వివిధ కోర్టుల్లో విచారణ జరుగుతున్న 6903 కేసుల్లో, 1379 కేసులు దాదాపు మూడేళ్లుగా, 875 కేసులు మూడేళ్ల నుంచి ఐదేళ్లుగా పెండింగులో ఉన్నాయి. 2188 కేసులు ఐదేళ్ల నుంచి పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. ఇక మరో 2100 కేసులు పదేళ్ల నుంచి 20ఏళ్లుగా, 361 కేసులు 20 ఏళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయి. సిబిఐ వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్నవారు దాఖలు చేసిన 2,773 అప్పీళ్లు/రివిజన్ పిటిషన్లు, వివిధ హైకోర్టులు, సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని సివిసి నివేదిక పేర్కొంది. ఇందులో 501 కేసులు 20 ఏళ్లకు పైగా పెండింగులో ఉన్నాయి. 2ఏళ్ల లోపు 2,554, 2–5 ఏళ్లుగా 2,172, 5–10ఏళ్లుగా 3,850, 10–15ఏళ్లుగా 2,558, 15–20ఏళ్లుగా 1,138 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. 658 అవినీతి కేసుల్లో సిబిఐ దర్యాప్తు పెండింగులో ఉందని, అందులో 48 కేసుల దర్యాప్తులో ఐదేళ్లకు పైగా కదలిక లేదని వెల్లడించింది. ఇక, 3ఏళ్లకు పైగా 74 కేసులు, 23 ఏళ్లుగా 75 కేసులు, 12 ఏళ్లుగా 175 కేసుల్లో సిబిఐ దర్యాప్తు పెండింగులో ఉంది.

**ఆలస్యానికి కారణాలివే!**

అధిక పనిభారం, సిబ్బంది కొరత, లెటర్స్ రొగేటరీకి (ఎల్ఆర్) ప్రతిస్పందనలను పొందడంలో జాప్యం జరగడం వంటి కారణాలతో కేసులు పెండింగులో ఉన్నట్లు సివిసి నివేదిక వెల్లడించింది. ముఖ్యంగా ఆర్థిక నేరాలు, బ్యాంకు మోసాల కేసులలో భారీ రికార్డుల పరిశీలనకు ఎక్కువ సమయం పడుతోందని తెలిపింది. అంతేకాకుండా సుదూర ప్రాంతాల్లో ఉన్న సాక్షులను గుర్తించి, విచారించడానికి ఎక్కువ సమయం పట్టడం కూడా కేసులు జాప్యానికి కారణం అని చెప్పింది. తాజా సివిసి నివేదిక ప్రకారం, 2023 డిసెంబర్ 31 నాటికి సిబిఐలో మంజూరైన 7,295 పోస్టుల్లో 1,610 ఖాళీలు ఉన్నాయి. ఇందులో ఎగ్జిక్యూటివ్ ర్యాంకుల్లో 1,040, లా ఆఫీసర్లు 84, టెక్నికల్ ఆఫీసర్లు 53, మినిస్టీరియల్ సిబ్బంది 388, క్యాంటీన్ సిబ్బంది 45 ఖాళీలు ఉన్నాయి. 2023లో సిబిఐ 876 సాధారణ కేసులు/ప్రాథమిక విచారణలను నమోదు చేసింది. ఇందులో 91 కేసులను రాజ్యాంగ న్యాయస్థానాల ఆదేశాల మేరకు సీబీఐ దర్యాప్తునకు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వాలు/కేంద్రపాలిత ప్రాంతాల నుంచి అందుకున్న విజ్ఞప్తులపై 84 కేసులను నమోదు చేసింది. ఇక 2023లో సిబిఐ 873 కేసుల్లో దర్యాప్తును పూర్తి చేసింది. ఇందులో 755 సాధారణ కేసులు, 118 ప్రాథమిక విచారణలను పూర్తి చేసింది. ఇదే కాలంలో సిబిఐ 552 అవినీతి కేసులు నమోదు చేయగా అందులో 674మంది ప్రభుత్వ ఉద్యోగులు(195 గెజిటెడ్ ఆఫీసర్లు) నిందితులుగా ఉన్నారు. విచారణ, నేరారోపణ వివరాలను తెలియజేస్తూ (అవినీతి నిరోధక చట్టం కేసులతో సహా) 636 కేసుల్లో కోర్టు తీర్పు అందిందని పేర్కొంది. ఇందులో 411 కేసుల్లో కన్విక్షన్ తీర్పు వెలువడింది. 140 కేసుల్లో అక్విట్టల్ తీర్పు వచ్చింది. 24 కేసులను కోర్టులు డిశ్చార్జ్ చేశాయి. 61 కేసులను కొన్ని కారణాల కోర్టులు డిస్పోజ్ చేశాయి.

**ఐపిఎస్ అధికారుల మీద ఆరోపణలపై**

## ఉన్నత స్థాయి దర్యాప్తు : సిఎం విజయన్



**న్యూఢిల్లీ :** ముఖ్యమంత్రి రాజకీయ కార్య దర్శి, ఐపిఎస్ అధికారి పి.శశి, శాంతిభ ద్రతల అదనపు డిజిపి ఎం.ఆర్.అజిత్ కు మార్,పట్టణంథిట్ట ఎస్‌పి సుజిత్ దాస్‌లపై వచ్చిన ఆరోపణల మీద ఉన్నత స్థాయి దర్యాప్తు చేయిస్తామని కేరళ ముఖ్యమంత్రి విజయన్ ప్రకటించారు. వారిపై ఎల్‌డిఎఫ్ కూటమి తరపున నిలం బూర్ నుంచి ఇండిపెండెంట్‌గా ఎన్నికైన ఎంఎల్‌ఏ అన్వర్ ఆదివారం నాడు తీవ్ర ఆరోపణలు చేశారు. వారు సిఎంకు నమ్మక ద్రోహం చేస్తున్నారని, వారికి అప్పగించిన పనులు చేయడంలో విఫలమయ్యారని ఆరోపించారు. కొట్టాయంలో పోలీసు అసోసియేషన్ సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిఎం విజయన్ మాట్లాడుతూ కొన్ని ఆరోపణలు వచ్చాయని, వాటిపై ఎలాంటి అపోహలకు తావు లేకుండా దర్యాప్తు చేయిస్తామని అన్నారు.ఆ సమయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అజిత్ కుమార్ కూడా వేదికపైనే ఉన్నారు. ఆరోపణలను అత్యంత గంభీరంగా తీసుకుంటున్నామని, ఎలాంటి అపోహలకు తావు లేకుండా పరిష్కరిస్తామని, పోలీసు శాఖలో క్రమశిక్షణ రాహిత్యాన్ని సహించేది లేదని విజయన్ అన్నారు. ఉన్నతస్థాయి అధికారి ఆధ్వర్యంలో దర్యాప్తు చేయిస్తామని తెలిపారు.

తెలుగు జాతీయ దినపత్రిక
ప్రజాపక్షం
మంగళవారం, సెప్టెంబరు 03

# తెలుగు రాష్ట్రాల్లో జల విలయం

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు గత మూడు రోజులుగా జల విలయంలో చిక్కుకుని చిగురుటాకుల వణికిపోతున్నాయి. బంగాళాఖాతంలో అల్పపీడనం, ఒడిసాలోని గోపాల్‌పూర్‌వద్ద దరికి చేరువవ్వని ముందుగా వచ్చిన వార్తలు భయపెట్టలేదు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని అత్యధిక జిల్లాల్లో మూడు రోజులపాటు భారీ వర్షాలు, కొన్నిచోట్ల అతిభారీవర్షాలు పడొచ్చున్న వాతావరణ కేంద్రాలు హెచ్చరించినపుడు కూడా ఈ జలవిపత్తును ఎవరూ ఊహించి ఉండరు. అప్పటికే నాలుగు రోజులుగా గుజరాత్‌ను కుండపోత వర్షాలు ముంచెత్తుతున్నాయి. జనజీవనం అస్తవ్యస్తమైంది. అరేబియా సముద్రంలో తుపాను హెచ్చరిక, బంగాళాఖాతంలో అల్పపీడన ప్రకటన దాదాపు ఏకకాలంలో వచ్చాయి. తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ ప్రజలను అప్రమత్తంగా ఉండాలని ముందస్తు హెచ్చరిక చేసినా – వర్షాలు తక్కువగా, జిల్లాల్లో హెచ్చుతగ్గులతో ఉన్న ఈ సంవత్సరానికి ఈ అల్పపీడనం సాధారణ వర్షాలు తెస్తే మంచే జరిగేది. కాని ఆంధ్రప్రదేశ్‌లో ఉమ్మడి కృష్ణ, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాలు, తెలంగాణలో ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ కొంతమేర హైదరాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో కుండపోతగా వర్షించింది. 24గంటల్లో 10సెంటీమీటర్ల వర్షపాతమే అతిభారీ వర్షంగా భావిస్తాము. అట్లాంటిది 30 నుంచి 50 సెంటీమీటర్ల వర్షపాతం మేఘాలు బద్దలు అయినట్లే. ఇది కనీసం శతాబ్దకాలంలో కనీవినీ ఎరుగని ఉత్పాతం. వాగులు, వంకలు ఉప్పొంగాయి. చెరువులు కట్టలు తెంచుకున్నాయి. గ్రామాలు, పట్టణాలు దీవులుగా మారాయి. కనుచూపుమేర ఎటుచూసినా జలప్రవాహమే. ఎక్కడిక్కడ రోడ్లు నోళ్లు తెరిచాయి. రైళ్లు నిలిచిపోయాయి. విద్యుత్ సరఫరా బంద్ అయింది. లక్షలాదిమంది జనాలు అనుకోని ఈ ఉపద్రవానికి హడలెత్తిపోయారు. అన్న పానీయాలకు ఆక్రోశించారు. రోడ్డు రవాణా నిలిచిపోయి వేలాదిమంది ఆడమగ పిల్లలు, వృద్ధులు రోడ్డుమీదనో, బస్సుల్లోనో బస. అయితే పలకరించేవారేరి, ఎక్కడ పరిస్థితులెలా ఉన్నాయో చెప్పేవారే కరవాయె! ఇది రాత్రి సంభవించిన ఉపద్రవం. ఉదయం కళ్లు తెరిచేసరికి ఉప్పొంగిన జలం తలుపు తడతోంది! ఎన్ని జనావాసాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయో కదా! పిల్లలకు పాలు లేవు, వృద్ధులకు మందులు లేవు. ప్రకృతి పెట్టిన విషమ పరీక్షలో బెదురుచూపులతో అల్లలాడిపోతున్నారు.

అప్పటికే కృష్ణానది ఉధృతి మీదుంది. జూరాల, శ్రీశైలం, నాగార్జున సాగర్, పులిచింతల గేట్లన్నీ ఎత్తారు. విజయవాడ ప్రకాశం బ్యారేజ్ వైపు నీరు ఉరుకుతోంది. ఇంతలో ముఖ్యంగా ఖమ్మం జిల్లాలో కుండపోతవాన ఉధృతమైన వరదగా వాగులు, వంకలు తెంచుకుంటూ కృష్ణలోకి పరుగులు తీయసాగింది. అంతలోనే ఎన్టీఆర్ జిల్లాలోని బుడమేరు కట్టలు తెంచుకుని విజయవాడ నగరంపై విరుచుకుపడింది. విజయవాడ పాతబస్తీమీదుగా దుముకిన నీరు మహోధృతంగా నగర ఉత్తర ప్రాంతం కాలనీలను ముంచెత్తింది. రోడ్లపై, కాలనీల్లో నడుములోతు నీళ్లు – జనాలను నరకం చూపించింది. ప్రకాశం బ్యారేజీ గేట్లన్నీ ఎత్తి 11లక్షల క్యూసెక్కులకు పైగా నీరు విడుదల చేస్తుంటే దిగువ నదీ ప్రవాహ ప్రాంతంలో లంకలు, ఊళ్లు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వయంగా విజయవాడ వరద ప్రాంతాల్లో బోట్లలో పర్యటిస్తూ సహాయ, పునరావాస చర్యలను పర్యవేక్షిస్తున్నారు. అధికారయంత్రం అలమటించిన జనాలకు సోమవారం ఉదయానికల్లా ఆహారం, నీరు, పాలు తదితరాలు అందజేస్తున్నారు. ఎక్కడిక్కడ నుండి మరబోట్లు తెప్పించారు. మధ్య బంగాళాఖాతంలో 5వ తేదీన మరో అల్పపీడన హెచ్చరిక జనజీవనంతో చెలగాటమాడబోతే, పరిస్థితులు కుదుటపడటానికి కనీసం వారం రోజులు పడుతుంది. నష్టాల అంచనా, పరిహారం చెల్లింపు పెద్ద సవాలు కానుంది. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారయంత్రాంగాన్ని అప్రమత్తం చేసి వర్ష బాధితులకు భరోసా ఇచ్చే చొరవ తీసుకున్నారు. అలాగే అతి భారీ నష్టాలకు గురైన ఖమ్మం జిల్లా సందర్శిస్తున్నారు. వర్ష బాధిత జిల్లాల్లో మంత్రులకు తక్షణ సహాయ–పునరావాస చర్యల పర్యవేక్షణ అప్పగించారు. ఇది ప్రకృతి వైపరీత్యం. పర్యావరణ విధ్వంస పర్యవసానం. వాతావరణ మార్పు దుష్ఫలితం. గతంలో తమిళనాడు, కేరళలను, ఇటీవల కేరళలోని వయనాడ్‌ను, తాజాగా గుజరాత్‌ను ఇదే తరహా కుండపోత వర్షాలు అల్లకల్లోలం చేశాయి. సాధారణ పరిస్థితుల పునరుద్ధరణ రాష్ట్రాల శక్తికి మించిన పని. అందువల్ల కేంద్రప్రభుత్వం అన్ని విధాల వెంటనే సంబంధిత రాష్ట్రాలను ఆదుకోవాలి.

# డెమోక్రాట్ల సరికొత్త ఆశారేఖ కమలా హారిస్

దేవవ్రత విశ్వాస్

ప్రపంచవ్యాప్తంగా ఉత్కంఠ రేకెత్తిస్తున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల (నవంబరు 5వ తేదీ)కు ఉన్న గడువు ఇంకా సుమారు 65 రోజులే. జో బైడెన్ అధ్యక్ష పదవికి పై మాత్రం ఉత్తమ అభ్యర్థి కాదని, డొనాల్డ్ ట్రంప్‌ను ప్రతిఘటించేందుకు పార్టీకి ఆయన తగినతలో ప్రాతినిధ్యం వహించలేరని నెలరోజుల క్రితం డెమోక్రటిక్‌పార్టీలో తీవ్ర భయాలు నెలకొన్నాయి. ఎన్నికల్లో భారీనష్టం తప్పదని కూడా అంచనా వేశారు. ఈ తరుణంలో అధ్యక్ష అభ్యర్థిని ఎన్నుకునేందుకు ఆగస్టు 19 నుండి 22వ తేదీ వరకు ఇల్లినోయిస్ రాష్ట్రం చికాగోలోని యునైటెడ్ సెంటర్‌లో నాలుగు రోజులపాటు జరిగిన డెమొక్రటిక్‌పార్టీ జాతీయ సదస్సు (డిఎన్‌సి) ఒక మైలురాయి ఘట్టంగా మారింది.

సాధారణ సంప్రదాయం ప్రకారం పార్టీ అభ్యర్థిత్వాన్ని అధికారికంగా కైవసం చేసుకోవడానికి ముందుగా వివిధ రాష్ట్రాల్లో జరిగే ప్రైమరీల్లో ఆశావహ అభ్యర్థి విజయం సాధించి సత్తా నిరూపించుకుంటారు. 1968లో అమెరికా అధ్యక్షుడు లిండన్ జాన్సన్ ఒక పర్యాయం పదవీకాలం పూర్తిచేశాక రెండోసారి పోటీ చేయకుండానే పదవి నుండి వైదొలగారు. అదేవిధంగా ఈ శతాబ్దంలో పోటీ నుండి వైదొలగిన మొదటి అధ్యక్షుడు బైడెన్. కానీ 56 ఏళ్ళ తర్వాత నాటికి నేటికి 2024 ఎన్నికల్లో తేడా ఏమిటంటే, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అన్ని రాష్ట్రాల ప్రైమరీల్లో చాలా సునాయాసంగా విజయం సాధించి పార్టీ అభ్యర్థిత్వాన్ని ఖాయం చేసుకున్న తర్వాత తాను పోటీ నుండి వైదొలగుతున్నట్లు ఆకస్మికంగా జులై 19వ తేదీన ప్రకటన చేశారు. ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌ను తన స్థానంలో పార్టీ అభ్యర్థిగా ప్రతిపాదించారు. 81 ఏళ్ళ వయసులో బైడెన్ మానసికంగా పోయారని, రాబోయే నాలుగు సంవత్సరాలకాలంలో దేశాధ్యక్షుడుగా బాధ్యతలు నిర్వర్తించలేరని అనుమానాలు, ట్రంప్ చేతిలో ఆయన ఓడిపోతారని పార్టీలో రోజురోజుకూ పెరుగుతున్న సెంటిమెంటుకు బైడెన్ తలొగ్గి పోటీ నుండి వైదొలగుతున్నట్లు స్వయంగా ప్రకటించారు. తర్వాత సరిగ్గా నెలరోజులకు జరిగిన జాతీయ సదస్సులో డెమొక్రటిక్‌పార్టీ అధికారికంగా కమలా హారిస్‌ను అభ్యర్థిగా ప్రకటించింది. ఆమె నేరుగా పార్టీ అభ్యర్థిత్వాన్ని సంపాదించడం ద్వారా ఈ జాతీయ సదస్సు అనేక విధాలుగా ప్రాధాన్యం సంతరించుకుంది. దీంతో 2024లో జరుగుతున్న అమెరికా అధ్యక్ష ఎన్నికలను గతంకంటే భిన్నంగా మార్చనున్నారు.

చికాగోలో డెమొక్రటిక్‌పార్టీ జాతీయ సదస్సు ఎంతో అట్టహాసంగా ప్రారంభమైంది. గాజాలో ఇజ్రాయెల్ సాగిస్తున్న సామూహిక ఊచకోతలకు వ్యతిరేకంగా సదస్సు ప్రాంగణం వెలుపల ప్రదర్శకులు నిరసనలు తెలియజేశారు. కొంతసేపటికి ఈ నిరసనలు సర్దుమణిగాక సదస్సు యథాతథంగా ప్రారంభమయ్యాక, కమలా హారిస్‌ను అధ్యక్షురాలిగా, మిన్నెసోటా గవర్నర్ టిమ్ వాల్జ్‌ను ఉపాధ్యక్ష అభ్యర్థిగా వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన పార్టీ ప్రతినిధులు ఎన్నుకున్నారు. ఈ నాలుగు రోజుల్లోనూ వక్తల ప్రసంగాల్లో ఐక్యత, ఉత్సాహంగా పని చేయాల్సిన ఆవశ్యకతను బోధిస్తూ, డొనాల్డ్ ట్రంప్, హారిస్‌కు మధ్య ఉన్న వ్యత్యాసాలను వివరిస్తూ ఆమెను ఆకాశానికి ఎత్తేశారు. జో బైడెన్ పదవీకాలంలో జరిగిన అభివృద్ధిని ప్రశంసిస్తూ, ఆయనకు అత్యంత గౌరవాన్ని ఆపాదించారు. డెమొక్రటిక్‌పార్టీ తరఫున పనిచేసిన దేశ మాజీ అధ్యక్షులు, వివిధ రాష్ట్రాల గవర్నర్లు, కాంగ్రెస్‌లో నాయకులు, ఇతర పార్టీ ప్రముఖులు కోలాహలంగా ప్రసంగాలు చేసి నవంబరు ఎన్నికలకు పార్టీని సంసిద్ధం చేశారు. ''దేశంలో మొట్టమొదటి మహిళా అధ్యక్ష అభ్యర్థినిగా కమలా హారిస్ ప్రగతిమార్గంలో ప్రయాణించడానికి ఉన్న ఆటంకాలన్నింటినీ ఎట్టకేలకు అధిగమించారు'' అని హిల్లరీ క్లింటన్ మొదటిరోజు ప్రసంగంలో ఎంతో ఆశాభావం వ్యక్తం చేశారు. బైడెన్ సతీమణి, అమెరికా తొలి మహిళ జిల్ బైడెన్, ఎఓసిగా ప్రసిద్ధి చెందిన అమెరికా దిగువసభ ప్రతినిధి అలెగ్జాండ్రియా ఒకాసియో కోర్టెజ్ (న్యూయార్క్) తదితరులు కమలా హారిస్ ప్రతిష్టను ఇనుమడింపజేసేవిధంగా ప్రసంగాలు చేసి సదస్సును ఉత్తేజపరిచారు.

## హారిస్‌ను ఆకాశానికి ఎత్తేసిన మాజీ అధ్యక్షుడు

అధ్యక్షుడు జో బైడెన్‌ను ఒక గొప్ప కథానాయకుడుగా ఈ సదస్సులో అత్యంత గౌరవాన్ని ఆపాదించి ఘనస్వాగతం పలికి మర్యాద చేశారు. తన వారసురాలుగా హారిస్‌ను ప్రతిపాదించి బైడెన్ తన బాధ్యతలను ఆమెకు అప్పగించారు. జులైనెలలో ట్రంప్‌తో జరిగిన ముఖాముఖీ చర్చల్లో మతిమరపుతో నీళ్ళు నమిలి పరాజితుడుగా మిగిలిన తరహాలో కాకుండా జో బైడెన్ ఈ సదస్సులో ఖంగుమనే స్వరంతో ఎంతో భిన్నంగా భావోద్వేగంతో ప్రసంగించారు. 'యాభై



సంవత్సరాలపాటు పార్టీకి నేను అత్యుత్తమ సేవలు అందించాను' అని బైడెన్ తన సందేశంలో పేర్కొన్నారు. ఇక ఉపాధ్యక్షురాలు హారిస్ నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం కాకుండా ఆకస్మికంగా సదస్సు వేదికపై ప్రత్యక్షమై అందరినీ ఆశ్చర్యపరిచారు. జో బైడెన్‌పట్ల తన వినయ విధేయతలను ప్రకటించారు. ఆయన తర్వాత అధ్యక్షపదవి చేపట్టాక బైడెన్ విధానాలనే కొనసాగిస్తానని, ఇజ్రాయిల్‌లో కాల్పుల విరమణ ఒప్పందం త్వరలో సాధిస్తామని చెబుతూ, ''మన జాతికి మీరు చేసిన జీవితకాల సేవలకు, చరిత్రాత్మకమైన మీ నాయకత్వానికీ నా కృతజ్ఞతలు'' అని హారిస్ ప్రకటించి అందరి హృదయాలను చూరగొన్నారు.

ఇక రెండోరోజు సదస్సులో మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఒక ప్రత్యేక ఆకర్షణ. బైడెన్‌ను ఆయన ప్రశంసలలో ముంచెత్తారు. సదస్సుకు హాజరైన ప్రతినిధులు ఒబామాకు పెద్ద పెట్టున సుదీర్ఘ కరతాళ ధ్వనులతో, నినాదాలతో అభినందనలు తెలియజేశారు. ఒబామా చాలా స్పష్టమైన అభిప్రాయాలను తన ప్రసంగంలో ఉద్ఘాటించారు. ''నా ముద్దుల కుమార్తె హారిస్ దేశాధ్యక్షురాలుగా విజయం సాధించేందుకు ఇప్పుడు సిద్ధంగా ఉంది'' అంటూ ఆమెపై ప్రసంశలు కురిపించారు. డోనాల్డ్ ట్రంప్‌పై విరుచుకుపడ్డారు. ''ట్రంప్ అధ్యక్ష పదవికి పనికిరాని అల్పుడు'' అంటూ విమర్శలు గుప్పించారు. ఒక నల్లజాతీయురాలుగా అత్యున్నతమైన అధ్యక్ష పదవికి పోటీ పడుతున్న హారిస్ కూడా, ''ట్రంప్ స్త్రీ ద్వేషి, జాతివివక్ష పాటించే వ్యక్తి, నీచుడు, అబద్ధాలకోరు, ప్రజలు సుఖంగా బ్రతకడానికి పరిష్కారాలు సాధించలేడు'' అని విమర్శలు చేశారు.

## ప్రజలు ఒక్కరే నా క్లయింట్ : హారిస్

రెండోరోజు సమావేశంలో హారిస్‌ను అధికారికంగా అభ్యర్థిగా ప్రకటించారు. ఆమె కూడా విధేయతతో ఆ అభ్యర్థిత్వాన్ని స్వీకరిస్తున్నట్లు ప్రకటించారు. వెర్మోంట్‌లో ఇండిపెండెంట్ సెనేటర్ బెర్నీ శాండర్స్ ఈ సదస్సులో మరో ముఖ్యమైన వక్త. తదుపరి డెమోక్రటిక్ పార్టీ పాలనకు అసరమైన రాడికల్ ఎజెండాను ఆయన సదస్సులో ప్రవేశపెట్టారు. హారిస్ ఉపాధ్యక్ష అభ్యర్థి, మిన్నెసోటా గవర్నర్ టిమ్ వాల్జ్‌ను మూడోరోజు సదస్సులో బిల్ క్లింటన్ పరిచయంచేసి ఆయనతో కలిసి సందడి చేశారు. ఆయనతోపాటు పెన్సిల్వేనియా గవర్నర్ జోష్ షాపిరో వంటి అనేకమంది ప్రముఖ నాయకులు, మాజీ స్పీకర్ నాన్సీ పెలోసీ ప్రతినిధుల కేరింతలమధ్య ప్రసంగాలు చేశారు. నాలుగోరోజు సదస్సులో ప్రతినిధుల హర్షధ్వానాలమధ్య కమలాహారిస్ ఉత్కంఠభరిత ప్రసంగం చేస్తూ, తన యావత్ రాజకీయ జీవితంలో తన క్లయింట్ ప్రజలు ఒక్కరేననీ, వారికోసమే తాను పోరాడతాననీ అన్నారు. అందుకు భిన్నంగా ట్రంప్‌కు తన వ్యక్తిగత ప్రయోజనాలే తన ఏకైన క్లయింట్ అనీ, వాటికోసమే ఆయన పనిచేస్తారనీ ఎద్దేవా చేశారు. అందరికీ వైద్యసేవలు, సరిహద్దు భద్రతా చట్టం, వలసల నియంత్రణ చర్యలకు ఆమె భరోసా ఇచ్చారు. మధ్యాసియా సమస్య పై విస్తారంగా సుదీర్ఘ ప్రసంగం చేశారు. త్వరలో కాల్పుల విరమణ సాధిస్తామన్నారు. గాజా ప్రజల భద్రత, వారి స్వయం ప్రతిపత్తి నిర్ణయాన్ని, గౌరవాన్ని కాపాడతామని హామీ ఇచ్చారు. సెనేటర్ ఎలిజబెత్ వారెన్ ట్రంప్–హారిస్ మధ్య ఎలాంటి వ్యత్యాసాలున్నాయో చెప్పి ట్రంప్‌ను దునుమాడారు. నిత్యావసరాలు, గ్యాస్, ఇళ్ళు, ఆరోగ్య రక్షణ, పన్నులు, అబార్షన్ వంటి అనేక సమస్యలపై హారిస్ నిలబడి పోరాడుతుందన్నారు.

## సర్వేల్లో హారిస్‌దే పైచేయి

ఎన్నికల్లో విజయావకాశాలపై జరుగుతున్న తాజా సర్వేల్లో కమలా హారిస్ పైచేయి సాధించడం ట్రంప్‌కు ఆందోళన కలిగిస్తున్నది. చికాగోలో జరిగిన డిఎన్‌సి సదస్సును సగటున 21.80 మిలియన్ల మంది వీక్షించారు. జులైలో విస్కాన్సిన్ మిల్‌వాకీలో జరిగిన రిపబ్లికన్‌పార్టీ జాతీయ సదస్సును 19.10 మిలియన్ల మంది వీక్షించారు. డిఎన్‌సి చివరిరోజు సదస్సును రికార్డుస్థాయిలో 28.9 మిలియన్ల మంది వీక్షించారు. అదే ట్రంప్ చివరి రోజు సదస్సును 28.3 మిలియన్లమంది మాత్రమే వీక్షించారు. ఈ గణాంకాలు రిపబ్లికన్లలో అలజడి సృష్టిస్తున్నాయి. ఐతే డిఎన్‌సి సదస్సు తర్వాత హారిస్ గాలిలో తేలిపోవడంలేదు. ఆమెకు చివరినిమిషం వరకూ జరిగే పరిణామాల వాస్తవాలపై అవగాహన ఉంది. కానీ న్యూయార్క్ టైమ్స్ పోలింగ్ యావరేజ్ ప్రకారం, జులైలో ట్రంప్ కంటే ఐదుపాయింట్లు వెనుకబడిన హారిస్ డిఎన్‌సి సదస్సు తర్వాత రెండు పాయింట్లు ఆధిక్యంలో ఉన్నారు. ఎమెర్సన్ కాలేజ్–ఫెయిర్‌లీగ్ డికిన్సన్ యూనివర్సిటీ తాజా సర్వే ప్రకారం, మొత్తంగా చూస్తే కమలా హారిస్ ట్రంప్‌పై ఏడు పాయింట్లు ఆధిక్యంలో ఉన్నారు. ఈ ఫలితాలపట్ల డెమోక్రటిక్ పార్టీ ఆశాభావంతో ఉన్నప్పటికీ నిశ్చింతగా మాత్రంలేదు. జాతీయ సగటు ప్రకారం హారిస్ 49 శాతం, ట్రంప్ 46 శాతం లీడింగ్‌లో ఉన్నారు. ఎలాంటి ఆంక్షలూ లేకుండా అన్ని వర్గాలనూ కూడగట్టేందుకు ఆమె కృషి చేస్తున్నారు. అమెరికా ప్రజలందరికోసం తాను పాటు పడతానని ఆమె అంటున్నారు.

(బోస్టన్ నుండి)

# ఇదీ మన భారతం!



ఎస్.బాబు, అధ్యక్షులు
టిఎస్ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్

భారతదేశం వ్యవసాయక దేశం. సగంమందికి వ్యవసాయమే ప్రధాన ఆదాయ వనరు. ప్రపంచ వ్యవసాయక దేశాలలో మనది 4వ స్థానం. మొదటి స్థానంలో చైనా ముందంజలో ఉంది. శాస్త్ర, సాంకేతిక రంగాలతోపాటు వ్యవసాయరంగంలో కూడా చైనా దూకుడు ప్రదర్శిస్తోంది. 1949వ సంవత్సరంలో స్వాంతంత్ర్యం పొందిన చైనా అన్ని రంగాలలో ముందుకుపోతుంటే ఆ దేశం కంటే 2సంవత్సరాల ముందే స్వాతంత్ర్యం పొందిన మనదేశం అభివృద్ధిలో నత్తనడక నడుస్తోంది. భారతదేశ ప్రస్థానాన్ని ప్రపంచ దేశాలు స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రధాన మంత్రి అంటున్నారు. ప్రపంచ దేశా లు స్ఫూర్తిగా తీసుకునే స్థాయిలో మనమున్నామా? క్రీడారంగంలో మన దేశాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలంటే మొన్న జరిగిన ఒలంపిక్ క్రీడల్లో టాప్1 లోనే కాదు టాప్70 లో కూడా లేము. వ్యవసాయంలో స్ఫూర్తిగా తీసుకోవాలంటే టాప్1లో ఉన్నది కూడా మన దేశం కాదు, శాస్త్ర సాంకేతిక రంగాల్లో స్ఫూర్తిగా తీసుకోవాలంటే లిస్టెడ్ కంట్రీస్‌లో మనం నెం.1 కాదు. ఏ కారకాల్లో మనం ముందున్నామని ప్రపంచ దేశాలు స్ఫూర్తిగా తీసుకుంటాయి?తయారీరంగంలో భారతదేశం గ్లోబల్ హబ్‌గా ఏర్పడుతుందంటున్నారు. ఇన్ఫ్రాస్ట్రక్చర్ లే దు, ఇన్వెస్ట్మెంట్లు లేవు, సాంకేతిక అభివృద్ధి లేదు. మేకిన్ ఇండియా మూలబడింది, ఎక్కడ చూసినా డిజ్‌ఇన్వెస్ట్‌మెంట్లే. గ్లోబల్ హబ్ ఎలా అవుతుంది?

భారతదేశం ప్రపంచంలో నైపుణ్యాలకు రాజధాని అవుతుందంటున్నారు. ఈ దేశంలో ఉన్న మేధావులు శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి సాధించినవారు, శాస్త్రజ్ఞులు లాంటి నైపుణ్యం కలవారంతా ఇక్కడ సౌకర్యాలు లేవని ఇతర దేశాలకు వలస పోతున్నప్పుడు నైపుణ్యం గల రాజధాని ఎలా అవుతుంది?

మహిళలను లక్షాధికారులను చేస్తామని, మహిళా ఓటు బ్యాంకును కాపాడుకోవాలని చూస్తున్నారు.1999 నుండి 2004 వరకు, 2014 నుండి2024 వరకు బిజెపియే అధికారంలో ఉంది. 2029 వరకు బిజెపి ప్రభుత్వమే అందలంలో ఉంటుంది. ఎంతమంది మహిళల్ని లక్షాధికారుల్ని చేశారో గణాంకాలేమైనా వివరించగలవా? మెడికల్‌రంగంలో 75వేల సీట్లు విద్యార్థులకు పెంచామని చెప్పుకుంటున్నవారు, నీట్ పరీక్షలో జరిగిన కుంభకోణం గురించి ఎందుకు వివరించ రు? నలందా విశ్వవిద్యాలయాన్ని పునరుద్ధరించామని ఇప్పుడు గొప్పలు చెప్తున్నారు. కాని 6వ శతాబ్దం నాటికే హర్షుడు ఈ దేశాన్ని పరిపాలించిన సమయంలో ఇతర దేశస్తులు మన దేశం వచ్చి నలంద, తక్షశిల విశ్వవిద్యాలయాల్లో చదువుకున్నారు. అంతరిక్షంలో భారతదేశం దూసుకుపోతోంది అంటున్నారు. కానీ అంతరంగాలలో అంతా వెనకబాటుతనమే కదా! యువతకు భారీ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పుకుంటున్నారు.. అదే నిజమైతే ఇంత నిరుద్యోగ సమస్య ఎందుకుంటుంది?

1999 నుండి 2004 వరకు జరిగిన బిజెపి పాలనలో దేశం వెలిగిపోతుంది అన్నారు. కాని వెలుగులెక్కడా కనపడలేదు. ఇప్పుడు వికసిత భారత్ అంటున్నారు. అంటే కమల వికాసమేనా? లేక నిజంగానే దేశం వికసిస్తుందా? ఈ దేశాన్నే రత్నగర్భ అంటారు. అన్నపూర్ణ అంటారు. కాని అన్నదాతకు అన్నం దొరకదు. ఆత్మహత్యలు తప్ప. దేశవ్యాప్తంగా రోజుకు 48మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. పేరుకు వ్యవసాయ దేశ మే కాని తీరులో మాత్రం ఆకలి రాజ్యం. పాలు, కోడిగుడ్ల ఉత్పత్తులలో ప్రపంచంలో మనదేశం నెం.1. అయినా పౌష్టికాహార లోపంతో అనేక శిశు మరణాలు. ప్రపంచ జనాభా 800 కోట్లు. వీరిలో 100 కోట్ల మందికి బహిరంగ ప్రదేశాలే మరుగుదొడ్లు. ఇందులో 60 కోట్ల మంది భారతదేశంలోనే ఉన్నారని యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్ ఇచ్చిన నివేదికలో పేర్కొన్నది. 30శాతం మందికి అక్షరాస్యత లేదు. తండాలు, అటవీ ప్రాంతాలైన గూడాలలో నిరక్షర కుక్షులు అనేకమంది. రోడ్డు సౌకర్యాలు, వైద్య సౌకర్యాలులేక అనేకమంది చనిపోతున్నారు.

దారిద్ర్యరేఖకు దిగువన 35శాతం మంది బతుకుతున్నారు. ఇండియాలో బిచ్చగాళ్ళ సంఖ్య 2011 సెన్సెస్ ప్రకారం 4,13,670. ప్రపంచంలో అత్యధిక ధనవంతుడైన బిచ్చగాడు మన దేశంలోనే ఉన్నాడంటే అతిశయోక్తి కాదు. ఈ దేశ 50 శాతం సంపద ఒక్క శాతం ఉన్నవారి దగ్గరే ఉంది. ఎన్నో సహజ వనరులు ఉన్నా దేశంలో అభివృద్ధి మాత్రం జరగాల్సినంత జరగడం లేదు. పెట్రోల్ తప్ప ఏ సహజ వనరులూ లేని దుబాయ్ దేశం అభివృద్ధి లో దూసుకుపోతోంది. అణుబాంబు విస్ఫోటనకు గురైన జపాన్ దేశం ఎలక్ట్రానిక్ రంగంలో రాజ్యమేలుతోంది. ఒలింపిక్స్ క్రీడలలో దూసుకుపోతోంది. కాని మన దేశంలో రోడ్లు లేని ఏజెన్సీ ప్రాంతాలు, నీరులేని గ్రామాలు, వైద్య సౌకర్యంలేని తండాలు, సేద్యంలేని బీడుభూములు, ఇదీ మన భారతం. దేశం వెనకబాటుతనానికి కారణం ఎటుచూసినా అవినీతి, స్కీములు, స్కాములు.

కేంద్ర ప్రభుత్వం లాభాలలో ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను కూడా కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తోంది. దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు గండిపడి కార్పొరేట్ శక్తులు అపర కుబేరులుగా అవతరిస్తున్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చే సామాజిక భద్రత తగ్గిపోతోంది అని చెప్పటానికి పెద్దగా ఆర్థికపరమైన జ్ఞానం ఉండవలసిన అవసరం లేదు. ప్రభుత్వం తన కోశాగారాన్ని భర్తీ చేసుకోవటం కోసం ధనవంతులు, అధిక ధనవంతులపై పన్నులు వేయవచ్చు. కాని ఈ దేశంలో ప్రభుత్వం వారి మిత్రులైన ధనవంతులకు, అధిక ధనవంతులకు పన్నులు వేయలేరు కదా. ఎందుకంటే ఈ ప్రభుత్వ పార్టీలకు ఆర్థిక సహాయం అందించేది కార్పొరేట్ శక్తులే కదా.

29 రాష్ట్రాలు, 7 కేంద్రపాలిత ప్రాంతాలతో ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం మనది. అయినా వ్యక్తి స్వాతంత్ర్యం, భావ స్వాతంత్ర్యం లేక అనేకమంది మేధావులు, కవులు, రచయితలు జైళ్ళలో మగ్గుతున్నారు. మరికొంతమందిని అసాంఘిక శక్తులు హత్య చేశాయి. 1956లో 35 కోట్ల జనాభా ఉంటే, 2023 డిసెంబర్ నాటికి 142కోట్లకు పెరిగింది. ఈ పెరుగుదల శాస్త్ర సాంకేతిక రంగాలతోపాటు ఇతర పారా మీటర్లలో లేకపోవడం వాస్తవం. స్వాతంత్ర్యం సిద్ధించిన ఈ 77 సంవత్సరాలలో మన అక్షరాస్యత కేవలం 75శాతం. అక్షరాస్యత తక్కువగా ఉండటానికి కారణం బడ్జెట్‌లో బిజెపి ప్రభుత్వం విద్యకు కేవలం 120వేల కోట్ల నిధులు కేటాయించడమే. అదే పారిశ్రామిక దేశాలలో 98 శాతం అక్షరాస్యత ఉంది.

ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్ ప్రకారం ఒక డాక్టర్ ఒక రోజులో 40 మంది రోగులను మాత్రమే చూస్తాడు. కాని మనదేశంలో ఒక డాక్టర్ 855 మంది రోగులను చూస్తాడు. అభివృద్ధి చెందిన పారిశ్రామిక దేశాలలో 1 డాక్టర్ కు 175 మంది రోగులు ఉన్నారంటే మన దేశం ఎంత ఆరోగ్యంగా ఉందో తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం 2024– 2025 బడ్జెట్‌లో ఆరోగ్యం కోసం 90,950 కోట్ల రూపాయలు కేటాయిస్తే ప్రజలకు వైద్య సౌకర్యా లు ఎలా అందుతాయి? ప్రజల ఆరోగ్యం కోసం ఇంత తక్కువ బడ్జెట్ కేటాయించడం విచారకరం. 65లక్షల మంది కరెంట్ లేక చీకటిలో కిరోసిన్ లాంతర్ల వెలుగులో బ్రతుకుతున్నారు. 29,852 గ్రామాలకు ఈ దేశంలో విద్యుత్ సౌకర్యం లేదు. 14,000 కిలోమీటర్ల అతిపెద్ద తీర ప్రాంతం ఉన్నటువంటి చైనా అగ్ర రాజ్యాల సరసన ఉంటే, 7200కిలోమీటర్ల తీరప్రాంతంతో పాటు నదీనదాలు ఉన్న మనదేశం అభివృద్ధికి నోచుకోలేదంటే కారణం అవినీతి, బంధుప్రీతి, చీకటి బజారు. ఎప్పుడైతే ఈ దేశంలో వీటిని నియంత్రించగలుగుతామో అప్పుడే దేశాభివృద్ధి జరుగుతుంది.

# మారుతున్న సామాజిక విలువల్లో ఉపాధ్యాయుడి పాత్ర

భారత రాష్ట్రపతిగా మంచి విద్యావేత్తగా పేరు తెచ్చుకున్న డా౹౹సర్వేపల్లి రాధాకృష్ణన్ సెప్టెంబర్ నెలలో జన్మించడం క్యాలెండర్‌లో సెప్టెంబర్ నెలకు ఒక ప్రాధాన్యత తెచ్చింది. ప్రజలను ఉన్నతంగా భావించే సమాజంలో ఉపాధ్యాయుడు లేకుండా సమాజం సక్రమంగా తీర్చిదిద్దబడదనీ, అదే విధంగా సమాజాన్ని దేవాలయంగా గురువులనే పూజారి లేకుండా విద్యార్థికి సమాజానికి సంబంధం లేదని చెబుతుంటారు. దీనిలో భాగంగానే గురువును బ్రహ్మగా సంబోధిస్తారు. సెప్టెంబరు ఐదున జన్మించిన భారతీయ మేధావిగా, తత్వవేత్తగా చెప్పుకునే డా౹౹సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని గురుపూజోత్సవంగా లేదా ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించుకోవడం అందుకు ఉపాధ్యాయులు గర్వపడడం సెప్టెంబర్ నెలకు ప్రాధాన్యత పెరగటం సహజ మే.

సమాజం ఉపాధ్యాయుల నుండి చాల ఆశిస్తుంది. ఉపాధ్యాయులు డా౹౹సర్వేపల్లి రాధాకృష్ణన్ లేదా అబ్దుల్ కలామ్, రామకృష్ణ పరమహంసలాగ వుండాలని కోరుకోవడంలో తప్పు లేదు. ఉపాధ్యాయులు విలువలతో కూడుకున్న మార్గదర్శకులుగా వుండాలి కూడ. అలాంటి వారితో పోల్చుకుని నేడున్న ఉపాధ్యాయులు నిబద్ధత లేని వారుగా విద్యారంగాన్ని దిగజార్చుతున్నారనో ముఖ్యంగా సర్కార్ పాఠశాలలకు వెళ్ళే పిల్లలకు చదువు రావడంలేదనీ దీనికంతటకు ఉపాధ్యాయుడే కారణమనీ అనేక ప్రశ్నలను ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్నారు. విద్యారంగంలో వస్తున్న మార్పులకు ఉపాధ్యాయులు జవాబుదారీగా మారుతున్నాడు కాని జరుగుతున్నదేమిటి? తల్లిదండ్రులు, సమాజం, మేధావులు విద్యారంగంలో వస్తున్న మార్పులు పరిశీలిస్తున్నారా? సంస్కరణల పేరుతో విద్యారంగంలో తప్పంతా ఉపాధ్యాయులదేనని గోచరిస్తుంది. భారతదేశ స్వాతంత్ర్యం కన్నా ముందు, తదుపరి దేశంలో విద్యా విధానం ఎలా వుండాలి? అని ప్రభుత్వాలు అనేక కమీషన్లు వేశాయి. డా౹౹ సర్వేపల్లి రాధాకృష్ణన్, డా౹౹ కొఠారి వంటి మేధావులు మన దేశంలో విద్యావిధానం ఎలా వుండాలి అనడానికి భారత రాజ్యాంగ స్ఫూర్తి ఆధారంగా చాలా చక్కటి సూచనలు చేశారు. ఆ రిపోర్టులను పార్లమెంటులో చర్చించారు, అమలుకు మాత్రం నోచుకోలేదు. భారతదేశం విభిన్న సంస్కృతులు, భాషలు, సాంఘిక అంతరాలు ఆర్థిక అసమానతలు ప్రజల మధ్య అనేక వివక్షతలు వున్న దేశం. జాతీయ సమైక్యత, వివక్ష, సాంఘిక, ఆర్థిక అసమానతలు లేని నూతన సమాజ స్థాపన జరగాలంటే విద్యనే సరియైన సాధనమని, విద్యకు పాఠశాల పునాది అవుతుందని, అందరికి ఒకే విధమైన పాఠశాల వ్యవస్థ వుండాలనీ, కామన్ స్కూల్ విధానం ఆ స్కూళ్లను కూడా ప్రభుత్వమే నిర్వహించాలని సూచించడం జరిగింది. కాని పాలకులు ఈ సూచనలను అమలు చేయలేదు. ప్రపంచవ్యాప్తంగా వచ్చిన మార్పులు కావచ్చు, పాలకులు దేశాన్ని 21వ శతాబ్దానికి తీసుకెళ్తున్నామని 1986లో నూతన విద్యా విధానం పేరుతో విద్యారంగంలో అనేక మార్పులు చేశారు అప్పటి వరకు విద్యారంగంలో వున్న సమస్యలను చర్చకుతెస్తూనే కామన్ స్కూలు విధానాన్ని విధ్వంసం చేస్తు వ్యాపార విధానాలు ప్రోత్సహిస్తు విద్యను సరుకుగా మార్చారు దీనితో వివక్షలు, అసమానతలు లేని సమాజాన్ని నిర్మించడానికి ఉపయోగపడవలసిన విద్య నేడు అనేక అసమానతలు సృష్టించేదిగా మారింది. గురు శిష్యుల సంబంధంతోపాటు పాఠశాల, సమాజం సంబంధాలు కూడా వ్యాపార సంబంధాలుగా మారినాయి. విద్యను పొందే హక్కును నేడు డబ్బే శాసిస్తున్నది.

ప్రపంచీకరణ విధానాలను అవలంబిస్తున్న మన పాలకులు ఇంకోక అడుగు ముందుకు పోయి విద్యను కార్పొరేటీకరణ దిశగా నడిపిస్తున్నారు. విద్యారంగంలో వ్యాపార విలువలు ముందుకు తీసుకుపోతూ విదేశీ విద్యాలయాలకు అనుమతులు ఇవ్వడంకోసం పార్లమెంటులో చట్టాలు చేస్తున్నారు. ఉపాధ్యాయులు అందరూ సర్వేపల్లి రాధాకృష్ణన్ లుగా వుండాలని కోరుకునే వారు ఆనాటి సామాజిక ఆర్థిక పరిస్థితులు ఏమిటి , నేటి ఆర్థిక స్థితిగతి ఏమిటి? నేటి స్థితిగతులు ఏమిటీ? అని బేరిజు వేసుకోకుండా వస్తుగతంగా చూస్తే ఉపాధ్యాయుడు దోషిగా కన్పించవచ్చు. దీని వలన ఫలితంకూడా వుండదు. సమాజంలో వ్యాపార విలువలు రోజురోజుకీ పెరుగుతున్న సమయంలో ఆ సమాజంలో నివసించే వ్యక్తిగా ఉపాధ్యాయుడు ఒక్కడే ఆ విలువలకు వ్యతిరేకంగా నిలబడడం కష్టం. విద్యను కార్పొరేటీకరిస్తున్న శక్తులు డిజిటల్ స్కూల్స్ పేరుతో షార్ట్ సర్క్యూట్ కెమెరాతో డేగ కండ్లతో సరాసరి తరగతిగదిలో శాసిస్తున్నారు. స్వేచ్ఛగా భావ ప్రకటన చేయాల్సిన ఉపాధ్యాయుడు తరగతి గదిలో బందీగా నిలబడినప్పుడు తరగతి గదికి ఉపాధ్యాయుడికి మధ్య సాంకేతిక సంబంధం మాత్రమే వుంటుంది. అలాంటి చోట గురు శిష్యు ల సంబంధం ఎలా వుంటుందో ఆలోచించాలి. పరీక్ష ఫలితాలు ర్యాంకులు, సీట్లు, ప్రచా రం చేసుకుని మార్కెట్‌ను విస్తరించుకుంటున్న కార్పొరేట్ ఆక్టోపస్ లు ప్రభుత్వ విద్య వ్యవస్థను మింగేస్తున్న రోజులలో సమాజానికి ఉపాధ్యాయునికి, విద్యార్థికి సంబంధం ఏ విధంగా వుండాలని ఆశిద్దాం?! ఏ సమాజంలోనైనా మానవ సంబంధాలు ఆనాటి సామాజిక ఆర్థిక సంబంధాల పైననే ఆధారపడి వుంటాయి. ఉపాధ్యాయులు ఒంటరిగా ఈ మార్పులు ఆపగల రా? ఈ వ్యవస్థ లో మా పిల్లలకు ఏ లాభం జరుగుతుందనే భావన కాకుండా అందరి పిల్లలకు అవసరమైన విద్య వ్యవస్థను, మానవ విలువలను పెంపొందించే సమాజాన్ని నిర్మించడానికి ఉపాధ్యాయుడి పాత్రముఖ్యమని తల్లిదండ్రులు గుర్తించగలరా!

శోభ రమేష్,
8978656327

# అడుగడుగునా డిజిటల్ మోసాలు!

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో వస్తున్నకొద్దీ, ప్రజలకు ఎన్నో సౌకర్యాలు లభిస్తున్నాయి. ప్రపంచం మొత్తం అరచేతిలో ఇడిమిపోయినట్టు కనిపిస్తుంది. కానీ, అదే సాంకేతిక కారణంగా మోసాలు, నేరాలు కూడా పెరుగుతున్నాయి. 'ఫెడెక్స్' పేరుతో జరిగిన, జరుగుతున్న మోసాలను ఈ సందర్భంగా ప్రస్తావించాలి. ఏవైనా సరుకులు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి పంపే ప్రముఖ కార్గో సంస్థల్లో 'ఫెడెక్స్' ఒకటి. అధికశాతం మంది విదేశాల్లో ఉంటున్న తమ పిల్లలు, కుటుంబీకులు, బంధువులు, స్నేహితులకు ఇక్కడినుంచి ఎక్కువగా ఫుడ్ ఐటమ్స్ పంపుతారు. దీనిని అవకాశంగా తీసుకొని, కొంతమంది సైబర్ నేరగాళ్లు 'ఫెడెక్స్' ఉన్నతాధికారుల పేరుతో కస్టమర్లకు ఫోన్లుచేసి బెదిరిస్తున్నారు. వారు పంపిన పార్సిల్‌లో మాదక ద్రవ్యాలు లభించాయని, కేసు పెడితే జీవితాంతం జైల్లోనే ఉండాల్సి వస్తుందని భయపెడుతున్నారు.ఎలాంటి కేసు లేకుండా బయటపడాలంటే, తాము డిమాండ్ చేసిన మొత్తం చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నారు. కేవలం బెంగళూరులోనే ఈ సైబర్ నేరగాళ్ల బారిన పడిన వారు దాదాపు ఐదుకోట్ల రూపాయలు పోగొట్టుకున్నారంటే, పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. చివరికి ఈశాన్య రాష్ట్రాల్లోనూ 48 కేసులు నమోదయ్యాయి.

'ఫెడెక్స్' పేరుతో జరుగుతున్న మోసాల మాదిరిగానే 'డిజిటల్ అరెస్టు'లు కూడా పెరుగుతున్నాయి. ఆన్‌లైన్ బెదిరింపులు, బ్లాక్‌మెయిలింగ్‌లు తీవ్ర స్థాయికి చేరుతున్నాయి. ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న కనీసం 1000స్కైప్ ఐడిలను రద్దు చేయడానికి కేంద్రం ఉపక్రమించింది. మైక్రో సాఫ్ట్‌తో కలిసి పని చేస్తున్నది. అయితే, సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడిన ఎంతోమంది బయటకు చెప్పుకోలేక మౌనం వహిస్తున్నారన్నది నిజం. ఏదిఏమైనా, ప్రజలను అమాకులను చేసి, మోసంతో డబ్బు దోపిడీ చేసేందుకు సైబర్ నేరగాళ్లు ఉపయోగిస్తున్న వినూత్నమైన, సరికొత్త విధానమే 'డిజిటల్ అరెస్టు'. 'డిజిటల్ అరెస్టు' చేసినందువల్ల, భవిష్యత్తులో ఎలాంటి డిజిటల్ లావాదేవీలు చేయడానికి వీలుండదని హెచ్చరిస్తారు. ఒకవేళ ఎక్కడికైనా పారిపోవడానికి ప్రయత్నించినా, డిజిటల్ ట్రాకింగ్ ద్వారా పసిగడతామని, బయటకు రాకుండా అడ్డుకుంటామని కూడా హెచ్చరిస్తారు. మానసికంగా ఒత్తిడిపెంచి, చివరికి బాధితుల నుంచి తాము డిమాండ్ చేసిన మొత్తాన్ని దోచుకుంటారు. ఈ మధ్య ఇలాంటి కేసులు పెరుగుతున్నాయి.

**జాగ్రత్తలు అవసరం** : ఇలాంటి సైబర్ దోపిడీకి గురికాకుండా ఉండాలంటే, కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి. పాస్‌వర్డ్‌లను, సాఫ్ట్‌వేర్లను క్రమం తప్పకుండా అప్‌డేట్ చేయాలి. అనధికారిక యాక్సెస్ అవకాశాలను తగ్గించడానికి రెండు రకాల ప్రమాణీకరణలను అనుసరించాలి. సందేహాత్మక లింక్‌ల పై క్లిక్ చేయకూడదు. అదే విధంగా తెలియని మూలాల నుంచి ఆయా గ్రూప్‌లు లేదా సమూహా ల్లో చేరమని వచ్చే విజ్ఞప్తులపై స్పందించకూడదు. మనకు తెలియని యాప్‌లను డౌన్‌లోడ్ చేయకూడదు. ఏదైనా వ్యక్తిగత సమాచారం కోరుతూ వచ్చే ఉసందేశాలు, ఇమెయిల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి. ప్రత్యేకించి బ్యాంకుల పేరుతో ఏవైనా సందేశాలు వస్తే, నేరుగా సదరు బ్యాంకుకు వెళ్లి వివరాలు తెలుసుకోవాలి. అంతేగానీ, గుడ్డిగా సమాచారం ఇవ్వరాదు. ప్రసిద్ధి చెందిన యంటీవైరస్, యాంటీ మాల్‌వేర్ పరిష్కారాలను ఇన్‌స్టాల్ చేసుకోవడం మంచిది. ఆపరేటింగ్ సిస్టమ్స్, అప్లికేషన్లను తాజా భద్రతా ప్రొటోకాల్స్‌తో ఎప్పటిపుకప్పుడు నవీకరించాలి. వర్చువల్ ప్రైవేట్ నెట్‌వర్క్ (విపిఎన్)ల ద్వారా ఇంటర్నెట్ కనెషన్లను పొందాలి. తద్వారా గోప్యత, భద్రత ఉంటుంది. అవసరమైతే, విశ్వసనీయమైన ప్రొవైడర్ల నుంచి మాత్రమే జనరల్ యాక్సెస్ చేసుకోవాలి. ఒటిపిలు ఎట్టిపరిస్థితుల్లోనూ ఇతరులతో షేర్ చేయకూడదు. పబ్లిక్ ఫోరమ్స్‌లో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి.

## బిసిల రిజర్వేషన్ 42శాతం పెంచాలి

### బిసి సంక్షేమ సంఘం డిమాండ్




**ప్రజాపక్షం/చందూరు:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సమగ్ర కులగణన చేపట్టి బిసిల రిజర్వేషన్‌ను 42శాతం పెంచాలని డిమాండ్ చేస్తూ సోమవారం బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యా లయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా పలువురు బిసి సంఘం నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో సమగ్ర కులగణన చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిసి విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నల్ల మధుయాదవ్, సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కందుల వెంకటేశ్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు శివ, వంశీకృష్ణ, హేమంత్, నవీన్‌చంద్ర పాల్గొన్నారు.

## గండి ప్రదేశం పరిశీలన



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్‌రూరల్ :** మండలంలోని బూరుగడ్డ గ్రామంలో గత రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షంతో నల్లచెరువుకు గండి ఏర్పడింది. సోమవారం నల్లచెరువు గండి ప్రదేశాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్ సహకారంతో నల్లచెరువు గండికి వెంటనే మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అరుణ్‌కుమార్ దేముఖ్, యరగాని నాగన్నగౌడ్, ఈడ్పుగంటి సుబ్బారావు, యరగాని రామస్వామి, మచ్చ వెంకటేశ్వర్లు, కుందూరు శ్రీనివాస్‌రెడ్డి, గరిణె శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్‌లో సిపి సుధీర్‌బాబు పర్యటన



**ప్రజాపక్షం/యాదాద్రి:** రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కమిషనరేట్ పరిధిలోని చౌటుప్పల్ పోలీస్ స్టేషన్, మల్కాపురం చెరువు, పంతంగి టోల్ గేట్‌లను సీపీ సుధీర్ బాబు ఐపిఎస్ సందర్శించారు. ప్రజలు, వాహన దారులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, తీసుకోవలసిన నష్టనివారణ చర్యలు, తీసుకోవ లసిన జాగ్రత్తల గురించి అధికారులకు వివరించారు. టోల్ గేట్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు పలు సూచనలు చేశారు. సిబ్బంది పనితీరు, సామాన్య ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షిం చడానికి చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. స్టేషన్ లోని రికార్డులను పరిశీలించడంతో పాటు రిసెప్షన్, పెట్రోలింగ్ స్టాఫ్ వంటి పలు విభాగాల పనితీరు, సీసీటీవీల నిర్వహణ వంటి అంశాలను సమీక్షించారు. సమస్యాత్మక ప్రాంతాల సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

## నష్టంపై నివేదిక అందించాలి

### జెడ్‌పి సిఇఒ ప్రేమ్‌కరణ్‌రెడ్డి



**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** గ్రామాల్లో భారీ వర్షాలతో జరిగిన నష్టం నివేదికను ఇవ్వాలని జెడ్‌పి సిఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. జిల్లాలో భారీ వర్షాల వల్ల మిర్యాలగూడ మండలంలో ధ్వంసమన రోడ్లు, కూలిపోయిన ఇండ్లు, భవనాలు, శానిటేషన్ పనులు చేయించాలని, కూలిన విద్యుత్ స్తంబాలు, తెగిన విద్యుత్ వైర్లు పునరుద్ధరించాలని, ప్రజలకు నల్లాల ద్వారా తాగునీరు అందించాలని, సీజనల్ వ్యాధులు రాకుండా శానిటేషన్ పనులు చేయించాలన్నారు. కల్వర్టులు, బ్రిడ్జిలు ఏమైనా తెగితే తెలియచేయాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా అధికారులు అందుబాటులో ఉండి సహాయ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరిశర్మ, ఎంపీవో రమేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



**ప్రజాపక్షం/కోదాడ :** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షులు బొల్లు ప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండలంలోని తమ్మరలో వరద ఉధృతికి నీట మునిగిన పంట పొలాలను రైతులతో కలసి ఆయన పరిశీలించారు.చెరువుకు విపరీతమైన వరద రావడంతో వరద నీరు వెళ్లే మార్గం లేక చెరువు నుండి తూముకు వెళ్లే కాల్వకు గండి పడటంతో గ్రామానికి చెందిన కెవిఎల్ఎన్ ప్రసాద్ పొలంలో ఇసుక మేటలు వేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు.గ్రామంలో 500ల ఎకరాలు వరద నీటితో మునిగిపోయిందని రైతులు,కౌలు రైతులకు తీరని నష్టం కలిగిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అధికారులతో అంచనా వేయించి రైతులను ఆదుకోవాలన్నారు. కెవిఎల్ఎన్ ప్రసాద్, మాతంగి ప్రసాద్,రాధాకృష్ణ, బత్తిని రమేష్,బొల్లు నరేష్, నరసింహారావు,నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** కుండపోత వర్షాల నేపథ్యంలో గ్రామాలలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలని కొండమల్లేపల్లి మండల స్పెషల్ ఆఫీసర్ విజయేందర్ రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో వివిధ శాఖ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎడతెరిపి లేని వర్షాల వల్ల మౌలిక వసతులైన మంచి నీరు, విద్యుత్, ఆరోగ్యం, డ్రైనేజిల నిర్వహణలో అధికారులు ఎలాంటి అలసత్వం వహించకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. వివిధ శాఖ అధికారులు అందరు సమన్వయంతో పనిచేసి మండల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఓరాంరెడ్డి, ఎంపిఓ నర్సింహారావు, కొండమల్లేపల్లి ఇఓ డాకు నాయక్, వివిధ శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### కూల్చివేతలకు ముందు

# ఆధారాలు చూడండి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం ఖానాపూర్‌కు చెందిన ఇళ్ల నిర్మాణాల కూల్చివేత నోటీసుల అమలును నిలిపివేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది విద్యాధర్‌రెడ్డి మరొకరు దాఖలు చేసిన కేసులో జస్టిస్ వినోద్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉస్మాన్ సాగర్ పరిధి ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు ఉన్నాయంటూ అధికారులు తమ వాదనలు పట్టించుకోకుండా నేరుగా కూల్చివేత నోటీసులు ఇచ్చారని పిటిషనర్ న్యాయవాది వాదించారు పిటిషనర్ల భూములు ఉస్మాన్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో లేవని 2015లో అప్పటి అధికారులు నిర్ధారణ చేశారని, తాజాగా ఎఫ్‌టీఎల్‌లో ఇళ్లు ఉన్నాయని చెప్పి కూల్చివేత చర్యలు పాక్షికంగా చేపట్టారన్నారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు పైవిధంగా ఉత్తర్వులు ఇచ్చింది. కౌంటర్ వేయాలని, ఉస్మాన్ సాగర్ మ్యాప్‌ను కూడా కౌంటర్‌లో ఉండాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇదే తరహాలో దాఖలైన మరో పిటిషన్‌ను కూడా హైకోర్టు సోమవారం విచారించింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గుట్టల బేగంపేట ప్రాంతంలో దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయని చెప్పి కూల్చివేత నోటీసులు ఇవ్వడాన్ని సవాలు చేసిన పిటిషన్లను చీఫ్ జస్టిస్ అలోక్ అరాథే బెంచ్ విచారించింది. కూల్చివేత నో టీసులను షోకాజ్ నోటీసులుగా సవ రించాలని అధికారులను ఆదేశించింది. షోకాజ్ నోటీసులపై పిటిషనర్లు చూపించే ఆధారాలన్నింటినీ లోతుగా పరిశీలించాక తదుపరి చర్యలు ఉండాలంది. గుట్టబేగంపేటలో 15 ఎకరాల్లోని లేఔట్‌లోని ఇళ్ల నిర్మాణదారులకు వాల్టా చట్టంలోని సెక్షన్ 23 కింద డిప్యూటీ కలెక్టర్ నోటీసులు ఇవ్వడాన్ని తప్పుపడుతూ పిటిషన్లు దాఖలయ్యాయి. చర్యలు చట్ట ప్రకారమే ఉండాలన్న హైకోర్టు వాటిపై విచారణను మూసేస్తున్నట్లు ప్రకటించింది.

### హోటళ్లలో సిసిటివి ఫుటేజీ బ్యాకప్

# 90 రోజులు తప్పనిసరి

### ఉమెన్ సేఫ్టీవింగ్ డిజిపి శిఖాగోయల్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** హోటళ్లలో సిసిటివి ఫుటేజ్ బ్యాకప్ వ్యవధిని 90 రోజులకు తప్పనిసరిగా పెంచాలని రాష్ట్ర ఉమెన్ సేఫ్టీవింగ్ డిజిపి శిఖాగోయల్ హోటల్ యజమానులకు సూచించారు. సోమవారం లక్డికాపూల్‌లోని ఉమెన్ సేఫ్టీ వింగ్ కార్యాలయంలో హోటల్స్ యజమానులతో జరిగిన సమావేశంలో శిఖాగోయల్ మాట్లాడుతూ..ముఖ్యంగా మహిళలు, పిల్లల రక్షణ కల్పించేందుకు హోటళ్లలో భద్రత పాటించాలని కోరారు. భద్రతా ప్రోటోకాల్‌లను మెరుగుపర్చడానికి కావాల్సిన పరిస్థితులను కల్పించుకోవాలన్నారు. హోటల్‌కు బస కోసం వచ్చే వారి ఆధార్ కార్డు వివరాలు తీసుకోవాలన్నారు. గదులలో అత్యవసర ఫోన్ నెంబర్లు డిస్‌ప్లే చేయాలన్నారు. హోటళ్లలో చట్టవిరుద్ధ కార్యకలాపాలపై అనుమానం వస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. హోటల్‌లో సిసిటివి ఫుటేజ్ బ్యాకప్ నిల్వను ప్రస్తుతం 30 నుంచి 60 రోజుల ఉంటుందని, కనీసం 90 రోజులకు పొడిగించాలని హోటల్ యజమానులను ఆదేశించారు. ఈ సమావేశంలో మహిళా సేఫ్టీవింగ్ డిఐజి రెమారాజేశ్వరీ, అదనపు ఎస్‌పి అశోక్‌కుమార్, ఒయో, ట్రీబో,ఫ్యాబ్ తదితర హోటల్ నిర్వాహకులతో పాటు సైబరాబాద్, హైదరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్ల ఉమెన్ సేఫ్టీవింగ్ అధికారులు పాల్గొన్నారు.

## ఉద్యోగులను నాలుగు రెట్లు పెంచడమే లక్ష్యం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అమెరికాలో ఉద్యోగుల ప్రయోజనాలు అందించే క్లారిటీ బెనిఫిట్ సొల్యూషన్స్ హైదరాబాద్‌లో తమ శాఖను ఏర్పాటు చేసింది. ఎన్నోబుల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో ఉన్న సాంకేతిక బృందంతో పూర్తి యాజమాన్యంలో భారతీయ అనుబంధ సంస్థను నెలకొల్పింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో క్లారిటీ బెనిఫిట్ సొల్యూషన్స్ ఫౌండర్ సిఈఓ బిల్ కాటుజీ మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా వేలాది చిన్న, మధ్య తరహా వ్యాపారులకు వినూత్న పరిష్కారాలు అందించడంలో ముందంజలో ఉన్నామన్నారు. భారతదేశంలో ఈ విస్తరణ సంస్థ గ్లోబల్ సామర్థ్యాలను మరింత పెంపొందిస్తూ.. ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందని తెలిపారు. రానున్న 12 నుంచి 18 నెలల్లో ఈ ప్రాంతంలో ఉద్యోగుల సంఖ్యను నాలుగు రెట్లు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఈ విస్తరణ భవిష్యత్ వృద్ధికి, మానవ మూలధనంలో పెట్టుబడి పెట్టడానికి ఉన్న నిబద్ధతకు నిదర్శనమన్నారు.

# హైడ్రా కూల్చివేతలకు.. బ్రేక్!

### సహాయక చర్యల్లో హైడ్రా బృందాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వరుసగా కురుస్తున్న వర్షాలతో హైడ్రా కూల్చివేతలకు బ్రేక్ ఇచ్చింది. ఎన్ కన్వెన్షన్ కూల్చివేత తరువాత హైడ్రా కూల్చివేతలు కొనసాగించింది. ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నగరంలో వర్ష బీభత్సం ఉండటంతో సహాయక పనుల్లో అధికారులు నిమగ్నం అయ్యారు. గ్రేటర్ పరిధిలో మాన్సూన్ సహాయక చర్యల్లో హైడ్రా బృందాలు పాల్గొంటున్నాయి. దీంతో కూల్చివేతలకు హైడ్రా బ్రేక్ ఇచ్చింది. హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్ మాత్రం బిజీగా ఉన్నారు. వర్షం ఉన్న సమయంలో వాటర్ లాగిన్ పాయింట్స్, లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. ఆ ప్రాంతాలు నీట మునిగేందుకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. చెరువుల పక్కన నిర్మించిన కాలనీల్లో పర్యటిస్తున్నారు. నీరు ఉన్నప్పుడే ఆ ప్రాంతాలను సందర్శించి మార్క్ చేసుకుంటున్నారు. తర్వాత నోటీసులు అందజేసే అవకాశం ఉందని తెలిసింది. ఎఫ్‌టిఎల్ పరిధిలో నిర్మాణాలు చేపట్టిన వారికి ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు నోటీసులు అందజేస్తున్నారు. నోటీసులు తీసుకున్న వారు వారం రోజుల్లో ఇళ్లు ఖాళీ చేయాలని అందులో స్పష్టం చేశారు. హెచ్ఎండిఏ పరిధిలో ఇప్పటికే 200కు పైగా అక్రమ నిర్మాణాలు కూల్చివేసినట్టు తెలుస్తోంది. అందులో సిని నటుడు నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ ఉంది. తర్వాత కెటిఆర్ జన్వాడా ఫామ్ హౌస్, అక్బరుద్దీన్ ఓవైసీకి చెందిన ఫాతిమా కాలేజీ ఉన్నాయి. సిఎం రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డికి చెందిన ఇల్లు, కార్యాలయం కూడా హైడ్రా అధికారులు నోటీసులు అందచేసిన విషయం తెల్సిందే. చట్టం ముందు అందరూ సమానమేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేసిన విషయం తెల్సిందే. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత కూల్చివేతల పనిలో హైడ్రా మరోసారి బిజీగా కానున్నట్లు సమాచారం.



**ఎంతటి వారైనా వదలం : రంగనాథ్**

ప్రజాపక్షం /అమీన్ పూర్ : అమీన్ పూర్ మున్సిపాలిటీ పరిధిలోని చెరువులు ,కుంటలు పరిరక్షణే లక్ష్యంగా హైడ్రా ముందుకు సాగుతుంది. ఈ క్రమంలో ఎఫ్‌టి ఎల్ బఫర్ జోన్లల పరిధిలో నిర్మించిన అక్రమ నిర్మాణాలపై అందిన పిర్యాదులను పరగణికి తీసుకొని కూల్చివేస్తోంది .శనివారం నాడు హైడ్రా కమీషనర్ రంగనాథ్ అమీన్ పూర్‌లో విస్తృతంగా పర్యటించారు. దీంతో అక్కడ అక్రమ నిర్మాణాలపై క్షుణ్ణంగా రికార్డులను పరిశీలించారు. అమీన్పూర్ మున్సిపాలిటీలోనిపెద్ద చెరువు, కుంటలను కమీషనర్ రంగనాథ్ తనిఖీ చేశారు. ఎఫ్టీఎల్ బఫర్ జోన్ నాలా కట్టాడాలపై ఆరా తీశారు. నిబంధనలు ఉల్లంఘించి అక్రమంగా నిర్మించిన కట్టడాల వెనుక ఎంతవారు ఉన్నా వదిలిపెట్టే ప్రసక్తి చేదని హెచ్చరించారు. హైడ్రా కమీషనర్ రంగనాథ్ వ్యాఖ్యలతో బడ్డా బిల్డర్లు నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. నోటీసులు అందించిన వెంటనే కూల్చి వేతల చర్యలను ప్రారంభిస్తామన్నారు. చెరువులు ,కుంటలు నాళాల పరిరక్షణకు హైడ్రా పని చేస్తుందన్నారు. అక్రమ నిర్మాణాలు ఎలా జరిగాయో అనుమతులు ఎలా వచ్చాయో సమగ్రంగాఅన్ని విషయాలను బయట పెట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హైడ్రా కమీషనర్ స్పష్టం చేశారు. ఎఫ్‌టీఎల్ టపర్ జోన్లలో అక్రమ నిర్మాణాలు చెరువులు, కుంటలు నాళాల కబ్జాకు గురయ్యాయి.

## గండిపేటను సందర్శించిన జలమండలి ఇ.డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారీ వర్షాల నేపథ్యంలో ఉస్మాన్ సాగర్ జలాశయాన్ని జలమండలి ఈ.డి. మయాంక్ మిట్టల్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఈ.డి. జలాశయం గురించి పలు వివరాలు అడగగా, ఇది వంద సంవత్సరాల చరిత్ర కలిగిన మానవ నిర్మిత కట్టడమని, దీని గేట్లు ఆటోమేషన్‌లో కాకుండా ఇప్పటికీ మ్యాన్యువల్ పద్ధతిలోనే నిర్వహిస్తామని అధికారులు వివరించారు. ఇప్పటి వరకు కురిసిన వర్షాలతో జలాశయంలోకి ఇన్ ఫ్లో వివరాలతో పాటు అక్కడి ప్రస్తుత పరిస్థితులను ఆయన అడిగి తెలుసున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని మయాంక్ మిట్టల్ సంబంధిత అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి కలెక్టర్ శశాంక్‌తో పాటు జలమండలి సిజిఎం రవీందర్ రెడ్డి, జిఎం డేవిడ్ రాజ్, రెవిన్యూ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 13 మంది ఉద్యోగులు పదవీ విరమణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జీవితంలో పదవీవిరమణ అనేది ఒక ముఖ్యమైన ఘట్టమని జలమండలి ఎం.డి. అశోక్ రెడ్డి అన్నారు. జలమండలి పరిధిలో పనిచేస్తున్న ముగ్గురు జనరల్ మేనేజర్లు సహా 10 మంది ఉద్యోగులకు పదవీవిరమణ కార్యక్రమం సోమవారం ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి అశోక్ రెడ్డి, ఈ.డి మయాంక్ మిట్టల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎం.డి. మాట్లాడుతూ జలమండలి లాంటి అత్యవసర సేవల విభాగంలో పనిచేసిన వారికి కుటుంబసభ్యులతో సమయం గడిపే అవకాశం చాలా తక్కువగా ఉంటుందన్నారు. ఉద్యోగ రీత్యా కుటుంబ సభ్యులతో గడపలేని వాళ్లు, రిటైర్మెంట్ తర్వాత ఆ లోటును పూడ్చుకోవచ్చన్నారు. జలమండలి ఈడి మాట్లాడుతూ జలమండలిలో సుదీర్ఘంగా సేవలు అందించి పదవీవిరమణ పొందిన అందరికీ భవిష్యత్తులో మరింత సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం పదవీ విరమణ పొందిన వారిని అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో సిజిఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, జిఎం సరస్వతి పాల్గొన్నారు.

# గోదావరికి మళ్లీ పొంచి ఉన్న ముప్పు

**ప్రజాపక్షం/భద్రాచలం :** గోదావరి నదికి మళ్లీ వరద ముప్పు పొంచి ఉంది. వానా కాలంలో ప్రతీ ఏటా గోదావరి పొంగుతూనే ఉంటుంది. ప్రధానంగా జూలై, ఆగస్టు మాసాల్లో పెద్ద ఎత్తున వరదలు వస్తుంటాయి. భారీ వర్షాలు పడటంతో ఎగువన ఉన్న ప్రాజెక్టులు నిండటంతో క్రిందికి నీటిని విడుదల చేస్తుంటారు. గోదావరి నదిపై ఉన్న ప్రాజెక్టులే కాకుండా తాలిపేరు ప్రాజెక్టు నీరు కూడా పెద్ద ఎత్తున గోదావరి నదిలో కలుస్తుంది. దీంతో భద్రాచలం పరివాహన ప్రాంతం పెద్ద ఎత్తున వరదల భారిన పడుతుంటుంది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోవడమే కాకుండా అనేక మంది ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. గడిచిన రెండు మాసాల్లో గోదావరి నది ఉగ్రరూపం దాల్చడంతో పరివాహక ప్రాంతం అతలాకుతలమైంది. జూన్, జూలై, ఆగస్టు , సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో మొదటి ప్రమాదహెచ్చరికను దాటి గోదావరి నది ప్రవహించింది.



**క్రమంగా పెరుగుతున్న గోదావరి :** భద్రాచలం వద్ద గోదావరి వరద క్రమంగా పెరుగుతోంది. సోమవారం సాయంత్రం భద్రాచలం వద్ద గోదావరి నది 28 అడుగులు దాటి ప్రవహిస్తోంది. ఇది మరింతగా పెరిగే అవకాశం ఉంది. ఎగువన భారీగా వర్షాలు కురుస్తుండటంతో ప్రాజెక్టుల్లోకి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో పాటు తాలిపేరు సామర్థ్యానికి మించి వర్షపు నీరు చేరడంతో గేట్లు ఎత్తిన అధికారులు నీటిని గోదావరిలోనికి విడుదల చేస్తున్నారు. గడిచిన 48 గం.లలో మహారాష్ట్రలోని నాందేడ్, లాతూర్,బీదర్, ఉస్మానాబాద్, పర్భాని, తెలంగాణలోని ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్,

**సెప్టెంబర్‌లో గోదావరి :** సెప్టెంబర్ నెల్లోనూ గోదావరి భయపెట్టింది. ఈ నెల్లో ఏడుసార్లు గోదావరికి వరదలు వచ్చాయి. తొలిసారిగా 1978 సెప్టెంబర్‌లో 54.2 అడుగుల వరద వచ్చింది. ఆ తర్వాత 1994 లో 58.6అ, 1998లో 38.3అ, 2005లో 54.9అ, 2011లో 43.3అ, 2014లో 56.1అ, 2019లో 51.2 అడుగుల వరద వచ్చింది. సెప్టెంబర్ మాసంలోనూ చివరి ప్రమాదహెచ్చరిక 53 అడుగులు దాటి 4 సార్లు, 2వ ప్రమాద హెచ్చరిక 48 అడుగులుదాటి 1సారి, 3వ ప్రమాద హెచ్చరిక 43 అడుగులు దాటి 1 సారి గోదావరి పొంగింది. ఇందిలా ఉండగా 1995 అక్టోబర్‌లో సైతం 57.6 అడుగుల వరద గోదావరి వచ్చింది. దీనిని బట్టి చూస్తే జూన్ నెల మొదలుకుని అక్టోబర్ మాసం వరకు గోదావరి పరివాహక ప్రాంతం వరద ముంపుకు గురయ్యే ప్రమాదం ఉన్నట్లు తెలుస్తోంది.

# కృష్ణాతీరం అల్లకల్లోలం



● మూడు రోజులుగా ముంపులోనే బాధితులు ● ప్రకాశం బ్యారేజీపై రాకపోకల బంద్ ● లంక గ్రామాలకు వరద నీరు ● మున్నేరు వద్ద తగ్గిన వరద ● ముంపు ప్రాంతాల్లో చంద్రబాబు, జగన్ పర్యటన

**అమరావతి:** భారీ వర్షం, వరదల ప్రభావంతో కృష్ణా నదీ తీరం అల్లకల్లోలంగా మారింది. బుడమేరు పరివాహక ప్రాంతాలు అస్తవ్యస్తంగా మారాయి. ఏకకాలంలో అటు కృష్ణానది , బుడమేరు ఉధృతి ఆయా ప్రాంతాల ఇళ్లను నీటముంచెత్తింది. సకాలంలో ప్రభుత్వం యంత్రాంగం చర్యలకు ఉపక్రమించకపోవడంతో మూడు రోజుల నుంచి బాధితులు ముంపులోనే చిక్కుకున్నారు. నదీ పరివాహక గ్రామాలు, లోతట్టు ప్రాంతాలు నీట తేలియాడుతున్నాయి. దాదాపు 4లక్షల మంది ముంపు భారీనపడ్డారు. మున్నేరు వరద నీరు కృష్ణానదికి చేరడంతో ప్రకాశం బ్యారేజీ దగ్గర నీటి ఉధృతి కొనసాగుతోంది. మూడు రోజుల నుంచి బుడమేరు ముంపువాసులు నీటిలో జీవనం సాగిస్తూ బిక్కుబిక్కు మంటున్నారు. బుడమేరు గేట్లను ఎత్తిన విషయం పరిసర ప్రాంతాల నివాసితులకు చేరవేయడంలో లోపం వల్ల ముంపు నష్టం మరింతగా పెరిగింది. బుడమేరు పరివాహక ప్రాంతాలైన విజయవాడలో కొన్ని ప్రాంతాలు ముంపు భారీనపడ్డాయి. అజిత్‌సింగ్‌నగర్, రాజరాజేశ్వరిపేట, భవానీపురం, ఆంధ్రప్రభ కాలనీ తదితర ప్రాంతాలు సోమవారం కూడా నీటి ముంపులోనే ఉన్నాయి. చాలా మంది ఇళ్ల భవనాలపైన, అపార్టుమెంట్లకే పరిమితమై పోయారు. బాధితులను పూర్తిస్థాయిలో సురక్షిత ప్రాంతాలకు తరలించలేదు. రామలింగేశ్వర నగర్, యనమలకుదురు ప్రాంతాల్లోకి కృష్ణా వరద నీరు వచ్చింది. 125ఏళ్ల ప్రకాశం బ్యారేజీ చరిత్రలో రికార్డు స్థాయిలో కృష్ణానదికి వరద కొనసాగుతోంది. ప్రస్తుతం బ్యారేజీ దగ్గర 11లక్షలకుపైగా క్యూసెక్కులకుపైగా ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. వరదల కారణంగా కృష్ణా జిల్లాలో మంగళవారం కూడా విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాల కారణంగా 432 రైళ్లను రద్దు చేశారు. మంత్రులు, అధికారులు ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తూ, సహాయక చర్యలు చేపడుతున్నారు. రాష్ట్రంలో వరదల కారణంగా ఇప్పటివరకు 19 మంది మృతిచెందారు. మరో ఇద్దరు గల్లంతయ్యారు. 20 జిల్లాల్లో భారీగా పంట నష్టం వాటిల్లింది. 3,79,115 ఎకరాల్లో వ్యవసాయ పంట నష్టానికి గురైంది. 34వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. 1067.57 కిలో మీటర్ల మేర రోడ్లు ధ్వంసమయ్యాయి. ఉమ్మడి కష్ణా, గుంటూరు జిల్లాలో వరి పంటకు అపార నష్టం జరిగింది. ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం మున్నేరు వద్ద వరద తగ్గడంతో ఐతవరం వద్ద విజయవాడహైదరాబాద్ రహదారిలో వాహనాల రాకపోకలకు పోలీసులు అనుమతిస్తున్నారు. పోలీసులు దగ్గరుండి వాహనాలను పంపిస్తున్నారు.

**బ్యారేజీ వైపునకు దూచుకొచ్చిన నాలుగు బోట్లు**

ప్రకాశం బ్యారేజీ దగ్గరకు ఎగువ నుంచి నాలుగు పడవులు కొట్టుకురావడంతో, బ్యారేజీ గేట్లు దెబ్బతిన్నాయి. దీంతో ఇంజినీరింగ్ అధికారులు రంగంలోకి దిగి మరమ్మతులకు ప్రయత్నిస్తున్నారు. జలవనరుల శాఖ సలహాదారు కన్నయనాయుడు బ్యారేజి వద్దకు చేరుకుని పరిశీలిస్తున్నారు. 13 లక్షల క్యూసెక్కులకు నీరు చేరితే అంత్యంత ప్రమాదంగా మారుతుంది. బ్యారేజీపై రాకపోకలను నిలిపివేశారు. ఈ నీటి ప్రభావంతో కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో కరకట్టను ఆనుకుని కట్టిన మంతెన సత్యనారాయణ ఆశ్రమంలోకి నీరు చేరింది. ఆ ప్రాంతంలో కరకట్టకు ఉన్న గేట్ వద్ద వరద నీరు లీక్ అవుతోంది. ఆదివారం అర్ధరాత్రి ఆ ప్రాంతం దగ్గర కంకర, ఇనుప షీట్లు వేసి జేసీబీల సాయంతో వరద నీటిని నిలిపేందుకు అధికారులు శ్రమించినా ఫలితం లేదు. మళ్లీ అక్కడి కరకట్టకు వరద నీరు రావడంతో అరికట్టడంలో అధికారులు, సిబ్బంది నిమగ్నమయ్యారు. మంతెన సత్యనారాయణ ఆశ్రమం నుంచి రోగులను తాళ్లు వేసి కిందకు దింపుతున్నారు. తుళ్లూరు మండలం హరిశ్చంద్రపురం, ఆ ప్రాంత పంట పొలాలు, గృహాలు నీట మునిగాయి. ఇక్కడ కూడా కరకట్టకు గండిపడుతుందన్న ఆందోళనతో రైతులు ఇసుక బస్తాలతో అడ్డుకట్ట వేశారు. ప్రకాశం బ్యారేజీ దగ్గర రెండో నంబరు ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. కృష్ణలంక, రామలింగేశ్వరనగర్ ప్రాంత వాసులు ప్రమాదం అంచున ఉన్నారు. కృష్ణానదికి గత ప్రభుత్వ హయాంలో రిటైనింగ్‌వాల్ కట్టడంతో రెండురోజులపాటు కృష్ణలంక పరిసర ప్రాంతాల వాసులు ఊపిరి పీల్చుకున్నారు. బుడమేరు ముంపు ప్రభావిత ప్రాంతాల ప్రజలు చాలా మంది నీటిలోనే కొనసాగుతున్నారు. సహాయక చర్యలపై సీఎం చంద్రబాబు సమీక్షలు, పర్యటనలు కొనసాగుతున్నాయి. సింగ్‌నగర్, కృష్ణలంక ప్రాంతానికి ఆయన అనేకమార్లు వెళ్లి, సహాయక చర్యలపై ఆరా తీశారు. ప్రకాశం బ్యారేజీ వద్ద పడవలు ఢీకొట్టిన ప్రాంతాన్ని అధికారులతో కలిసి సీఎం చంద్రబాబు పరిశీలించారు. గేట్ల మరమ్మతులకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన అధికారులతో మాట్లాడారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ కృష్ణలంక సమీపంలోని రామలింగేశ్వర్‌నగర్, సింగ్‌నగర్ ముంపు ప్రాంతాల్లో పర్యటించారు.

**ప్రమాదం అంచున దివిసీమ, లంక గ్రామాలు**

వరదల అంచులో దివిసీమలోని లంక గ్రామాలున్నాయి. పులిగడ్డలోని అక్విడక్ట్ నీట మునిగింది. బాపట్ల జిల్లా రేపల్లె దగ్గర ప్రమాద స్థితిలో కరకట్టలున్నాయి. కృష్ణానదీ పరవళ్లతో లంక గ్రామాలకు వరద నీరు చేరుతోంది. అటు అమావాస్య కావడంతో అమావాస్య పోటు కారణంగా కృష్ణానదీ తీరాన్ని సముద్రం తీసుకోకపోవడంతో వెనక్కి వస్తోంది. కృష్ణానదీ తీరంలోని 12చోట్ల కరకట్టలు బలహీనంగా ఉన్నట్లు ఇరిగేషన్‌శాఖాధికారులు గుర్తించారు. వాటి పరిరక్షణకు చర్యలకు ఉపక్రమించారు. భారీ వర్షాలు, వరదలతో రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ రంగానికి అపార నష్టం వాటిల్లింది. 4 లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం రాయపూడి పెదలంకలో వరద ప్రవాహానికి 200 పశువులు కొట్టుకుపోయాయి. కృష్ణాజిల్లా తోట్లవల్లూరు మండలంలో ఐలూరు శివారు వద్ద కనిగిరిలంక కృష్ణానది పాయలో ప్రయాణిస్తున్న పడవ బోల్తా పడింది. ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గంలో చెరువులు పొంగి పొర్లుతున్నాయిపొర్లుతున్నాయి.

# ఫోకస్

# ఔత్సాహికులకు మెరుగైన ఆన్‌లైన్ కోర్సు

## యువతరంగం



అగ్రిబిజినెస్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఎఎంఐ) ఆధ్వర్యంలో నిర్వహించే ఆన్‌లైన్ కోర్సులు ఔత్సాహికులకు ఎంతో మెరుగైనవిగా పేర్కోవచ్చు. అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ (ఎంఎఎన్‌ఎజిఇ/ మేనేజ్)లో పిజి డిప్లమోలను పూర్తి చేసుకుంటే, ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటాయని అంటున్నారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఎక్స్టెన్షన్ మేనేజ్మెంట్ ( పిజిడిఎఇఎంఎం), పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ అగ్రివేర్ హౌసింగ్ మేనేజ్‌మెంట్ (పిజిడిఎడబ్ల్యుఎం) కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈనెల 30వ తేదీలోగా ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చు. అంతర్జాతీయ విద్యార్థులకు కూడా ఈ కోర్సులు అందుబాటులో ఉంటాయి. పిజిడిఎఇఎం కోర్సును 2007లో ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి తొమ్మిది బ్యాచ్‌లు ఈ కోర్సును పూర్తి చేశాయి. కేంద్ర, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వాలు, రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాలు (ఎస్‌ఎయులు), కృషి విజ్ఞాన్ కేంద్రాలు (కెవికెలు)లతోపాటు వ్యవసాయ వ్యాపారాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, వ్యవసాయ సంబంధిత రంగాల్లోని వ్సతరణ కార్మికులకు దూరవిద్య ద్వారా ఈ కోర్సును అందిస్తారు. బ్యాంకులు, సహకార సంస్థలకు చెందిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. పిజిడిఎడబ్ల్యుఎం అనేది వ్యవసాయ గిడ్డంగులను సమర్థవంతంగా నర్వహించగల నైపుణ్యాన్ని పెంచుకోవడానికి ఉపయోగపడుతుంది. గిడ్డంగి నిపుణతను అభివృద్ధి చేయడం, ఇన్వెంటరీ, లాజిస్టిక్స్, కొలేటరల్ మేనేజ్‌మెంట్‌లో తాజా పరిజ్ఞానాన్ని అందించే అంశా లు ఈ కోర్సులో ఉంటాయి. ఈ కోర్సులకు ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఉంటుంది.

- పరీక్షా కేంద్రాలు అంటూ ప్రత్యేకంగా ఉండ వు. పరీక్ష కోసం అనుకూలమైన స్థానాన్ని విద్యార్థులే ఎంపిక చేసుకోవచ్చు.
- పరీక్షా సమయంలో 40 నిమిషాలపాటు నిశ్శబ్దంగా ఉండే స్థలాన్ని ఎంపిక చేసుకోవాలి.
- పరీక్ష నిర్ణీత తేదీల్లో ఉదయం 6 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకూ, 24 గంటల పాటు అందుబాటులోనే ఉంటుంది. కాబట్టి, అభ్యర్థులు తమకు నచ్చిన సమయాన్ని ఎంచుకోవచ్చు.
- పరీక్షా సమయంలో ఇంటర్నెట్ కనెక్షన్, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యుత్ సరఫరాకు ఆటంకం లేకుండా ఉండాలంటే, లాప్‌టాప్‌ను ఉపయోగించడం మంచిది.
- పరీక్ష కోసం తాజా గూగుల్ క్రోమ్ (Google Chrome) బ్రౌజర్‌ను ఉపయోగించాలి.
- వైరుధ్యాలను నివారించడానికి అన్నిరకాల ఇతర బ్రౌజర్ విండోలు, తక్షణ సందేశ సాధనాలు, ఇమెయిల్ ప్రగ్రామ్‌లను మూసివేయ డం తప్పనిసరి.
- పరీక్ష సమయంలో బ్రౌజర్లను తగ్గించడం (కనీష్టీకరించడం) కూడదు.
- పరీక్షల షెడ్యూల్ ఇమెయిల్, WhatsApp, ప్రోగ్రామ్ వెబ్‌పేజీ ద్వారా తెలియజేయబడుతుంది.
- పరీక్షా లింక్‌ను ఒకసారి మాత్రమే తెరిచేందుకు వీలు ఉంటుంది. కాబట్టి, ఒకే సిట్టింగ్‌లో పరీక్ష పూర్తి చేయాలి.
- పరీక్షలో 50 బహుళఎంపిక (మల్టిపుల్ ఛాయిస్) ప్రశ్నలు ఉంటాయి. పరీక్షను పూర్తి చేయడానికి 40 నిమిషాల సమయం ఉంది.
- ప్రతి ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. ఉత్తీర్ణత సాధించాలంటే కనీసం 25 మార్కులు సాధించాలి.
- పరీక్ష సమయంలో ఎలాంటి పుస్తకాలను తెరవడానికి వీల్లేదు. అదే విధంగా, ఇతరులను సంప్రదించవద్దు.
- బ్రౌజర్‌లో బ్యాక్ బటన్‌ను ఉపయోగించడం మానుకోవాలి. కొత్త ట్యాబ్ తెరవడం లేదా స్క్రీన్‌ను ప్రింట్ చేయడం వంటి చర్యలను నిషేధించారు. కాబట్టి ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే, వెంటనే పరీక్ష నుంచి వారిని తొలగిస్తారు.
- జవాబు పత్రాలను సేవ్ చేయడానికి వేవ్ (save) బటన్‌ను క్లిక్ చేయాలి. అదే విధంగా జవాబు పత్రాలను సమర్పించేందుకు సబ్మిట్ (submit) బటన్ నొక్కాలి.
- ఒకసారి సబ్మిట్ బటన్ నొక్కిన వెంటనే, సమాధాన పత్రం దానంతట అదే సంబంధిత అధికారులకు లేదా విభాగానికి చేరుతాయి.
- సమాధానం లేని లేదా తప్పు సమాధానాలకు మైనస్ మార్కులు ఉండవు.
- నెట్‌వర్క్ అంతరాయాలు ఏర్పడితే, పరీక్షను ఎక్కడి నుంచి ఆపారో, తిరిగి అక్కడి నుంచే ప్రారంభించవచ్చు.
- అన్ని పరీక్షలు పూర్తయిన తర్వాత సమాధానల 'కీ' విడుదలవుతుంది. అభ్యర్థులు దానిని MANAGE వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

# పోటీ కోసం జైకే

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

- ప్రాచీన ఆర్యులు ఇచట స్థిరపడ్డారు.
  సింధులోయ
- ప్రపంచంలో 'పుట్టగూళ్ళ పెంపకంలో ప్రథమ స్థానంలో ఉన్న దేశం ఏది?
  భారత్
- మహారాష్ట్ర రాజ్య నిర్మాత ఎవరు?
  శివాజీ
- తేయాకు, రబ్బరు, కాఫీ ఏ రేవు ద్వారా ఎక్కువగా ఎగుమతి అవుతుంది?
  కొచ్చిన్ రేవు
- పట్టు పరిశ్రమకు పేర్గాంచిన నగరం
  బెంగళూర్
- 'రోష్ని' పథకం దేనికి సంబంధించినది?
  మైనారిటీలకు సంక్షేమ ఉపాధి పథకాలు అమలు
- పుష్పభాగాలని అంటిపెట్టుకుని ఉండే ఉబ్బిన నిర్మాణం
  పుష్పాసనం
- ఫ్రెంచ్ ప్రజల జాతీయ దినోత్సవం
  జులై 14
- టొమాటోలకు దేనివల్ల రంగు వస్తుంది?
  కెరోటినాయిడ్లు
- గ్లూకోజ్ న్ను, గ్లైకోజిన్గా మార్చే హార్మోను
  ఇన్సులిన్
- వేరుశనగ శాస్త్రీయనామం
  అరాకిస్ హైపొజియా
- అయొడిన్ ఈ క్రింది వానిని కనుగొనడానికి ఉపయోగిస్తారు:
  పిండిపదార్థం
- ప్రపంచంలో అత్యధికంగా పాడి పశువులు కలిగిన దేశం
  భారతదేశం
- రాయపూర్ దేనికి రాజధాని?
  ఛత్తీస్‌గఢ్
- దేశంలోనే అతి పెద్ద ఎత్తిపోతల పథకంగా పేరుపొందిన చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకంను ప్రారంభించిన వారు.
  సోనియాగాంధీ
- భారతదేశంలో 14 బ్యాంకులను జాతీయం చేసిన రోజు?
  1969, జులై 19
- ఇటీవల బంగాళాఖాతంలో సునామీ ఎప్పుడు ఏర్పడింది?
  2004, డిసెంబరు 26
- భారత్ దేశంలో ఎలాంటి న్యాయవ్యవస్థ అమల్లో ఉంది?
  ఏకీకృత స్వతంత్ర న్యాయవ్యవస్థ
- వధువును డబ్బు ఇచ్చి కొనుక్కునే వివాహ పద్ధతి ఏది?
  అసుర
- ప్రపంచ విపత్తుల్లో భూకంపాలు, సునామీల శాతం ఎంత?
  8%
- నాలుక అంచులో ఏ గ్రాహకాలు కలవు?
  పులుపు
- తక్కువ ఖర్చుతో తాగే నీటిని పరిశుభ్రపరిచే పద్ధతి?
  వడపోత
- ఇంటిలో వాడే సిలిండర్లో ఉండే మిశ్రమం.
  పెట్రోలియంవాయువు, కిరోసిన్
- ఇది సైబీరియాలోని ప్రముఖ నగరం.
  ఇర్‌కుటస్క్
- వీరిలో ఎవరు భవన నిర్మాత కాదు?
  ఔరంగజేబు

## యూత్ ఐకాన్స్

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష్టలను ఇనుమడింప చేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..

### నీరజ్ చోప్రా



భారత దేశానికి ఒలింపిక్స్ ట్రాక్ అండ్ ఫీల్డ్ విభాగంలో తొలిసారి స్వర్ణ పతకం సాధించిన ఘనతను నీరజ్ చోప్రా దక్కించుకున్నాడు. 2020 టోక్యో ఒలింపిక్స్, పురుషుల జావెలిన్ త్రోలో చెక్ రిపబ్లిక్ నుంచి ఎదురైన తీవ్రమైన పోటీని తట్టుకొని స్వర్ణ పతకాన్ని అందుకున్నాడు. అతని త్రో 87.58 మీటర్లుకాగా, చెక్ రిపబ్లిక్ త్రోయర్లు జాకుబ్ వాలెచ్ (86.67 మీటర్లు), వితెజస్లావ్ వెసెలీ (85.44 మీటర్లు) వరుసగా రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. కాగా, ఇటీవల ముగిసిన పారిస్ ఒలింపిక్స్‌లో నీజర్ రజత పతకాన్ని గెల్చుకున్నాడు. ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో రెండు పతకాలు సాధించిన తొలి భారత అథ్లెట్‌గా రికార్డు పుటల్లోకి ఎక్కాడు. అతను ఉన్నత శిఖరాలను అధిరోహించడం వెనుక ఎంతో కఠిన పరిశ్రమ ఉంది. పట్టుదల ఉంది. లక్ష్యాన్ని చేరాలన్న తపన ఉంది. కష్టాలకు వెరవని, సమస్యలకు బెదరని గుండె నిబ్బరం ఉంది. ఊబకాయం ఉన్న ఒక పిల్లవాడు, ఆతర్వాత ఉత్తమ అథ్లెట్‌గా ఎదగడం అనేది ఆషామాషి వ్యవహారం కాదు. కానీ, కృషి చేస్తే ఏదీ అసాధ్యం కాదని నీరజ్ నిరూపించాడు.

### తథాగత్ అవతార్ తులసి

ఏదైనా అంశంపై పిహెచ్‌డి చేయడానికి చాలా కష్టపడాలి. లోతైన విషయ పరిజ్ఞానం ఉండి, దానికి విశ్లేషణలను, సమీక్షలను జోడిస్తూ, భవిష్యత్తును ఊహించగల దార్శనికత కూడా అవసరం. అంతటి సంక్లిష్టమైన లక్ష్యాన్ని 22 సంవత్సరాల్లోనే పూర్తి చేసి, ఓ అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపించాడు. కేవలం 12 సంవత్సరాల వయసులో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న అతను, అదే ఒరవడిని కొనసాగించాడు. నిజానికి 22 లేదా 23 ఏళ్ల వయసులో కెరీర్‌కు సంబంధించిన స్పష్టత చాలా మందికి ఉండదు. ఏ రంగంలో ముందుకు సాగాలి? ఏ రంగాన్ని ఎంచుకోవాలి? అనే ప్రశ్నలకు సమాధానాలను వెతుక్కునే పనిలోనే ఎక్కువ మంది ఉంటారు. కానీ,



1987 సెప్టెంబర్ 9న జన్మించిన తథాగత్ 2009లో పిహెచ్‌డి పట్టాను అందుకున్నాడు. 'అజనరలైజేషన్ ఆఫ్ ది క్వాంటం సెర్చ అల్గోరిథం'పై అతను థీసీస్‌ను సమర్పించాడు. టైమ్స్ మ్యాగజన్‌లో 'సూపర్‌టీన్స్' శీర్షికతో వచ్చే కాలమ్‌లో చోటు లభించడమే అతనికి ఘనతకు నిదర్శనం.

### అభిజిత గుప్తా

అప్పుడప్పుడే పదాలు నేర్చుకుంటూ... వాటిని ఉపయోగించడాన్ని అభ్యాసం చేసే వయసులోనే రచనలు చేసిన అభిజిత గుప్తా గురించి ఎంత చెప్పినా తక్కువే. ఈ అసాధారణ ప్రతిభాశాలి కేవలం ఏడు సంవత్సరాల వయసులోనే ఒక పుస్తకాన్ని రాసింది. అది ప్రచురితం కావడంతో, ప్రపంచంలోనే అత్యంత పిన్న వయస్కురాలైన రచయిత్రిగా రికార్డు నెలకొల్పింది. ఆమె పుస్తకం 'హ్యాపీనెస్ ఆల్ అరౌండ్' (ఎక్కడ చూసినా సంతోషమే) అనేది పిల్లలను లక్ష్యంగా చేసుకొని చేసిన రచన. ఆమె తనకు సంతోషాన్నిచ్చిన ప్రతి అంశాన్నీ అందులో అద్భుతంగా పొందుపరచింది. తాను చూసినా సానుకూల విషయాలను ప్రస్తావించింది. చిన్న కథలు, కవితల రూపంలో ఆమె తన మనసును, అనుభవాలను ఆవిష్కరించింది. 10 కంటే ఎక్కువ కాపీలు అమ్ముడయ్యాయంటే, ఈ పుస్తకం పాఠకులను ఎంతగా ఆకట్టుకుందో ఊహించుకోవచ్చు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన చిచ్చరపిడుగు అభిజిత వయసు ఇప్పుడు 11 సంవత్సరాలు.



## కార్మికుల పని ప్రదేశాల పరిశీలన



ప్రజాపక్షం/ శ్రీరాంపూర్ : శ్రీరాంపూర్ ప్రాంతం సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, విధులు నిర్వర్తిస్తున్న పని ప్రదేశాలను గుర్తింపు కార్మిక సంఘం (ఎటియూసి) ఆధ్వర్యంలో ఆర్కే7 గనిలో దిగి నాయకులు పరిశీలించారు. సోమవారం శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా, బ్రాంచ్ ఉపాధ్యాక్షులు కొట్టే కిషన్ రావు, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్యలు యాజమాన్యంతో కలిసి ఆర్కే7లోని 2 ఎఎస్ సౌత్ ప్యానల్‌లో వెంటిలేషన్ సమస్య ఉందని తెలుసుకొని పని స్థలాలను పరిశీలించారు. వెంటిలేషన్‌అందేలాచర్యలుతీసుకోవాలని యాజమాన్యానికి సూచించారు. ఆర్కే7 గని జీవితకాలం పెరగాలంటే సౌత్ సైడ్‌లో అపారమైన బొగ్గు నిక్షేపాలు ఉన్నాయని ఆ బొగ్గును వెలికి తీస్తే దాదాపు 10 నుండి 15 సంవత్సరాలు గని నడుస్తుందని వివరించారు. యాజమాన్యం సౌత్ సైడ్‌లో బొగ్గు వెలికి తీసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్పందించి పని స్థలాలలో వెంటిలేషన్ మెరుగుపడేలా చర్యలు తీసుకుంటామని గని జీవితకాలం పొడిగింపుకు చర్యలు తీసుకుంటామని, గ్రూప్ ఏజెంట్ రాముడు, మేనేజర్ తిరుపతి హామీ ఇచ్చారు.గని ఫిట్ కార్యదర్శి బీర రవీందర్, మైనింగ్ స్టాప్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## కనీస వేతనాలు పెంచాలి




ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : కార్మిక చట్టాల సవరణ ఉపసంహరించుకుని కనీస వేతనాలు పెంచాలని జాతీయ సమితి సభ్యులు ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య అన్నారు. ఎఐటీయుసీ జనరల్ కౌన్సిల్ సమావేశం విశాఖపట్టణంలోని స్టీల్ భవనంలో ఈనెల 1 పేండి 3 వరకు జరుగుతున్న నేపథ్యంలో ఎఐటియుసి జాతీయ సమితి సభ్యులైన ఓమయ్య పాల్గొని జిల్లాకు సంబంధించిన కార్మికుల సమస్యలు, జిల్లాలో ఉపాధి, ఉద్యోగావకాశాలు ప్రధానంగా చక్కెర బీడీ పరిశ్రమ వ్యవసాయ ఆధారిత మార్కెట్ యార్డులు, కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలపై చర్చించటం జరిగింది. కార్మికుల వేతనాలు సవరించడం గానీ లేదా ఆ వ్యవస్థను రద్దు చేసి అందరిని రెగ్యులర్ చేసే ఆలోచన చేయకుండా నిర్లక్ష్యం చేయడానికి తీవ్రంగా తప్పుపట్టారు. ప్రస్తుత ప్రభుత్వం గత ప్రభుత్వ విధానాలకే కొనసాగిస్తుందన్నారు.

## ప్రజానికాన్ని ఆదుకోవాలి



ప్రజాపక్షం/కోదాడః తుఫాన్ కారణంగా నష్టపోయిన ప్రజానీకాన్ని ఆదుకోవాలని సిపిఐజిల్లా కార్యదర్శిబెజవాడ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ముత్యాలమ్మ గుడివీధి,చిలుకూరు మండలం నారాయణపురం చెరువు గండిని పరిశీలించిమాట్లాడారు. ఇండ్లు కూలిపోయాయని, వెంటనే కట్టించాలని కోరారు.పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం ప్రకటించాలన్నారు. వరద బాధిత కుటుంబాలకు సహాయ చర్యలను ముమ్మరం చేయాలన్నారు. పేదల పక్షాన సిపిఐ పార్టీ పోరాడుతుందన్నారు.కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు, లతీఫ్, మండవ వెంకటేశ్వర్లు, శ్రీను, కొండలు తదితరులుపాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన కార్మికుల భద్రతకు డిమాండ్

● 9, 10 తేదీలలో టోకెన్ సమ్మె ● కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలి ● ఎఐటియుసి జనరల్ సెక్రటరి కడారి సునీల్

ప్రజాపక్షం/సుల్తానాబాద్ : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం రూ.26000 ఇవ్వాలని పెద్దపెల్లి జిల్లా ఎఐటియుసి జనరల్ సెక్రెటరీ కడారి సునీల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతేకాకుండా కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కూడ కల్పించాలన్నారు. కడారి సునీల్ మాట్లాడుతూ ఈ నెల 9,10 తేదీలలో జరిగే టోకెన్ సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఒక పక్క బిల్లులు సకాలంలో అందక కార్మికులు అప్పులు చేసి పథకాన్ని నిర్వహిస్తూ అనేక ఆర్థిక, మానసిక క్షోభకు గురౌతున్నారు.కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా పథకం సక్రమంగా నడవలేక పోవడానికి ప్రభుత్వమే కారణమని ,రాష్ట్రంలో పేద బడుగు బలహీన వర్గాల పేద విద్యార్థులకు, పౌష్టికాహారంతో పాటు మంచి భోజనాన్ని అందిస్తున్న కార్మికుల పట్ల ఈ ప్రభుత్వము మంచి ఆలోచనతో గత ములో ఇచ్చిన హామీల మేరకు కార్మికులకు వేతనాలు పెంచాలని అన్నారు.అదే విదంగా పౌష్టికాహారంతో పాటు నిత్యవసర వస్తువులు, గ్యాసును సరఫరా చేయాలాని కార్మికులకు సామాజిక ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని, డ్రెస్ కోడ్ తో పాటు కార్మికులకు ప్రొసీడింగ్ ఆర్డర్స్ ప్రభుత్వమే ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలి అన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. ప్రొసీడింగ్ ఆర్డర్స్ ఇవ్వాలి. ఉద్యోగ భద్రత కల్పించి వంట షెడ్లు, వంట పాత్రలు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని కార్మికులకు పి.యఫ్, ఇ.యస్.ఐ. సామాజిక ప్రమాద భీమ పథకం కల్పించాలి. నిత్యవసర సరుకుల ధరలకు అనుగుణంగా ఒక విద్యార్థికి 25 రూపాల స్లాబ్ రెట్ కార్మికులకు ఇవ్వాలన్నారు. నిత్యవసర వస్తువులు, గ్యాస్, కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేసి 9, 10వ తరగతి విద్యార్థులను లెక్కలోకి తీసుకొని, కార్మికులకు వేతనాలు ఇవ్వాలన్నారు. కార్మికులకు ఐదవతేదీ లోపు తప్పనిసరిగా బిల్లులు చెల్లించాలి తెలిపారు. మధ్యాహ్నం భోజనం వర్కర్స్ యూనియన్ సభ్యులు తోడేటి లావణ్య, కొమరమ్మ, రజిత, స్రవంతి పాల్గొన్నారు.



## కార్మికులకు లాభాల వాటా చెల్లించాలి

ప్రజాపక్షం/శ్రీరాంపూర్ : కంపెనీ గత ఆర్థిక సంవత్సరం సాధించిన లాభాల నుండి 35 శాతం వాటాను కార్మికులకు చెల్లించాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టిబిజికెస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం శ్రీరాంపూర్ ప్రాంతంలోని ఆర్కే7 గని మేనేజర్ తిరుపతికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు గని కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్మికుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని యాజమాన్యాన్ని కోరారు.



బానోతు రాజ్‌నాయక్, బిరుదు శ్రీనివాస్, సిద్దం తిరుపతి, వెంకటేష్, రాజేష్, రాజలింగు, మహేందర్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## బిసిల డిమాండ్లు అంగీకరించాలి



బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు

ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన బీసీ కుల గణనను జరిపి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించి స్థానిక సంస్థలు ఎన్నికలు జరపాలని జరుగుతున్న ఆమరణ నిరాహార దీక్షలకు బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు, రాష్ట్ర సహాయ కార్యదర్శి నేదునూరి రాజమౌళి సంపూర్ణ మద్దతును ప్రకటించి సంఘీభావాన్ని తెలిపారు. వరంగల్ ఎంజీఎం హాస్పిటల్ వద్ద చాపర్తి కుమారస్వామి గాడ్గే ఆమరణ నిరాహార దీక్ష సోమవారంతో తొమ్మిదో రోజుకు చేరింది .ఈ దీక్షకు వెంకట్రాములు,రాజమౌళి సంఘీభావం ప్రకటించి మాట్లాడుతూ కామారెడ్డి లో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు పరచాలని డిమాండ్ చేశారు .బిసి డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా జరుగుతున్న ఆమరణ నిరాహార దీక్షలకు ప్రజాస్వామ్య వాదులంతా మద్దతు తెలపాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చొరవ తీసుకొని డిమాండ్ల అమలుపై స్పష్టమైన హామీ ఇచ్చి నిరాహార దీక్షలు విరమింపచేయించాలని వారు డిమాండ్ చేశారు. లేనిచో రాష్ట్రవ్యాప్తంగా బీసీల ఉద్యమం ఉధృతం అయితే అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. బీసీ నాయకులు ధర్మపురి రామారావు, ఆడెపు నగేష్, బేతి రమేష్, కొడారి రమేష్, కేడల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు .

## సంక్షేమ హాస్టళ్లకు అద్దె భవనాలే దిక్కా?



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిఃసంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు లేక పోవడం వల్ల విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని, అరకొర వసతులతో అద్దె భవనాలతో నెట్టుకొస్తున్న బిసి సంక్షేమ హాస్టళ్లకు పక్కా భవనాలు నిర్మించాలని బిసి సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిసి యువజన సంఘం నగర అధ్యక్షుడు అనుమాస నితిన్ ఆద్వర్యంలో బిసి సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణఃగా విధ్యార్థులు సొంత భవనాలు లేక అద్దె హాస్టల్లో ఇబ్బందులకు గురైన సంధర్బాలు చాలా ఉన్నాయన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ చూపి పక్కా భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం విద్యను పూర్తిగా నిర్లక్ష్యం చేసి ఎమ్మెల్యేలకు, మంత్రులకు, కలెక్టరేట్ల కార్యాలయాలు కట్టారు తప్ప సంక్షేమ హాస్టళ్లను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి సంక్షేమ హాస్టళ్లకు నూతన భవనాలు నిర్మిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం మహిళా జిల్లా అధ్యక్షురాలు గుంటి స్వరూపశ్యాం, జిల్లా ఉపాధ్యక్షుడు నల్లగోని శ్రీనివాస్, నగర అధ్యక్షుడు అనుమాస నితిన్, బిసి సంఘం జిల్లా నాయకులు ఎడ్ల ఉమామహేశ్వర , బిసి సంఘం నాయకులు తదితరులున్నారు.

## ఉత్పత్తి పెంపునకు మరింత కృషి



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : భూపాలపల్లి ఏరియాలో బొగ్గు ఉత్పత్తికి ఉద్యోగులంతా సమిష్టిగా కృషి చేయాలని సింగరేణి జిఎం సయ్యద్ హబీబ్ హుస్సేన్ అన్నారు. సోమవారం భూపాలపల్లి జిఎం కార్యాలయంలో ఆగ స్టు నెల ఉత్పత్తి ఉత్పాదకాలపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భూపాలపల్లి బొగ్గు ఉత్పత్తిలో ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేసే విధంగా ఉద్యోగులు అంకిత భావంతో పనిచేయాలని తెలిపారు. ఆగస్టు నెలలో భూపాలపల్లి ఏరియాలో 2.48 లక్షల టన్నులు కాగా 17,4641 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి 67 శాతం సాధించామని తెలిపారు. రవాణా 261700 లక్ష్యం కాగా 17720 లక్షల టన్నుల రవాణా చేసి 68 శాతం నిలిచిందని పేర్కొన్నారు. ఎస్ డి ఎల్ సి పనిగంటలను పెంచాలని అన్నారు. బొగ్గు ఉత్పత్తి కోసం ప్రత్యేకంగా గైర్హాజరు శాతాన్ని తగ్గించి రక్షణతో కూడిన ఉత్పత్తిని పెంచాలని అన్నారు. కార్మికుల రక్షణ విషయంలో రాజీ పడేది లేదని రక్షణతో కూడిన ఉత్పత్తి లక్ష్యంగా సంస్థ ముందుకు వెళుతుందని పేర్కొన్నారు. కారుణ్య నియామకాలను కాలయాపన చేయకుండా వెంటనే అమలుపరచడం జరుగుతుందని అన్నారు. పదవి విరమణ పొందిన ఉద్యోగులకు సకాలంలో వారికి రావలసిన బెనిఫిట్స్ అందజేయడం జరుగుతుందని అన్నారు. బొగ్గు ఉత్పత్తిలో భూపాలపల్లి ఏరియాను ముం దు వరసలో ఉంచే విధంగా శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ఆయన తెలిపారు.ఏజీఎం ఐ ఈడి సిజె సురేఖ, అధికార ప్రతినిధి కావుల మారుతి, పర్సనల్ మేనేజర్ గుండు రాజు, డిప్యూటీపిఎం శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

## 4న విద్యుత్ సౌధ ముట్టడి



ప్రజాపక్షం/భువనగిరి: ఈ నెల 4వ తేదీన విద్యుత్ సౌదా ముట్టడి, మహాధర్నా నిర్వహిస్తున్నట్లు యాదాద్రి జిల్లా బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బొబ్బిలి మురళి తెలిపారు. సోమవారం భువనగిరిలో సర్కిల్ ఆఫీస్ ఆవరణలో వాల్ పోస్టర్ ఆవిష్కరణ, సన్నాహక సదస్సు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఓసి, బీసీలకు విద్యుత్ సంస్థలో కల్పించిన పదోన్నతులను తెలంగాణ ప్రభుత్వం ఆదేశం, హైకోర్టు డివిజన్ బెంచ్ ఉత్తరువు నుండి నష్టపోయిన బీసీ మరియు ఓసి ఉద్యోగులకు పదోన్నతులను కల్పించాలని చెప్పారు. అదేవిధంగా విద్యుత్ సంస్థలో అన్ని కేడర్లలో నేరుగా నియమింపబడుతున్న ఉద్యోగులను సీనియార్టీ మెరిట్ ఆధారంగా సర్వీస్ రెగ్యులేషన్ 26(ఏ) పార్ట్11 తెలంగాణ స్టేట్ సబ్ ఆర్డినేటర్ రూల్స్ 33(బి),36(ఐ) హైకోర్టు సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు ప్రకటించాలని కోరారు. విద్యుత్ సంస్థలో పనిచేసిన ఆర్టిజన్ కార్మికులకు ఏపీ రూల్స్‌ను వర్తింపజేసి అర్హత ఆధారంగా పదోన్నతులు కల్పించాలని ఐక్య కార్యాచరణ సమితి డిమాండ్స్ పెట్టడం జరుగుతుందని చెప్పారు. సీనియర్ అకౌంట్ ఆఫీసర్ బాలచంద్రుడు, ముఖ్యఅతిథిగా సందేశం ఇవ్వడం జరిగింది. ఓసి నాయకులు భూపాల్ రెడ్డి, బీసీ నాయకులు మహిళా నాయకులు విజయ రెడ్డి, శ్రీదేవి, రవికుమార్, వెంకటేష్, సిద్ధి లింగం, బి.నరసింహ, సబ్ ఇంజనీర్లు మానస, ఉమా, సర్కిల్ ఆఫీస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# మహానగరి

హైదరాబాద్ రంగారెడ్డి

## విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ జె.శ్రీనివాసులు సూచించారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏరియాలో ఉన్న ప్రభుత్వ ఎస్సీ, ఎస్టి, బిసి వసతి గృహాల్లో ప్రభుత్వ మెడికల్ క్యాంపులను నిర్వహించారు. విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని ఎస్టి బాలుర వసతి గృహంలో డాక్టర్ నాగేంద్రబాబు, హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ జె.శ్రీనివాసులు, సిబ్బంది కలిసి 100మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా అందులో నలుగురికి జ్వరం, ఎనిమిది మంది విద్యార్థులకు కోల్డ్ ఉన్నట్లు నిర్ధారించి మందులు ఇచ్చారు.

## శక్తి నగర్ నూతన కార్యవర్గం ఎన్నిక

**ప్రజాపక్షం/వనస్థలిపురం:** వనస్థలిపురం డివిజన్ శక్తినగర్ కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికల్లోఎం శేఖర్‌రెడ్డిపై 30ఓట్లమెజార్టీతో అమ్మగోని అజయ్ యాదవ్ గెలుపొందారు. 14 సంవత్సరాల నుంచి ఎన్నికలు ఓట్ల ద్వారా జరగకపోవడంతో ఆదివారం కాలనీ అసోసియేషన్ ఎన్నికలు అడ్వకేట్ కమిషనర్ బి.గోపాల్‌ఆధ్వర్యంలోనిర్వహించారు. కాలనీ అధ్యక్షులుగా అబ్బగోనిఅజయ్‌యాదవ్,ఉపాధ్యక్షులుగా వంగాల రామ్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి ఎండిఖాదర్, కోశాధికారిగా క్రిష్టయ్య, సంయుక్త కార్యదర్శిగా శ్రీనివాస్‌నెడ్డి, కార్యవర్గ సభ్యులుగా వాకిటి శ్రీనివాస్‌రెడ్డి, పోడిసెట్టి సత్యనారాయణ, మద్ది యాదగిరిరెడ్డి, ఏ.సుధాకర్‌రెడ్డి,మస్నా శ్రీనివాస్‌గెలుపొందారు.

## కోవిడ్ కార్మికులను.. మానవతాదృక్పథంతో ఆదుకోవాలి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కోవిడ్ సమయంలో ఎంటమలాజి విభాగంలో అత్యవసర సేవల కోసం నియమించిన కార్మికులకు మానవతదృక్పథంతో మిగిలిన కార్మికులతో సమానంగా వేతనం ఇవ్వాలని కమిషనర్ అమ్రపాలి కాటను తెలంగాణ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు బాలకృష్ణ విజ్ఞప్తి చేశారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. అనంతరం బాలకృష్ణ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో పెద్ద ఎత్తున పనులు చేపట్టేందుకు సిబ్బంది అవసరమయ్యారని, ఆ సమయంలో ఎంటమలాజి విభాగం ద్వారా సుమారు 200మంది కార్మికులను నియమించారని చెప్పారు. కోవిడ్ మహమ్మరి విజృంభించిన సమయంలో నగర ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఇంట్లోని బయటకు రాకుండా గడిపిన సమయంలో కూడా తమ ప్రాణాలను లెక్క చేయకుండా కోవిడ్ కార్మికులు విస్తృతమైన సేవలు అందించారని తెలిపారు. అప్పటి నుంచి వారు ఎంటమలాజి విభాగంలో విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. కార్మికులు అందే కనీస సౌకర్యాలైన ఈఎస్ఐ, ఈపిఎఫ్ సౌకర్యం అమలు కావడం లేదన్నారు. వారికి కేవలం రూ. 10 వేలు మాత్రమే వేతనాన్ని జిహెచ్‌ఎంసి చెల్లిస్తుందన్నారు. కావున వారికి ఔట్‌సోర్సింగ్ కార్మికులకు మాదిరిగా వేతనాలు పెంచి, చెల్లించాలని కోరారు. ఈఎస్ఐ, ఈపిఎఫ్ అమలు చేయాలన్నారు. కార్మికుల సమస్యల పట్ల కమిషనర్ అమ్రపాలి కాట సానుకూలంగా స్పదించారని, త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామని హామీనిచ్చినట్లు బాలకృష్ణ చెప్పారు.యూనియన్ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజ్, ఔట్‌సోర్సింగ్ ప్రధాన కార్యదర్శి భూషణం, మల్లేష్, నాయకులు నరసింహ, దయాకర్, భాస్కర్, సురేష్ పాల్గొన్నారు.

## పోలీసు ప్రతిష్టను పెంచడంలో వారిదే కీలక పాత్ర : శ్రీనివాస్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:**పోలీసు శాఖ ప్రతిష్టను పెంచడంలో సబ్ ఇన్‌స్పెక్టర్ల పాత్ర కీలకంగా ఉంటుందని హైదరాబాద్ పోలీసు కమిషన్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం బంజారాహిల్స్‌లోని కమాన్ అండ్ కంట్రోల్ సెంటర్ ఆడిటోరియంలో జరిగిన ఎస్ఐల సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 19న హైదరాబాద్ నగరంలో రాబోయే గణేష్ ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఒకే సారి రావడంతో బందోబస్తుపై మరింత శ్రద్ధ కనబర్చాలని కమిషనర్ ఎస్ఐలకు సూచించారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల నీతినిజాయితీతో పాటు మర్యాదగా ప్రవర్తించి వారి మన్ననలు పొందే విధంగా నడుచుకోవాలన్నారు. సమయపాలన కూడా పాటించాలన్నారు. ప్రస్తుతం ఎస్ఐ హోదాలో పనిచేస్తున్న వీరంతాఎస్‌పి హోదా వరకు ఎదుగుతారని, వారికి సుదీర్ఘ భవిష్యత్తు ఉందని, వీరిలో కొందరు ఐపిఎస్ ర్యాంక్ వరకు వెళ్తారని ఆశాభావం వ్యక్త పరిచారు. నేరాల నివారణ, నిందితుల గుర్తింపు, బందోబస్తు విధులు, వివిఐపి సందర్భనలు, స్టేషన్‌హౌస్ దినచర్య అమలు వంటి అన్ని రంగాల పోలీసింగ్ ప్రాముఖ్యత ఇవ్వడం ద్వారా పోలీసింగ్ మెరుగుపడుతుందన్నారు. అదనపు పోలీసు కమిషనర్ విక్రమ్ సింగ్‌మాన్, ట్రాఫిక్ అదనపు పోలీసు కమిషనర్ పి.విశ్వప్రసాద్, జాయింట్ పోలీసు కమిషనర్ డాక్టర్ గజరావు భూపాల్, డిసిపి శిల్పవల్లి, ఎస్‌బి డిసిపి ఎస్.చైతన్యకుమార్‌తో పాటు శాంతిభద్రతలు, ట్రాఫిక్ విభాగాలుకు చెం దిన 300 మంది ఎస్ఐలు పాల్గొన్నారు.

**ఊరేగింపుకు అనుమతి ఇవ్వండి**

మిలాద్‌ఉన్‌నబీఊరేగింపునిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని ముస్లిం మత పెద్దలు పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డితో సమావేశమయ్యారు.గణేష్ నిమ్మజనం, మిలాద్ ఉన్ నబీ ఊరేగింపులు ఒకే రోజు రావడంతో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు కమిషనర్ తెలిపారు.

## కాంగ్రెస్‌తోనే సమస్యలు పరిష్కారం



**ప్రజాపక్షం/వనస్థలిపురం:** వనస్థలిపురం డివిజన్లోని నాగార్జున కాలనీ, క్రిష్టయల్ కాలనీ, వెంకటరమణ కాలనీ, అభ్యుదయ కాలనీ, ప్రశాంత్ నగర్ కాలనీ, జనప్రియ హోమ్స్ కాలనీ వరద ముంప్పుకు గురైయ్యేదని, గత మూడు సంవత్సరాల నుంచి పోరాటం చేస్తున్న సమస్యకు పరిష్కారం కాలేక పోయిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో రాగానే నిధులు మంజూరుతో కాలనీలపై వరదకు శాశ్వత పరిష్కారం దొరికిందని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం వనస్థలిపురంలోని క్రిష్టయల్ కాలనీలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 1.90 లక్షల నిధులు ద్వారా అండర్ గ్రౌండ్ నాలా పనులు పూర్తి కావడంతో ఎప్పుడు కాలనీలపై వరద ప్రభావంతో కాలనీల్లో నీరు చేరేదని, గత రెండు రోజుల నుంచి వర్షం బారీగా వస్తున్న ఒక చూక్క నీరు నిల్వ లేకపోవడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తురన్నారు. నాగార్జున కాలనీ అధ్యక్షులు మోహన్‌రెడ్డి, క్రిష్టయల్ కాలనీ అధ్యక్షులు హరేందర్‌రెడ్డి, అభ్యుదయ కాలనీ అధ్యక్షులు గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ ఒక్కరికీ రుణమాఫీ అందాలి

**ప్రజాపక్షం/షాబాద్ :** రుణం మాఫీ అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు గడిగే గజేందర్ గౌడ్ పేర్కొన్నారు. సోమవారం షాబాద్ మండల వ్యవసాయ శాఖ రైతు వేదిక కార్యాయలంలో కిసాన్ సంఘ్ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. షాబాద్ తహశీల్దార్ కార్యాలయంలో ధరణి సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు విఫలం అయ్యారని చెప్పారు. ఈ నెల 10న జిల్లా రైతు దినోత్సవం కార్యక్రమాన్ని తుక్కుగూడ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కిషాన్ సంఘం మండల అధ్యక్షుడు దండు యాదవ రెడ్డి, జిల్ల కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ రెడ్డి, సహాయ కార్యదర్శి చంద్రయ్య, పోలారం కిసాన్ సంఘం గ్రామ కమిటి అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, వివిధ గ్రామాల సంఘం సభ్యులు సత్యం, పాండు గుప్త, మల్లేష్, రామస్వామి గౌడ్, భీమయ్య పాల్గొన్నారు.

# సమన్వయంతో శ్రమిస్తున్నారు

## 141 ప్రాంతాల్లో 242 ఎమర్జెన్సీ టీములు నిరంతర పర్యవేక్షణ

నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



**ప్రజాపక్షం/హైదరాబాద్:**గతమూడు రోజులుగా నగరంలో కురుస్తున్న వర్షాలతో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని శాఖల సమన్వయంతో జిహెచ్‌ఎంసి యంత్రాంగం మొత్తం క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తూ, అన్ని చర్యలు తీసుకుంటుందని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలోని కంట్రోల్‌రూమ్‌ను సోమవారం మేయర్ ఆకస్మికంగా సందర్శించి, ఓఎస్‌డి అనురాధతో ఇప్పటివరకు నగరంలో పడిన వర్షపాతం, అత్యధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలు, వచ్చిన ఫిర్యాదులు, పరిష్కరించినవి,హుస్సేన్‌సాగర్,హిమాయత్ సాగర్,ఉస్మాన్‌సాగర్‌ల నీటి మట్టాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మేయర్ మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ ప్రకటించిన నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జిహెచ్‌ఎంసి కమిషనర్‌తో సహా అన్ని స్థాయి ల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అవసరమైన చర్యలు చేపట్టారన్నారు. స్టాటిస్టిక్స్ ఎమర్జెన్సీ టీమ్‌లు, డిఆర్‌ఎఫ్ టీమ్‌లు సంయుక్తంగా పనిచేస్తున్నాయన్నారు. 141 ప్రాంతాలలో 242 ఎమర్జెన్సీ టీమ్స్,157 మొబైల్ టీమ్స్, 30 డిఆర్‌ఎఫ్ బృందాలు పనిచేస్తున్నాయన్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ 7 ఎమర్జెన్సీ టీమ్‌లు, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లకు నాలుగు చొప్పున అదనపు ఎమర్జెన్సీ టీమ్‌లను కేటాయించామన్నారు. జిహెచ్‌ఎంసి కంట్రోల్‌రూమ్‌లో 12 మంది బృందం, డిఆర్‌ఎఫ్ కంట్రోల్‌రూమ్‌లో 10 మంది బృందం 24/7 గంటలు పనిచేస్తున్నారన్నారు.

**9 సెంటీమీటర్ల వర్షపాతం**

జిల్లాలో అత్యధిక వర్షపాతం 9 సెంటీమీటర్లు కురిసిందని, వర్షంతో వాటర్ స్టాగ్నేషన్ కన్నా ఎక్కువగా చెట్లు పడిపోయాయని, వాటిని తొలగించామన్నారు.కంట్రోల్ రూమ్‌కు సోమవారం ఉదయం వరకు నీరు నిలిచిన 141 ఫిర్యాదులు రాగా 140 క్లియర్ చేశారని, మరొకటి చేస్తున్నారన్నారు. చెట్లు పడిపోయిన సంఘటనలకు సంబంధించి140ఫిర్యాదులుఅందగా,137తొలగించడం జరిగిందన్నారు. 596 శిథిలావస్థలో గల భవనాలను గుర్తించామని,344పై చర్యలు తీసుకున్నామన్నారు. 129 ఖాళీ చేయించామని, నాలుగింటికి సీల్ వేయడం జరిగిందన్నారు.చీఫ్ సిటీప్లానర్ కె.శ్రీనివాస్,అదనపుకమిషనర్(యుబిడి) సునంద,కంట్రోల్‌రూమ్‌ఓఎస్‌డి అనురాధ పాల్గొన్నారు.

## డిఇఒ కార్యాలయంలో ఘనంగా బోనాలు



**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** బోనాలు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలుస్తాయని టిఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ ప్రెసిడెంట్ ఎం.జగదీశ్వర్ అన్నారు. టిఎన్జీవోస్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యాన సోమవారం బషీర్‌బాగ్‌లోని డిఇఒ కార్యాలయంలో బోనాల పండుగనునిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథులుగా జగదీశ్వర్‌తోపాటు టిఎన్‌జిఒ సెంట్రల్ యూనియన్ ప్రధానకార్యదర్శి డా. ఎస్ ఎం హుస్సేనీ, టిజిఒ అధ్యక్షులు శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి సత్యనారాయణదుర్గా మాతకు ప్రత్యేక పూజలు చేశారు. డిఇఒ రోహిణి, టిఎన్‌జిఒ అసోసియేట్ ప్రెసిడెంట్ వెంకట్, ఉపాధ్యక్షులు కొండల్‌రెడ్డి, హైదరాబాద్ అధ్యక్షుడు వెంకటేశ్, టిఎన్జీవోస్ స్కూల్ ఎడ్యుకేషన్ విభాగ హైదరాబాద్ అధ్యక్షుడు కెఆర్ రాజ్‌కుమార్, సెక్రటరీ ఎం భాస్కర్, అసోసియేట్ ప్రెసిడెంట్ వి డేవిడ్, కోశాధికారి ప్రేమ్‌కుమార్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## సకాలంలో ‘ప్రజావాణి’ ఫిర్యాదులు పరిష్కారం



గ్రేటర్ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని గ్రేటర్ హైదరాబాద్ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుండి డిప్యూటీ మేయర్ జిహెచ్‌ఎంసి ఉన్నతాధికారులతో కలిసి విజ్ఞప్తులను స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ ఆయా అధికారులకు సమస్య పరిష్కారానికి సూచనలు చేశారు. ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా నాలుగు విన్నపాలు రాగా సంబంధిత అధికారులకు పరిష్కారానికై పంపించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ఆయా విభాగాల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, ఎప్పటి కప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఎలాంటి జాప్యం లేకుండా సమస్యను పరిష్కరించి, సంబంధిత అర్జీదారులకు తెలిపాలన్నారు. పరిష్కారం కానట్లయితే అందుకు గల కారణాలు లిఖిత పూర్వకంగా చెప్పలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు నళిని పద్మావతి, సత్యనారాయణ, రఘు ప్రసాద్, చంద్రకాంత్ రెడ్డి, అదనపు చీఫ్ సిటీప్లానర్ గంగాధర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ ఆశయసాధనకు కృషి



**ప్రజాపక్షం/కేశంపేట:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయసాధనకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం కృషి చేస్తుందని షాద్‌నగర్ ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. కేశంపేట మండల కేంద్రంలో సోమవారం వైఎస్ఆర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి ఎంఎల్‌ఎ, మాజీ ఎంఎల్‌ఎ ప్రతాప్‌రెడ్డి నివాళులర్పించారు. ఎంఎల్‌ఎ మాట్లాడుతూ డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రాష్ట్రంలోని నిరుపేదల సంక్షేమానికి కృషి చేశారని, సీఎం రేవంత్‌రెడ్డి కూడా రైతులు, నిరుపేదల సంక్షేమానికి కట్టుబడి ఉన్నారని తెలిపారు. కురిసిన వర్షాలకు ఇండ్లు కూలి నష్టపోయిన భాధితులకు ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్ ఆర్థిక సహాయం అందజేశారు. మండలంలో వర్షాలకు పలు గ్రామాల్లో సుమారు 10మంది నిరుపేదల ఇండ్లు కూలిపోయాయి. ఎంఎల్‌ఎ భాధితుల ఇండ్లను పరిశీలించి వారికి ఒక్కొక్కరికి 10 వేల ఆర్థిక సహాయంతో పాటు బియ్యం, వంట సరుకులను అందజేశారు. అధేవిధంగా లేమామిడిలోని శివాలయంలో దేవున్ని దర్శించుకున్నారు. నిర్దవెల్లిలో ప్రధానరోడ్డుపై కల్వర్టు నిర్మాణానికి భూమిపూజ చేశారు. కేశంపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు తలసాని పవన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.షాద్‌నగర్ మాజీ మున్సిపల్ చైర్మెన్ విశ్వం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గూడ వీరేష్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అనసూయమ్మ, యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, నాయకులు తాండ్ర శ్రావణ్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, గిరియాదవ్, శ్రీధర్‌రెడ్డి, తుమ్మల గోపాల్ ముదిరాజ్, అన్మగళ్ల రమేష్, తైద పర్వతాలు, రావుల పెంటయ్య, కోదూరి రాములు, విజయరెడ్డి పాల్గొన్నారు.

**షాద్‌నగర్:** ప్రజా సంక్షేమానికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి నిలువెత్తు రూపమని శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా షాద్‌నగర్ ముఖ్యకూడలిలో విగ్రహానికి నివాళ్ళు అర్పించారు. మాజీ శాసన సభ్యులు చౌలపల్లి ప్రతాప్‌రెడ్డితో కలిసి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ మైనార్టీ నేత మహ్మద్ ఇబ్రహీం మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం చివరి శ్వాస వరకు పోరాడిన మహానీయుడి సేవలు చరిత్ర ఉన్నంత వరకు మరచిపోలేరని అన్నారు.

# సురక్షిత ప్రాంతాలకు ప్రజలు తరలింపు

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** ఉస్మాన్‌నగర్ లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు చేపట్టాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక సంబంధిత అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ శశాంక ఉస్మాన్‌నగర్‌లోని లోతట్టు ప్రాంతాలని సందర్శించారు.కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ ఉస్మాన్‌నగర్‌లో లోతట్టు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలను తక్షణమే అక్కడి నుండి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని,మంచి నీటి వనరులైన ట్యాంకులు కలుషితం కాకుండా తగు చర్యలు తీసుకోవడంతో పాటు,వారికి ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా మెడికల్ క్యాంపును నిర్వహించి అంటూ వ్యాధులు ప్రబల కుండా బ్లీచింగ్ పౌడర్, క్లోరినేషన్ లను చేపట్టాలని తెలిపారు. వైద్య బృందాలు అప్రమత్తమై,ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మందులను సిద్ధంగా ఉంచాలని వైద్యధికారికి ఆదేశించారు.అనంతరం బాలాపూర్ గణేషుని ఊరేగింపు జరిగే మార్గాన్ని, అందు కోసం చేపడుతున్న ఏర్పాట్లను పర్యవేక్షించి అక్కడ జరిగే సిసి రోడ్డు పనులను పరిశీలించారు. పనులను 2 నుండి 3 రోజుల్లోగా పూర్తి చేసి వీధి దీపాలను ఏర్పాటు చేయుటకు,శానిటేషన్ నిర్వహించాలని సూచించారు. రాజేంద్రనగర్ ఆర్ డిఒ వెంకటరెడ్డి, మహేశ్వరం ఎసిపి లక్ష్మీకాంత్ రెడ్డి,గండిపేట తాసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి,మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్,జల్ పల్లి మున్సిపల్ కమిషనర్ వాణిరెడ్డి, డిఈ దివ్య జ్యోతి, కౌన్సిలర్లు పద్మారావు, శ్రీకాంత్ స్వామి, నవీన్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఇరిగేషన్ ఎఇ, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల తప్పిదాలపై చర్యలకు హైడ్రా



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** సహజ నీటి వనరులు వచ్చే కాలువలకు అడ్డంగా ప్రహరీ గోడ నిర్మించడం..చెరువు నీరు బయట వెళ్ళకుండా అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని షాద్‌నగర్ మాజీ శాసనసభ్యులు,టిడిపిపోలీస్‌బ్యూరో సభ్యులు బక్కని నర్సింలు ప్రశ్నించారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామ సమీపంలో ఉన్న వీరమోని చెరువు నీటి ప్రవాహానికి అడ్డంగా కట్టిన ప్రహరీ గోడను పరిశీలించారు.బక్కని నర్సింలు మాట్లాడుతూ ఏళ్ల చరిత్ర కలిగిన వీరమోని చెరువు నీటి ప్రవాహానికి అడ్డంగా నరసింహామూర్తి అనే వ్యక్తి ప్రహరీ గోడ నిర్మిస్తే ఇరిగేషన్, ఆర్ అండ్ బి అధికారులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహించడంతోనే కొంతమంది అక్రమార్కులు పాటు కాలువలను కనుమరుగు లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల తప్పిదాలకు బయటకు తీసేందుకే హైడ్రా రావడం ఎంతో అభినంధనీయమని, షాద్‌నగర్‌కు హైడ్రాను విస్తరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో అనేక మార్లు గ్రామ పంచాయతీకి ఫిర్యాదు చేసినప్పటికి, వారు నోటీసులు ఇచ్చిన ఫిలితం లేకుండా పోయిందని వివరించారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే తిరిగి గ్రామస్తులపైనే కేసులు చేయించిన సంఘటనలు ఉన్నాయని గుర్తు చేశారు. ఈ భూమి పక్కనే నీరు పారడం కోసం కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి ఆర్ ఆండ్ బి అధికారులు కల్వర్లు నిర్మించారని, వాటిని తుంగలో తొక్కి సహజ నీటి వనరులు దుర్వినియోగం చేసే విధంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించడంలో అధికారులు విఫలం కావడంతోనే హైడ్రా ముందుకు రావడం..అక్రమార్కుల భరతం పట్టడం మంచి పరిణామమేనని పేర్కొన్నారు. హైడ్రాను హైదారాబాద్‌కే కాకుండా షాద్‌నగర్ వరకు విస్తరిస్తే సహజ వనరులను ఎవరు నాశనం చేయలేరని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి భీష్వ రామకృష్ణ, కౌన్సిలర్ బచ్చలి నర్సింలు ఉన్నారు.

# బైక్ దొంగలు అరెస్టు



**ప్రజాపక్షం/మియాపూర్ :** మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధీలో బైక్‌లు దొంగతనం చేస్తున్న 4 (నలుగురు) దొంగలను అరెస్ట్ చేయగా ఒకరు పరారీలో ఉన్న సంఘటన చోటు చేసుకుంది. మాదాపూర్ డిసిపి వినీత్ కుమార్, అడిషినల్ డిసిపి జయారామ్, మియాపూర్‌ఎసిపి నర్సింహరావు, మియా పూర్ ఇన్స్‌పెక్టర్ దుర్గ రామలింగప్రసాద్‌లు తెలిపిన వివరాల ప్రకారం నలుగురు దొంగలు మియాపూర్‌లోని హాఫిజ్‌పేట్‌లోనివసించే1. షేక్ అబ్బు తాలీబ్, తండ్రి షేక్ అబిబ్ (21) 2. అబ్దుల్ రియాజ్ తండ్రి అబ్దుల్ వాహిబ్ (20), అదిత్యనగర్,హాఫిజ్‌పేట్, 3.రాత్‌లవంత్ మహేష్ తండ్రి లేట్ భాస్కర్ (19) ప్రెమ్‌నగర్,హాఫిజ్‌పేట్, 4. సూర్యవంశీ జావా తండ్రి రమేష్ (19) ప్రెమ్‌నగర్, హాఫిజ్‌పేట్ మోటర్ బైక్‌లు దొంగతనం చేస్తూ జల్సాలకు అలవాటు పడ్డారు. నలుగురు నిందితులు కలసి గచ్చిబౌలి, మియాపూర్, మాదాపూర్, చందానగర్, చార్మినార్, రాయదుర్గం ప్రాంతాలలో 16 బైక్‌లు, 12 సెల్ ఫోన్లను దొంగతనాలు చేశారని మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో వచ్చిన కంప్లైంట్ అధారంగా ఏంతో చాకచక్యంగా నిందితులను అరెస్ట్ చేశామని ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దార్యప్తు చేస్తున్నామని తెలిపారు. ప్రజలు తమ వాహనాల పట్ల అప్రమతతో ఉండాలని మియాపూర్ మేట్రో స్టేషన్‌లో తమ మోటర్ సేకిల్స్‌లకు డబల్ తాళాలు వేసుకోవాలని, అంతేకాకుండా కాలనీలలో ఉండే ప్రజలు తమ వాహనాలను కాంపౌండ్‌వాల్ లోపల పెట్టుకొని గేటుకు తాళాలు వేసుకోవాలని సూచించారు. మియాపూర్ డిఐ అక్రమ్‌బాబా, ఎస్ఐ మాల్సర్, తదితరులు పాల్గొన్నారు.

# ముసురువానతో జనజీవనం అస్తవ్యస్తం



**ప్రజాపక్షం/వనస్థలిపురం:** గత మూడు రోజుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక వైపు ముసురు వేయడంతో ఎక్కడ వెళ్లాలన్న ప్రజలు నరయాతన పుడుతున్నారు. కొన్ని కాలనీల్లో లొతట్టు ప్రాంతా కాలనీల్లో వర్షాపు నీరు చేరడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదురుకుంటున్నారు. ఒక వైపు రాష్ట్ర ప్రభుత్వంప్రైవేటు,ప్రభుత్వ పాఠశాలకు శెలవు ప్రకటించడంతో స్కూల్ మూతపడ్డాయి. ప్రభుత్వ అధికారులను వరద ప్రభావం ఉన్న ప్రాంతాల్లో సహాయక చర్యల్లో పాల్గొని ప్రజలకు అండగా నిలువాలని కోరింది. ప్రజలకు ప్రాణహాని, ఆస్తీ నష్టం జరిగే అవకాశాలు ఉంటే జిహెచ్‌ఎంసి కంట్రోల్ రూంకు సంప్రదించాలని సూచించింది. వానలు తగ్గకపోవడంతోప్రజలుఇంటినుంచి బయటకు రాకుండా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

**హయత్‌నగర్ జిహెచ్‌ఎంసి సర్కిల్ పరిధిలో సహాయక చర్యలు**

ప్రజలకు ప్రాణహాని జరగకుండా ప్రభుత్వం సహాయక చర్యలు చేపడుతుందని హయత్ నగర్ సర్కిల్ డిప్యూటి కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య అన్నారు. హయత్ నగర్ సర్కిల్ పరిధిలోని హయత్ నగర్, మన్సూరాబాద్, బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్, నాగోల్ ప్రాంతాల్లో లోతట్టు ఉన్న కాలనీల్లో జిహెచ్‌ఎంసి సిబ్బంది సహాయక చర్యల్లో ముమ్మరగా పాల్గొంటుందని ఆయప తెలిపారు. డ్రైనేజీ, నాలాల నుంచి వరద ప్రభావం నీరు మరింతగా వస్తుండడంతో ప్రజలు చాలా జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాలైనటువంటి నేషనల్ హైవే రోడ్డులో సితార హోటల్ దగ్గర, రెయిన్బో హాస్పిటల్ దగ్గర, నాగోల్ లక్కీ హోటల్ దగ్గర, నాగోల్ చెరువు నుండి మూసీనదిలో కలిసే మార్గంలో నీరు నిల్వకుండా చూడడానికి మాన్సూన్ ఎమర్జెన్సీ టీములను అప్రమత్తము చేయడం జరిగిందని డిప్యూటీ కమిషనర్ యాదయ్య అన్నారు. ఎక్కడైతే చెత్త ఎక్కువగా నిలువ ఉంటుందో అక్కడ వెనువెంటనే లిఫ్ట్ చేయాలని డిప్యూటీ ఇంజనీర్ ఎస్‌డబ్ల్యుఎం రాంకీ ట్రాన్స్‌పోర్ట్ వారిని ఆదేశించారు. సూపర్టెంట్ ఇంజనీర్ వి. అశోక్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్ బాబు, ఏఈ రాకేష్ నాయక్ ఉన్నారు.

**హయత్‌నగర్‌లో జాతీయ రహదారిని పరిశీలించిన ఎస్ఇ ధర్మారెడ్డి**

గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు విజయవాడ జాతీయ రహదారిని జాతీయ రహదారుల రాష్ట్ర ఇంచార్జ్ ఎస్ఈ ధర్మారెడ్డి, కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. హయత్ నగర్ జాతీయ రహదారిపై ఉన్న పుల్లారెడ్డి స్వీట్ హౌస్, సాయి బాబా దేవాలయం వద్ద జరుగుతున్న పనులను సందర్శించారు.వర్షాపునీరు ద్వారా రోడ్డు ఎలాంటి కోతలకు గురికాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తేనే భవిష్యత్‌లో రోడ్డు ధ్వసంకాకుండా ఉంటుందన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



ప్రజాపక్షం/నాగారం: పేదలకు సిఎంఆర్ఎఫ్ పథకం ఆర్థికంగా ఎంతగానో దోహదపడుతుందని ఎంఎల్ఎ చామకూర మల్లారెడ్డి అన్నారు. సోమావారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు బ్రహ్మయ్య కాలనీలో నివాసముంటున్న కుందనపల్లి మాధవికృష్ణకు రూ.25,500 ల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎంఎల్ఎ మల్లారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో గూడురు అంజనేయులుగౌడ్, మధుగౌడ్, రాధాకృష్ణ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# మహానగరి

మేడ్చల్ మల్కాజ్‌గిరి | వికారాబాద్

## బహిరంగా ప్రదేశాల్లో చెత్తను వేయొద్దు

ప్రజాపక్షం/నాగారం: చెత్తను బహిరంగా ప్రదేశాలలో వేయరాదని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. సోమవారం నాగారం మున్సి పాలిటీ కార్యాలయంలో తెలంగాణ సాంస్కృతిక కళాబృందం ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత గూర్చి పాటల రూపంలో అవగాహన కల్పిం చారు. చెత్తను ఆటోలలో వేయాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్,మేనేజర్, తెలంగాణ సాంస్కృతిక బృందం సభ్యులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ పునరుద్ధరణ పనుల పరిశీలన



ప్రజాపక్షం/అల్వాల్: అల్వాల్ డివిజన్ లోతుకుంట కుమ్మరి బస్తిలో విద్యుత్ జిహెచ్ఎంసి అధికారులతో కలిసి విద్యుత్ పునరుద్ధరణ పనులను కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షించారు. అనంతరం బిహెచ్ఇయల్ రామ్‌నగర్ ప్రశాంత్‌నగర్‌లో ఇటీవల వర్షాలకు నేలకొరిగిన చెట్ల నరికివేత పనులను పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లా డుతూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.ఈకార్యక్రమంలో అధికారులు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## టిజిఐఐసి చైర్మన్‌ను కలసిన ఎంఎల్ఎ



ప్రజాపక్షం/చర్లపల్లి : ఇండస్ట్రీయల్‌లో ఉన్న సమస్యలు పరిష్కరిస్తానని టిజిఐఐసి కార్పొరేషన్ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి అన్నారు.సోమవారం ఉప్పల్ ఎంఎల్ఎ బండారి లక్ష్మారెడ్డి నిర్మలా జగ్గారెడ్డిని మర్యాద పూర్వకంగా కలసి ఉప్పల్ నియోజకవర్గంలోని చర్లపల్లి, ఉప్పల్, నాచారం, మల్లాపూర్, కుషాయిగూడ ఇండస్ట్రీయల్‌లోని నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. అన్ని పారిశ్రామికవాడలను పర్యటించి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారని ఎంఎల్ఎ తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, నాయకులు సాయిజెన్‌శేఖర్,మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్



ప్రజాపక్షం/వికారాబాద్‌ప్రతినిధి : వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి వివిధ ప్రాంతలనుండి వచ్చిన ప్రజల నుండి 71 దరఖాస్తులను స్వీకరించినట్లు అని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చిన దరఖా స్తులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను అదేశించారు. సోమవారం సుమారుగా 71 దరఖాస్తులు రాగా భూ సమస్యలపై 59, పింఛన్లుకు సంబంధించి 2 ఇతర 10 వచ్చాయని కలెక్టర్ తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు ఆర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ , ఆర్‌డిఒ వాసుచంద్ర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్య పరిష్కరించిన చైర్‌పర్సన్



ప్రజాపక్షం/ఘట్కేసర్ : రెండు రోజుల నుండి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం పడటంతో కుమ్మరిబస్తీలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో ఆ బస్తీలో విద్యుత్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో సమస్యను చైర్‌పర్సన్‌కు తెలుపగావెంటనే నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ మాట్లాడుతూ గత రెండు రోజుల నుండి భారీ వర్షం ఈదురుగాలి రావడంతో కుమ్మరి బస్తీలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి ప్రజలకు త్రీవ అంతరాయం కలిగింది. వెంటనే స్థానిక ప్రజలు పడుతున్న ఇబ్బంది తెలుసుకుని వెంటనే విద్యుత్ ఏ ఈ సతీష్‌తో మాట్లాడి నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కౌన్సిలర్ కడుపోల్ల మల్లేష్, మాజీ సహకార బ్యాంక్ చైర్మన్ సారా శ్రీనివాస్‌గౌడ్, జేఏసీ నాయకులు మారం లక్ష్మారెడ్డి, మాజీ వార్డు సభ్యులు బురుగు చంద్రశేఖర్, రాజు, సురేష్, విద్యుత్ లైన్మెన్ ప్రతాపరెడ్డి స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి మత్తులో యువకులు వీరంగం

ప్రజాపక్షం/అల్వాల్: శ్రీసాయి నగర్ కాలనీ ఓ గోడౌన్‌లో ఉంటున్న యువకులు గంజాయి మత్తులో వీరంగం సృష్టించారు. అల్వాల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీసాయి నగర్ కాలనీలోని గోడౌన్ లో ఉండే యువకులు ఆదివారం రాత్రి గంజాయి సేవించి కాలనీలోనగ్నంగా తిరుగుతూ హల్ చల్ చేసినట్లు కాలనీవాసులు తెలిపారు. ఇదేమిటని ప్రశ్నించిన కాలనీ వాసులపై యువకులు తిరగబడ్డారు. గోడౌన్ లో పనులు చేసుకునేందుకు వచ్చిన కొంత మంది మార్వాడి యువకులు గంజాయి మద్యం సేవిస్తూ కాలనీవాసులను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఆరోపించారు. పలు సందర్భాలలో మహిళలను కూడా గోడౌన్‌కు తీసుకు వస్తున్నట్లు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. ఇదే విషయమై గోడౌన్ యజమాని దృష్టికి తీసుకువెళ్లగా నిర్లక్ష్యపు సమాధానం చెబుతున్నట్లు వెల్లడించారు. కాలనీలో ఉంటున్న మహిళలు చిన్నారులు భయాందోళనకు గురవుతున్నారని ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అల్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కాలనీ వాసులు స్పష్టం చేశారు. ఘటనస్థలికి చేరుకున్న పోలీసులు కాలనీవాసుల నుండి వివరాలు సేకరించి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

## విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

ప్రజాపక్షం/మల్కాజిగిరి: ఉన్నత శిఖరాలు అందుకొనే లక్ష్యాలతో పోటీ పడుతూ విద్యాభ్యాసం చేయాలని బిజెపి నాయకుడు ఊరవెల్లి రాంబాబు సూచించారు. శ్రవణ్ మిత్ర మండలి ఆధ్వర్యంలో శివపురి కార్యాలయంలో 15 మంది విద్యార్థినీ విద్యార్థులకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల చొప్పున స్కాలర్‌షిప్‌లను శివానంద్, శాస్త్రి, రాజులతో కల్సి అందించారు. ప్రతి ఏడాది విద్యార్థులను ప్రోత్సహించటంతో పాటు పేద విద్యార్థులకు సహాయం అందించేందుకు స్కాలర్‌షిప్‌లను అందచేస్తున్నామన్నారు.

# దంచికొడుతున్న వానలు..
# నీట మునిగిన పంటలు..!!

### వానలతో స్థానిక ప్రజలు, కాలనీవాసులంతా ఆగం

### ప్రాణ, ఆస్తి, పంట నష్టం... పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

### తీవ్ర నష్టం వాటిల్లుతుందనే ఆందోళనలో రైతున్న



ప్రజాపక్షం/నవాబుపేట్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల రాష్ట్రంలో భారీ నుంచి మోస్తరు వర్షాలు దంచికొడుతున్నాయి. శుక్ర వారం రాత్రి నుంచి ఏకధాటిగా కురుస్తున్న వానలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి.వాగులు నిండుకుండలా మారాయి. ఎడతెరిపిలేని వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయ మయ్యాయి.మండలంలో భారీవర్షం కురిసింది. వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మండలంలోని కొన్ని గ్రామాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రోడ్లపై వరద చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షాలతో వాగులు, వంకలు పొంగి ప్రవహించడంతో వాగుల పరీవాహక ప్రాంతాల్లో పంట పొలాలు నీట మునిగాయి. మూడు రోజులుగా రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మండలంలో ఆయా గ్రామంలోపత్తి, కంది పంట పొలాల్లోకి వరద నీరు భారీగా చేరడంతో పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. పత్తికి గూడ వచ్చే దశలో కురుస్తున్న ఈ వర్షాలతో పత్తి పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుందనే ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది. మరో రెండు రోజుల పాటు ఇలాగే వర్షం పడితే పత్తి, మొక్కజొన్నపంటలు పాడయ్యే ప్రమాదముందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు పంట నష్టం అంచనవేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.



### వర్షాలతో పత్తి పంటకు తీవ్ర నష్టం

ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి : వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా నాలుగు రోజులుగ కురుస్తున్న భారీ వర్షాలతో జిల్లాలో పత్తి , మొక్కజొన్న, టామట , తదితర పంటలు పుర్తిగా నష్టపోయాయని రైతులు వాపోతు న్నారు. వికారాబాద్ జిల్లాలో పెద్దముల్ మండల్, ధరూర్ మండల మోమి న్‌పేట్ మండల , మ ర్పల్లి, దౌల్తాబాద్, కొడంగల్ మండలంలో అంగడిరయ చూర్ 1, కిష్టపల్లి గ్రామంలో 4, పసపూర్ , రుద్రరంలో మొత్తం ఆరు ఇండ్లు వర్షానికి పడిపోయినట్లు అధికా రులు తెలిపారు. పరిగి నియోజకవర్గంలోని కుల్కచర్లలో 1,మండలల్లో ఇండ్లు ధ్వంసమైనట్లు, వాటికి సం బం ధించిన వివ రాలను గ్రామ పంచాయతీ అధి కారులుపై అధికారులను తెలియజేశారు. వికారాబాద్ జిల్లాలో వేల ఎకరాలలో పంట నీటిలో మునిగి రైతులకు తీవ్ర నష్టం జరిగినట్లు తెలుస్తుంది. నష్ట పోయిన రైతులను అదుకోవాలని రైతులు ప్రభుత్వన్ని కోరుతున్నారు.

### అధికారులు సమన్వయంతో పనిచేయాలి

### ఎమ్మెల్యే కెపి వివేకానంద

ప్రజాపక్షం/ నిజాంపేట్ : కురుస్తున్న భారీ వర్షాలను దృష్టిలో పెట్టుకుని వరద నీరు నిల్వ ఉండకుండా అధికార యంత్రాంగం సమన్వయంతో పని చేయాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల కార్యాలయంలో జిహెచ్ ఎంసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశంలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే వివేక్ మాట్లాడుతూ గాజుల రామారం, కుత్బు ల్లాపూర్ జంట సర్కిళ్ల అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాలనీలు, బస్తీల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా అధికారులు చూడాలని, ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా దోమల నివారణకు ఫాగింగ్, స్ప్రే వంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇళ్లలో, ఇంటి చుట్టూ ఉన్న ఖాళీ ప్రదే శాల్లో ఇతరత్రా ప్రదేశాలు, వాడుక లేని సామాన్లలో నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. గాలులకు విరిగిన చెట్లను తెలగించాలని, విద్యుత్ అంతరాయం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఎప్పటి కప్పుడు చర్యలను తీసుకోవాలని ఆదేశించారు. సమా వేశంలో జంట సర్కిళ్ల ఉప కమిషనర్‌లు మల్లారెడ్డి, నర్సింహా, ఇఇలు కిష్టప్ప, లక్ష్మీ గణేశ్, డిఇలు రూపా దేవి,పాపమ్మ,ఏఇ మల్లారెడ్డి, రవిందర్, కళ్యాన్ పాల్గొన్నారు.



## ప్రభుత్వ రెసిడెన్షియల్‌పై నమ్మకం కలిగేలా చూడండి

### ప్రిన్సిపాళ్లకు కలెక్టర్ ఆదేశాలు



ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి : పిల్లలకు తమ ఇళ్లల్లో కంటె విద్యాభ్యాసం చేసే ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాల్లో నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల సౌకర్యాలు, రక్షణ లభిస్తాయన్న నమ్మకం తల్లిదండ్రుల్లో కలిగేలా పాఠశాలల ప్రిన్సిపాళ్లు బాధ్యత తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గౌతం సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని విసి హాలులో బిసి సంక్షేమ శాఖాధికారి కేశురాం, ఎస్‌సి సంక్షేమ శాఖాధికారి వినోద్, మైనారిటీ సంక్షేమ శాఖాధికారి కె.వీణలతో రెసిడెన్షియల్ ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెసిడెన్షియల్ పాఠశాలల్లో అవసరమైన విద్యుత్, తాగు నీరు, శానిటేషన్, మరుగు దొడ్లు, తాగునీరు, పైప్‌లైన్లు వంటి విషయాలను సక్రమంగా పరిశీలించాలని, మరమ్మతులు ఎప్పుడైనా అవసరమైన పక్షంలో వెంటనే చేయించుకోవాలన్నారు. పాఠశాలలు ప్రయివేటు భవనాల్లో ఉంటే భవన యజమానులకు చెప్పి పనులు చేయించుకోవాలని, అత్యవసరమైతే వెంటనే ప్రిన్స్‌పాళ్లు పనులు పూర్తి చేయించాలన్నారు. దీంతో పాటు అదనపు తరగతి గదులు అవసరం ఉన్నా, టాయిలెట్ల రూఫ్ లీకేజి వంటి పెద్ద సమస్యలకు ప్రతిపాదనలు తయారు చేసి రీజనల్ కోఆర్డినేటర్‌కు పంపాలని, ఆ తర్వాత రీజనల్ కోఆర్డినేటర్లు వాటికి సంబంధించిన నివేదికలను తమకు వెంటనే పంపాలన్నారు. పిల్లలకు ఇచ్చే భోజన పదార్థాలు రుచి కరం గా, పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, మెస్ కమిటీ సభ్యులు విద్యార్థులకు సిద్దమైన ఆహార పదార్థాలను ప్రతి పాఠశాలల్లో ఉండే విధంగా చూడాలని జిల్లా కలెక్టర్ గౌతం తెలిపారు. అదే విధంగా వంట గదులు, స్టోర్ రూంలు శుభ్రంగా ఉండేలా చూడాలని, స్టోర్ రూంలలో భద్రపరచే వంట సామగ్రి, కూరగాయలను నిలువ చేసే సమయంలో తడి లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి పాఠశాలలో తప్పనిసరిగా ఒక స్టాఫ్ నర్సు విధిగా ఉండేలా చూడటంతో పాటు అవసరమైన పాఠశాలలో ఉండేలా మందులు సమకూర్చుకోవాలని కలెక్టర్ ప్రిన్సిపాళ్లకు తెలిపారు. అత్యవస రమైతే సమీపంలోని పల్లెదవఖానా, పిహెచ్‌సి సెంటర్లకు విద్యార్థులను ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా తరలించి పూర్తి వైద్యం అందించటంలో బాధ్యతాయుతంగా ప్రిన్సిపాళ్లు వ్యవహరించాలన్నారు. తాము పాఠశాలల్లో ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి పలువురు ప్రిన్సిపాళ్లు తీసుకొని రాగా వాటిని యుద్ద ప్రాతిపదికన పరిష్కరిస్తానని కలెక్టర్ వారికి తెలిపారు.

## భద్రత ,బందోబస్తు కోసం గణేష్ ఆన్‌లైన్ నమోదు విధానం

### పోలీసులకు సహకరించాలి : ఎస్‌పి నారాయణరెడ్డి



ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి : వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా గణేష్ మండప నిర్వాహకులు పోలీస్ శాఖ రుపొందించిన పోర్టల్ ద్వారా వివరాలను నమోదు చేసుకుని పోలీస్ వారికి సహకరించాలని జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీస్ శాఖ రూపొందించిన ఆన్‌లైన్ అప్లికేషన్ కేవలం మంటపం నిర్వహణ, మంటపానికి సంబంధించిన సమాచారం కోసం మాత్రమే రూపొందించిందని , ఈ సమాచారం ద్వారానే భద్రత, బందోబస్తు ఏర్పాటు చేయడానికి పోలిస్ అధికారులకు సులవుగా ఉంటుందని, అన్‌లైన్ ద్వారా ఎలాంటి రుసుం లేదని తెలి పారు. గణేష్ ఉత్సవాల నిర్వహకులు అన్‌లైన్‌లో కంప్యూటర్, ముబైల్ పోన్ నందు చేసుకోవచ్చుని https:/police portal.tspolice. gov.in/indexhtm ఈలింకు ద్వారా సంప్రదించగలరని తెలిపారు. మండపాల్లో డిజేలను ఏర్పాటు చేయరాదని, ఎటువంటి ప్రమదాలు జరగకుండా షేడ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు.సామాజిక మాధ్యమాలలో వచ్చే ఎలాంటి రూమర్స్ వదంతులను నమ్మకూడదని, అనుమనం ఉంటే సంబంధిత 100కు గాని 8712670056 కు పోలీస్ అధికారులకు తెలియజేయలన్నారు.

## అంటు వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు వహించాలి



ప్రజాపక్షం/మల్కాజిగిరి : ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో అంటు వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మౌలాలి కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్‌కోరారు. చెత్తా చెదారాలను ఎప్పటికప్పుడు తొలగించటం, ఫాగింగ్ చేయటం క్రమం తప్పకుండా చేయాలన్నారు. వర్షాలతో ప్రధాన రహదార్లతో పాటు కాలనీలు, చిన్న రోడ్లపై ఏర్పడ్డ గుంతలను యుద్ధ ప్రాతిపదికన పూడ్చాలని, లేని పక్షంలో ప్రమాదాలు జరుగుతాయన్నారు. సోమవారం తన కార్యాలయంలో జిహెచ్ఎంసి ఈఈ మధురిమ, శానిటరీ అధికారులు శ్రీనివాస్, ఎస్ఎఫ్ఏలు, వాటర్ వర్క్స్ అధికారి ఉదయ్, విద్యుత్ శాఖ లైన్‌మెన్లు, వర్క్ ఇనస్పెక్టర్లు, సిఎండి ఇన్‌చార్జిలతో సమావేశమయ్యారు. డివిజన్ అధ్యక్షుడు సాయిబాబా, మౌలాలి జనరల్ సెక్రటరీ శివా గౌడ్, ప్రసాద్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## బిసిలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి



ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: బిసిలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాకే ఎన్నికలను నిర్వహించాలని బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ గౌడ్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర వ్యాప్త కలెక్టర్ల ముట్టడిలో భాగంగా సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట బిసి సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించిన అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.విక్రమ గౌడ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ఇచ్చిన హామీని నిలబెట్టుకొంటూ బిసిలకు 42 శాతీం రిజర్వేషన్ కల్పించేందుకు, కులగణన ప్రక్రియ వెంటనే ప్రారంభించాలన్నారు.ఆర్థిక,రాజకీయ రంగాల్లో బిసిల జనాభా మేరకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. బిసి విద్యార్థి సంఘ ప్రతినిధులు ఇద్రం రజక, గౌతం ప్రజాపతి, పూస శివతేజ, అర్జున్, సురేష్, పాల్గొన్నారు.

## వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం



కూన శ్రీశైలంగౌడ్





ప్రజాపక్షం/నిజాంపేట్ : దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ సేవలు చిరస్మరణీయమని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, షాపూర్‌నగర్‌లో మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సభలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ పాల్గొని వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ గౌడ్, బుచ్చిరెడ్డి, రంగారావు, రఘుగౌడ్, నాగిళ్ల శ్రీనివాస్, ఆర్.లక్ష్మి , పూలమ్మ, బలరాం, విజయ్ గుప్త పాల్గొన్నారు.

**నిజాంపేట్ కార్పొరేషన్‌లో...**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్య కర్తలు స్వర్గీయ వైఎస్సార్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బాచుపల్లిలో కుత్బు ల్లాపూర్ నియోజకవర్గం కాం గ్రెస్ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పి ంచారు. కార్య క్రమంలో కార్పొరేటర్ కొలను వీరే oదర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కొలను రాజ శేఖర్ రెడ్డి, జీవన్ రెడ్డి, జీతయ్య, మదుసూదన్ రెడ్డి, శ్రీశైలంయాదవ్, ప్రవీన్‌రెడ్డి, పాల్గొన్నారు.

**శామీర్‌పేటలో:**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రి, స్వర్గీయ రాజశేఖర్‌రెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా తూంకుంట మున్సిపాలిటీ దేవర యాంజాల్‌లోని విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లర్పించారు. అదే విధంగా మూడు చింతలపల్లి మండల కేంద్రంలో వీరారెడ్డి విగ్ర హం వద్ద మూడుచింతలపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మలపల్లి నర్సింహాయాదవ్ ఆధ్వ ర్యంలో రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**పరిగి మండల కేంద్రంలో :**

స్వర్గీయ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం పరి గి పట్టణంలోని కోర్టు వద్ద విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు ఆర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లాల్ కృష్ణ, హన్మంత్ ముదిరాజ్, ఎర్రగడ్డపల్లి క్రిష్ణ, ముధుసూధన్ రెడ్డి నాయకులు, కర్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు

ప్రజాపక్షం/శామీర్‌పేట: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేనా పార్టీ అదినేత పవన్‌కల్యాన్ జన్మదిన వేడుకలు శామీర్‌పేట మండలం తుర్కపల్లిలో ఘనంగా నిర్వహించారు. జనసేనా పార్టీ మేడ్చల్ నియోజకవర్గం యువ నాయకుడు షేక్ ఇబ్రహీం ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. చక్రధర గార్డెన్ వద్ద ఉన్న అనాధాశ్రమంలో అనాధలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేనా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# క్రీడ

# బ్యాడ్మింటన్‌లో భారత్‌కు స్వర్ణం



**పారిస్ :** పారాలింపిక్స్‌లో భారత్ మరో స్వర్ణ పతకం సాధించింది. బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్ ఎస్ఎల్3లో నితేశ్ కుమార్ పసిడి గెలిచాడు. తొలిసారి పారాలింపిక్స్‌లో ఆడుతున్న నితేశ్ ఫైనల్‌లో 21–14, 18–21, 23–21తో డానియల్ బెతెల్ (బ్రిటన్)ను ఓడించాడు. టోక్యో పారాలింపిక్స్‌లో రజతం సాధించిన బెతెల్ ఈ సారి కూడా ఫైనల్‌లో చివరి వరకు గట్టిపోటీ ఇచ్చాడు. తొలి గేమ్‌లో భారత షట్లర్ ఆధిపత్యం ప్రదర్శించగా.. రెండో గేమ్ హోరాహోరీగా సాగింది. ఒక దశలో 1–18తో ఆధిక్యంలో నిలిచిన నితేశ్.. తర్వాత కాస్త పట్టు తప్పాడు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న బ్రిటన్ షట్లర్ వరుసగా పాయింట్లు సాధించి గేమ్‌ను సొంతం చేసుకున్నాడు. నిర్ణయాత్మక మూడో గేమ్ కూడా నువ్వానేనా అన్నట్లుగా సాగింది. చివరకు నితేశ్ పైచేయి సాధించాడు. మరోవైపు ఎస్ఎల్4లో సుహాస్ యతిరాజ్ వరుసగా రెండోసారి ఫైనల్ చేరిన విషయం తెలిసిందే. టోక్యోలో రజతం గెలిచిన సుహాస్.. ఈ సారి పసిడి కోసం లుకాస్ (ఫ్రాన్స్)తో తలపడబోతున్నాడు.

## పురుషుల డిస్కస్ త్రో ఎఫ్56లో రజతం



**మరో రజత పతకం**

భారత్ మరో రజత పతకం సాధించింది. పురుష డిస్కస్ త్రో ఎఫ్56లో యోగేశ్ కతునియా (42.22 మీటర్లు) రజతం దక్కించుకున్నాడు. బ్రెజిల్‌కు చెందిన క్లాడినీ బాటిస్టా (46.86 మీ) స్వర్ణం అందుకున్నాడు. గ్రీస్ దేశానికి చెందిన కాన్స్టాంటినోస్ జౌనిస్ (41.32 మీ) మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించాడు. తాజాగా యోగేశ్ పతకం గెలవడంతో ఈ పారాలింపిక్స్‌లో భారత్ పతకాల సంఖ్య ఎనిమిదికి చేరింది. యోగేశ్‌కు పారాలింపిక్స్‌లో ఇది రెండో పతకం. టోక్యోలోనూ అతడు రజతం సాధించాడు. మరోవైపు.. బ్యాడ్మింటన్ మిక్స్‌డ డబుల్స్ ఎస్‌హెచ్6 కాంస్య పతక పోరులో శివరాజన్ నిత్యశ్రీ నిరాశపర్చారు. 17–21, 12–21తో ఇండోనేషియా జోడీ సుభాన్‌రినా మార్లినా చేతిలో ఓటమి చవిచూశారు.

# పారా ఆర్చర్ శీతల్ దేవి షాట్‌కు నెటిజన్లు ఫిదా!



**పారాలింపిక్స్** 2024లో భారత పారా ఆర్చర్ శీతల్ దేవి తృటిలో మెడల్ చేజార్చుకున్న విషయం తెలిసిందే. అయితే ఆమె చూపిన పోరాటం మాత్రం క్రీడా ప్రపంచాన్ని ఆకట్టుకుంది. 17 ఏళ్ల వయసులో అసాధారణ ప్రదర్శన కనబర్చిన శీతల్ దేవి.. పతకం సాధించకపోయినా.. మనసులు గెలుచుకుంది. మహిళల వ్యక్తిగత విభాగంలో పోటీ పడిన శీతల్ తన తొలి షాట్‌లోనే టార్గెట్‌ను కొట్టి 10 పాయింట్లు సాధించింది. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఈ వీడియోకు నెటిజన్లతో పాటు క్రీడా, సినీ, రాజకీయ ప్రముఖులు ఫిదా అయ్యారు. భారత మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్, బార్సిలోనా ఫుట్‌బాల్ స్టార్ జౌలెస్ కుందె శీతల్ దేవి ప్రదర్శనపై ప్రశంసల జల్లు కురిపించారు. 'ప్రపంచంలోనే అతికొద్ది మంది మాత్రమే ఉన్న ఆర్మ్‌లెస్ ఆర్చర్లలో శీతల్ ఒకరు. కాలితోనే విల్లు ఎత్తి పది పాయింట్లకు గురి పెట్టి కొట్టడం సంభ్రమాశ్చర్యానికి గురి చేసింది. వ్యక్తిగత విభాగంలో శీతల్ తన కాళ్లతో పోటీపడగా.. ప్రత్యర్థి వీల్ చైయిర్‌లో చేతులతోనే బాణం సంధించింది. శీతల్ వీడియోను కేంద్ర రక్షణ శాఖ మాజీ కార్యదర్శి శేఖర్ దత్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. దానికి శీతల్ ధన్యవాదాలు చెబుతూ రీపోస్ట్ చేసింది. 'కోట్లాది మందికి శీతల్ స్ఫూర్తి ప్రదాత. ఇలానే ముమ్ముందు మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నా'అని శేఖర్ దత్ కొనియాడగా.. 'ఇది సాధ్యం కానిది. కవితల్లోనే నమ్మశక్యం కాని ఫీట్‌ను సాధించడం అభినందనీయం. ఆర్మ్ లేకుండా జన్మించిన శీతల్ స్థాయికి చేరుకోవడం నిజమైన హీరో లక్షణం'అని ఎరిక్ సోల్హైమ్ కామెంట్ చేశాడు. 'పారాలింపిక్స్‌లో పోటీపడే ప్రతీ ఒక్కరూ అద్భుతమే. టాలెంట్‌కు వైకల్యం అడ్డు కాదని నిరూపించారు'అని ఓ నెటిజన్ ప్రశంసించారు.

# కీళ్ల నొప్పులతో బాధపడుతున్నా...

## త్వరలో రిటైర్మెంట్‌పై నిర్ణయం : సైనా నెహ్వాల్



**భారత** స్టార్ బ్యాడ్మింటన్ ప్లేయర్, వరల్డ్ మాజీ నెం.1 ర్యాంకర్ 34ఏళ్ల సైనా నెహ్వాల్ తన కెరీర్‌కు ముగింపు పలికే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. తాజాగా రిటైర్మెంట్‌పై సైనా ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. ప్రస్తుతం ఆమె ఆర్థ రైటిస్‌తో బాధపడుతుందట. దీంతో ఈ ఏడాది చివరి నాటికి కెరీర్ గురించి కీలక నిర్ణయం తీసుకోవాల్సి ఉందని ఆమె వెల్లడించింది. ఈ మేరకు 'హౌస్ ఆఫ్ గ్లోరీ' పోడ్‌కాస్ట్‌లో తాజాగా పాల్గొన్న సైనా ఈ కామెంట్స్ చేసింది. 'నా మోకాలు బా గాలేదు. కీళ్ల నొప్పులు కూడా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో 8–9 గంటలు ప్రాక్టీస్ చేయడం చాలా కష్టం. ప్రపంచలోని అత్యుత్తమ ఆటగాళ్లతో పోటీపడాలంటే 2 గంటల ప్రాక్టీస్ సరి పోదు. అందుకే నేను దాని (రిటైర్మెంట్) గురించి ఆలోచిస్తున్నా. అది కాస్త బాధ గానే ఉంటుంది. కానీ, క్రీడాకారుడి కెరీర్ చాలా తక్కువ సమయమే కదా. నేను 9ఏళ్ల వయసున్నప్పుడు కెరీర్ ప్రారంభించా. నెక్ట్స్ ఇయర్‌కు నాకు 35ఏళ్లు వస్తాయి. ఈ సుదీర్ఘ కాలంపాటు నేను బ్యాడ్మింటన్ ఆడాను. ఈ ఏడాది చివరి నాటికి నా పరిస్థితిని బట్టి నిర్ణయం ఒక తీసుకుంటా' అని సైనా పేర్కొంది.

**అది చిన్నప్పటి కల**

'ఒలింపిక్స్‌లో పాల్గొనడం అందరికీ చిన్ననాటి కల. దాని కోసం ఏళ్ల తరబడి కష్టపడాలి. కొన్నిసార్లు గాయాలపాలై ఆ స్థాయికి చేరుకోలేరని తెలుసుకున్నప్పుడు ఎంతో బాధపడాల్సి వస్తుంది. కానీ, నేను ఎంతో కష్టపడ్డాను. చాలా హార్డ్ వర్క్ చేశాను. ఫలితంగా మూడు ఒలింపిక్స్‌లో పాల్గొన్నా.డెబ్యూ చేసిన నా లుగేళ్లకే, ఆమె పద్మ శ్రీ అవార్డు అందుకుంది. తర్వాత 2012 ఒలింపిక్స్‌లో కాంస్యం నెగ్గి, విశ్వక్రీడల్లో పతకం సాధించిన తొలి భారత షట్లర్‌గా సైనా చరిత్ర సృష్టించింది. ఇక 2010, 2018 కామన్వెల్త్ గేమ్స్‌లో స్వర్ణ పతకాలు దక్కించుకుంది. ఇక గాయాలతో కొంతకాలంగా ఆటకు దూరంగా ఉంటున్న సైనా, చివరిసారిగా ఏడాది కిందట సింగపూర్ ఓపెన్‌లో బరిలో దిగింది. ఈ పోటీల్లో సైనా ఓపెనింగ్ రౌండ్‌లోనే ఓడింది.

# రీల్

# 'విశ్వం' టీజర్ రిలీజ్ డేట్ ఫిక్స్




**ద**ర్శకుడు శ్రీను వైట్ల దర్శకత్వంలో యాక్షన్ హీరో గోపీచంద్ హీరోగా వస్తున్న కొత్త చిత్రం 'విశ్వం'. ఈ సినిమాలో కావ్య థాపర్ హీరోయిన్ గా నటిస్తోంది. ఐతే, తాజాగా విశ్వం టీజర్‌కి డేట్ లాక్ అయింది. రేపు సాయంత్రం 4 గంటల 5 నిమిషాలకు ఈ విశ్వం సినిమా టీజర్ ను విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. టీజర్ రిలీజ్ పోస్టర్ సినిమా పై ఆసక్తిని కలిగిస్తుంది. ఈ పోస్టర్ ను చూస్తుంటే ఇదొక యాక్షన్‌ప్యాక్డ్ మూవీ అని అర్థమవుతుంది. మరి ఈ టీజర్ లో విడుదల తేదీని కూడా మేకర్స్ వెల్లడిస్తారేమో చూడాలి. ఇప్పటికే ప్రేక్షకుల్లో 'విశ్వం' సినిమాకి మంచి బజ్ ను క్రియేట్ చేసింది. చేతన్ భరద్వాజ్ ఈ సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టిజి.విశ్వప్రసాద్ ప్రొడ్యూస్ చేస్తున్నారు. హిట్ కోసం చాలా కాలంగా ఎదురు చూస్తున్న దర్శకుడు శ్రీను వైట్ల, ఈ సినిమాతో సాలిడ్ కమ్ బ్యాక్ ఇవ్వాలని ఆశిస్తున్నాడు. మరి ఈ సినిమా ఏ రేంజ్ సక్సెస్ ను సాధిస్తోందో చూడాలి.



# ఎన్టీఆర్‌తో కలిసి ఒక శుభప్రదమైన ప్రయాణం

**జూ**నియర్ ఎన్టీఆర్ గత మూడు రోజులుగా కుటుంబ సమేతంగా కర్ణాటక లోని ప్రముఖ పురాతన దేవాలయాల్ని దర్శించుకుంటున్న సంగతి తెలిసిందే. ఐతే, తాజాగా కేశవనాథేశ్వర గుహ ఆలయాన్ని ఎన్టీఆర్ సందర్శించారు. కాంతార హీరో కమ్ డైరెక్టర్ రిషబ్ శెట్టి ఇల్లు ఉన్న కెరడి మూడగల్లు గ్రామ సమీపంలో ఈ ఆలయం ఉంది. ఎన్టీఆర్ ఫ్యామిలీతో పాటు హీరో రిషబ్ శెట్టి, అతని భార్య ప్రగతి శెట్టి, అలాగే దర్శకుడు ప్రశాంత్ నీల్, ఆయన భార్య లిఖిత కూడా కేశవనాథేశ్వర గుహలో కొలువై ఉన్న పరమేశ్వరుని దర్శనం చేసుకున్నారు. కేశవనాథేశ్వర గుహ చుట్టూ ఉన్న ప్రాంతంలోని సహజ సౌందర్యానికి ఎన్టీఆర్ ఆకర్షితుడయ్యాడని.. ఆ అటవీ ప్రాంతం లోని పురాతన గుహలో స్వయంభువుగా కొలువైన ఆ పరమేశ్వరుడిని తారక తో కలిసి దర్శించుకోవడం గొప్ప అనుభూతి అని ఓ వీడియోని షేర్ చేస్తూ తాజాగా హీరో రిషబ్ శెట్టి తన ట్విట్టర్ X ద్వారా తెలియజేశాడు. రిషబ్ శెట్టి మెసేజ్ చేస్తూ నవ్వు , జ్ఞాపకాలు, ఆశీర్వాదాలు మరియు నా బెస్ట్ ఫ్రెండ నా ప్రియమైన సోదరుడు JrNTR తో పాటు మూడగల్లు కేశవనాథేశ్వర ఆలయ దర్శనం ఒక శుభప్రదమైన ప్రయాణం' అని రిషబ్ చెప్పుకొచ్చాడు.




## బాలయ్య స్వర్ణోత్సవ వేడుకల్లో

# మెగాస్టార్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్



**టా**లీవుడ్ మాస్ గాడ్ నందమూరి బాలకృష్ణ అంటే ఒక రకమైన ఎనర్జీ అభిమానుల్లో వచ్చేస్తుంది. ఇలా ఈ ఏజ్ లో కూడా బాలయ్య యువకుడిలా సాలిడ్ ఎనర్జీతో అభిమానులని అలరిస్తూనే ఇండస్ట్రీలో 50 వసంతాలు పూర్తి చేసేసుకున్నారు. దీనితో అరుదైన మైలురాయిని అందుకున్న బాలయ్య కోసం అభిమానులు గ్రాండ గా స్వర్ణోత్సవ వేడుకలు జరుపగా అందుకు మెగాస్టార్ చిరంజీవి సహ ఎందరో స్టార్స్ వచ్చారు. అయితే ఈ కార్యక్రమంలో పాల్గొన్న చిరు ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసారు. తాను మాట్లాడుతూ.. బాలయ్య బాబు 50 సంవత్సరాల ఈ కన్నుల వేడుకలో మేము పాలు పంచుకోవడం మాకు చాల ఆనందం. ఇది బాలయ్యకు మాత్రమే కాదు, తెలుగు చలన చిత్రానికి ఒక వేడుకలా చూస్తున్నాను. అరుదైన రికార్డు బాలయ్య సొంతం చేసుకున్నందుకు సంతోషం. ఎన్టీఆర్ గారికి ప్రజల మదిలో ప్రత్యేక స్థానం ఉంది. ఆయన కొడుకుగా బాల కృష్ణ తండ్రి చేసిన పాత్రలు వేస్తూ ప్రేక్షకులను మెప్పించడం మామూలు విషయం కాదు. తండ్రికి తగ్గ తనయుడిగా ఆయన తన ప్రత్యేకత చాటుకున్నారు. నేను ఇంద్ర సినిమా చేయడానికి ఆదర్శం కూడా సమర సింహా రెడ్డి. నాకు బాలయ్య తో కలిసి ఒక ఫ్యాక్షన్ సినిమా చేయాలని ఒక కోరిక. ఫ్యాన్స్ గొడవ లు పడుతుంటారు. ఫ్యాన్స్ కోసం హీరోల మధ్య ఎటువంటి మంచి బంధం ఉంటుందో తెలియడం కోసం కొన్ని వేడుకలు చేసుకునేవాళ్లం. అందుకే మా అభిమానులు కూడా కలిసి కట్టుగా ఉంటారు. మా ఇంట్లో ఎటువంటి శుభకార్యం జరిగినా బాలయ్య రాకుండా అందరూ. కలిసి డ్యాన్స్ కూడా వేస్తారు. 50 సంవత్సరాల ఈ ప్రయాణం ఇంకా హీరోగా నటించే ఘనత బాలయ్యకే సొంతం. భగవంతుడు బాలయ్యకు ఇదే ఎనర్జీ ఇస్తూ 100 ఏళ్లు బావుండాలని భగవంతుడిని కోరుకుంటున్నాను. రాజకీయ వైద్య రంగాలలో ఇలా సేవ చేయడం న భూతో న భవిష్యత్. మేము అంత ఒక కుటుంబం లాంటి వాళ్ళం, ఫ్యాన్స్ అర్థం చేసుకోవాలో అని కోరుకుంటూ లాంగ్ లివ్ బాలయ్య అంటూ మెగాస్టార్ తన ప్రసంగాన్ని ముగించారు.



# అధైర్యపడొద్దు

(మొదటి పేజీ తరువాయి)

వి.పూర్ణచందర్‌రావు, ఏ.సాయిబాబు, బండి నాగేశ్వర్ రావు, రాహుల్, నాగరాజు, దారా శ్రీను, మన్నెం వెంకన్న, ఆదినారాయణ, అన్నారపు వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

**ముంపు ప్రాంతాల్లో సిపిఐ బృందం పర్యటన**

అధికారుల నిర్లక్ష్యం, అంచనా వేయడంలో వైఫల్యం ఖమ్మం నగరంతో పాటు మున్నేరు పరీవాహక ప్రాంత ప్రజలు భారీగా నష్టపోయేందుకు కారణమైందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ఆరోపించారు. 30, 31 తేదీలలో భారీ వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ పలుమార్లు హెచ్చరించినా మున్నేరు ప్రభావిత ప్రాంతాలలో రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదవుతుందని తెలిసి కూడా ప్రజలను అప్రమత్తం చేయలేదని హేమంతరావు తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ సహ సిపిఐ బృందం పలు ప్రాంతాల్లో పర్యటించింది. వెంకటేశ్వర నగర్, బొక్కలగడ్డ, మోతీ నగర్, పంపింగ్ వెల్‌రోడ్డు, ప్రకాష్ నగర్, జలగం నగర్, నాయుడు పేట, రాజీవ్ గృహ కల్ప, నాల్గవ తరగతి ఉద్యోగుల కాలనీ, కస్నాతండా తదితర ప్రాంతాలలో పర్యటించారు. హేమంతరావు మాట్లాడుతూ ప్రజలను అప్రమత్తం చేయకపోవడం వల్ల వరద రావడంతో కట్టు బట్టలతో ఇండ్లు వదిలి బయటకు వచ్చారని కనీసం చేతికి అందే సామాన్లు కూడా తెచ్చుకోలేని పరిస్థితి ఏర్పడిందని హేమంతరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, మేకల శ్రీనివాసరావు, జిల్లా సమితి సభ్యులు యానాలి సాంబశివ రెడ్డి, నూనె శశిధర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, భూక్యా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



**మున్నేరు బాధితులకు ఏఐఎస్ఎఫ్ భరోసా**

మున్నేరు వరద బాధిత కుటుంబాలకు ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా బృందం భరోసా కల్పించింది. సోమవారం ఖమ్మం నగరం కాల్వొడ్డు వెంకటేశ్వర కాలనీలో వరద ముంపుకు నష్టపోయిన కుటుంబాలకు ఏఐఎస్ఎఫ్ బృందం ఆహార పదార్థాలు, మంచినీళ్లు ఇంటింటికి తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షులు రావి శివరామకృష్ణ మాట్లాడుతూ దేశంలో జరిగిన ప్రకృతి విపత్తు సమయాల్లో ఏఐఎస్ఎఫ్ బాధితులకు అండగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు పోటు పూర్ణచందర్ రావు, మేకల రవి, ఏఐఎస్ఎఫ్ ఖమ్మంజిల్లా సమితి కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, జిల్లా నాయకులు రాకేష్, సునీల్, హరికృష్ణ, ప్రతాప్, నరేష్, సాయి, గోపి, ఉమా, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి హఠావో... దేశ్‌కీ బచావో

**ధరల పెరుగుదలపై త్వరలో ప్రచార కార్యక్రమం**
**ఎఐటియూసి జాతీయ కౌన్సిల్ తీర్మానం**

**విశాఖపట్నం:** దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు గతంలో ఎన్నడూ లేని విధంగా మండిపోతున్నాయని, దీనికి మోదీ సర్కార్ వైఫల్యమే కారణమని ఏఐటీయూసీ విమర్శించింది. ధరల పెరగడంతో సామాన్యులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై త్వరలో బీజేపీ హఠావో... దేశ్‌కీ బచావో ప్రచార కార్యక్రమం ప్రారంభించాలని ఏఐటీయూసీ జాతీయ సమితి నిర్ణయించింది. విశాఖలో జరుగుతున్న ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలు సోమవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఏఐటీయూసీ జాతీయ అధ్యక్షులు రామేంద్రకుమార్, ప్రధాన కార్యదర్శి అమరజీత్ కౌర్, జాతీయ ఆఫీస్ బెరర్లు వేదిక పై ఆశీనులయ్యారు. ఏఐటీయూసీ బీహార్ రాష్ట్ర నేత ఉషా సహాని ధరల పెరుగుదలపై తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

మహిళలకు రక్షణ కల్పించాలి

బీజేపీ పాలనలో దేశ వ్యాప్తంగా మహిళలపై హింస, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని, నిర్భయ చట్టం ఉన్నప్పటికీ దేశంలో ప్రతి గంటకు మహిళలపై 90 అత్యాచారాలు జరుగుతున్నాయని ఏఐటీయూసీ ఆందోళన వ్యక్తం చేసింది. మహిళల పటిష్ట భద్రతకు, వారి ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సమావేశం తీర్మానం చేసింది. కోల్‌కత్తాలో ట్రైనీ డాక్టర్ పై అత్యాచారం, హత్య ఘటనలు వైద్యరంగంతో పాటు యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిందని తీర్మానం పేర్కొంది.

**ప్రజారోగ్యంపై తీర్మానం**

ప్రజారోగ్యంపై తమిళనాడుకు రాష్ట్ర నాయకురాలు డాక్టర్ శాంతి తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ... ప్రపంచ ఆరోగ్య సంస్థ 2022 నివేదిక మేరకు దేశంలోని ప్రజల్లో 19 శాతం మంది తీవ్ర అనారోగ్య స్థితిలో ఉన్న కారణంగా ఆరోగ్య రక్షణకు అత్యధిక ఆదాయం వెచ్చించవలసి వస్తున్నదన్నారు.

**నిరుద్యోగంపై తీర్మానం**

నిరుద్యోగ సమస్య పరిష్కారాన్ని అత్యంత ప్రాధాన్యతాంశంగా తీసుకుని పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ జనరల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఇటీవల రిజర్వు బ్యాంకు దేశంలో నిరుద్యోగ సమస్య లేదని, గత కొద్ది సంవత్సరాలలో 8 కోట్ల ఉద్యోగాలు కల్పించామని అవాస్తవ, ఆధారాలు లేని ప్రకటన విడుదల చేయడాన్ని తప్పుపట్టింది.

**కార్మికుల భద్రత, పనిపరమైన రక్షణకు తీర్మానం**

కార్మికుల భద్రత, పనిపరమైన రక్షణ అంశంపై కేరళ రాష్ట్ర నాయకులు కేపీ రాజేంద్ర తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రతి సంవత్సరం వత్తిపరమైన ప్రమాదాలు, వ్యాధులు కారణంగా 48 వేల మంది కార్మికులు, ఉద్యోగులు చనిపోతున్నారని ఐఎల్ఓ చెప్పింది. నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా 2020 సంవత్సరంలో 12,




486 పని ప్రదేశాలలో జరిగిన ప్రమాదాలలో 2 లక్షల మంది గాయపడ్డారని, 1405 మంది చనిపోయారని ప్రకటించింది.

**అప్రెంటిస్ పేరుతో శ్రమదోపిడీ**

అప్రెంటిస్ విధానంపై యూనియన్ నేత ఆర్ పరాశన్ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. కేంద్ర ప్రభుత్వం అప్రెంటిస్ పేరుతో వివిధ శాఖలలో, రక్షణ రంగంలో అగ్నివీర్ పేరిట శ్రమ దోపిడీకి పాల్పడుతున్నదన్నారు. పోస్టల్, రైల్వే, రక్షణ, కేంద్ర ప్రభుత్వ శాఖలలో 12 లక్షలకు పైగా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. అందరికీ పెన్షన్ సౌకర్యం కల్పించాలని, కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయాలని, రైల్వేలో ఖాళీలు తక్షణం భర్తీ చేయాలని, స్మార్ట్ మీటర్ల బిగింపు విధానాన్ని ఉపసంహరించుకోవాలని, బ్యాంకుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, ట్రాన్స్ జండర్ లకు సమాన హక్కులు కల్పించాలని తదితర అంశాలపై ఏఐటీయూసీ కౌన్సిల్ తీర్మానాలు ఆమోదించింది.

# నిందితులైతే ఇళ్లు కూల్చేస్తారా!

(మొదటి పేజీ తరువాయి)

కోర్టు ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్ గురించి ధర్మాసనం ప్రస్తావించగా, ఉత్తర్‌ప్రదేశ్ తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహ్‌తా మాట్లాడుతూ అఫిడవిట్లు దాఖలు చేసిన రాష్ట్ర ప్రభుత్వాలు కేవలం నిందితులుగా ఉన్నారని మాత్రమే వారి స్థిరాస్తిని కూల్చివేయట్లేదని, ఆ స్థిరాస్తి అక్రమ కట్టడం అని నిర్ధారించుకున్న తర్వాతనే కూల్చివేయడం జరుగుతోందని విన్నవించారు. 'నిందితుడిగా ఉన్నాడనే ఒకే ఒక్క కారణంతో ఎవరి ఇళ్లనైనా ఎలా కూల్చివేస్తారు?. ఒక వేళ దోషిగా ఎవరైనా ఉన్నప్పటికీ నిర్దేశించిన చట్టం నిబంధనలను అనుసరించకుండా బుల్డోజర్లతో కూల్చివేయడం కరెక్టేనా?' అని ద్విసభ్య ధర్మాసనం ప్రశ్నించడంతో సొలిసిటర్ జనరల్ ఈ సమాధానమిచ్చారు. అయితే దేశవ్యాప్తంగా ఇలాంటి సమస్యల పరిష్కారానికి తామే గైడ్‌లైన్స్ రూపొందిస్తామని బెంచ్ వెల్లడించింది. ఆయా ప్రాంతాలకు సంబంధించి అక్కడ వర్తించనున్న మున్సిపల్ చట్టం, అభివృద్ధి అధికారులు అమలు చేస్తున్న చట్టానికి అనుగుణంగా నడుచుకోకుండా అతిక్రమించి అక్రమ కట్టడాలు నిర్మించిన పక్షంలో ఆ స్థిరాస్తిని మాత్రమే బుల్డోజర్లతో కూల్చివేస్తున్నామని సొలిసిటర్ జనరల్ ధర్మాసనానికి నివేదించారు. యజమాని లేదా స్వాధీనకర్త అలాంటి ఆస్తిని నిర్మించడంలో భాగస్వామి అయ్యాడని తేలితేనే చర్యలు తీసుకుంటామని తుషార్‌మెహ్‌తా చెప్పారు. 'మీరు ఒక వేళ ధర్మాసనం ఆలోచనను అంగీకరిస్తామంటే అన్ని రాష్ట్రాలకూ గైడ్‌లైన్స్ రూపొందిస్తాం' అని ధర్మాసనం తెలిపింది.అయితే ఈ విషయమై ఒక పరిష్కారాన్ని కనుగొనేందుకు అన్ని రాష్ట్రాలతో సమగ్రంగా చర్చిద్దామని మెహ్‌తా ధర్మాసనం ముందు అభిప్రాయం వ్యక్తం చేయగా ఇది చట్టానికి సంబంధించినది మాత్రమే కాకుండా చట్టాన్ని అతిక్రమించిన విషయంగా కూడా పరిగణించాలని సూచించింది. అక్రమకట్టడమని నిర్ధారించుకున్న తర్వాత బుల్డోజర్‌తో ఇండ్లను కూల్చివేయడానికి ముందే అధికార యంత్రాంగం వారికి నోటీసులు జారీ చేసిందని వాటిని బెంచ్‌కు అందజేశారు.'బుల్డోజర్ న్యాయాన్ని ప్రశ్నిస్తూ పిటిషన్ దాఖలు చేసిన ఒక పిటిషన్‌దారు తరపున సీనియర్ న్యాయవాది దుష్యంత్‌దావే వాదిస్తూ దేశవ్యాప్తంగా ఇలాంటి బుల్డోజర్‌తో స్థిరాస్తుల కూల్చివేతలపై స్టేట్‌మెంట్ రికార్డు చేయాలని, బుల్డోజర్ న్యాయాన్ని ప్రజలు ఆమో దించరని చెప్పారు. మరికొందరు పిటిషన్‌దార్ల తరపున మరో సీనియర్ న్యాయవాది సి యు. సింగ్ వాదిస్తూ దేశంలోని వివిధ రాష్ట్రాలలో ఆస్తుల కూల్చివేతలను ప్రస్తావించారు. వాదనలు విన్న అనంతరం ద్విసభ్య ధర్మాసనం తదుపరి విచారణను సెప్టెంబర్ 17వ తేదీకి వాయిదా వేసింది.

# సెబీ చైర్‌పర్సన్‌కు ఐసిఐసిఐ నుంచీ వేతనం

(మొదటి పేజీ తరువాయి)

వ్యతిరేకంగా ఫిర్యాదులు ఉన్నాయని, అదే సమయంలో ఆమె ఐసిఐసిఐ నుంచి కూడా ఇఎస్‌ఒపి ప్రయోజనాల కింద ఆదాయం పొందుతున్నారని, ఈ విషయం ప్రధానికి తెలుసా అని జైరామ్ రమేశ్ ప్రశ్నించారు. ఇదే అంశంపై ఢిల్లీలోని ఎఐసిసి ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ మీడియా, పబ్లిసిటీ విభాగం చైర్మన్ పవన్ ఖేడా మాట్లాడుతూ మాధబి బచ్ 2017 ఏప్రిల్ 5 నుంచి 2021 అక్టోబర్ 4 వరకు సెబీలోపూర్తిస్థాయి సభ్యురాలు అని, 2022 మార్చి 2 నుంచి సెబీ చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారని తెలిపారు. ఆమె విషయంలో అనేక పరస్పర విరుద్ధ ప్రయోజనాల అంశాలు ఉన్నాయని, సెబీ పూర్తి స్థాయి సభ్యురాలుగా ఉన్న సమయంలో ఆమెకు ఐసిఐసిఐ నుంచి రూ.12.63 కోట్ల వేతనం లభించిందని చెప్పారు. సెబీ చైర్‌పర్సన్ అయిన తరువాత కూడా మాధబి బచ్ ఐసిఐసిఐ ప్రడెన్షియల్ నుంచి రూ.22.41 లక్షల ఆదాయం పొందారని అన్నారు. ఇవి సెబీ (ఉద్యోగుల సర్వీసు) నియంత్రణ–2001లోని సెక్షన్ 54 ఉల్లంఘన కిందికి వస్తాయన్నారు. అలాగే 2021–23 మధ్యలో కూడా ఐసిఐసిఐ బ్యాంకు నుంచి ఇఎస్‌ఒపి కింద రూ.2.84 కోట్లు మాధబి బచ్ పొందారని తెలిపారు. అదే కాలంలో ఆ మొత్తంపై ఐసిఐసిఐ టిడిఎస్ కింద రూ.1.10 కోట్లు చెల్లించారని, అంటే టిడిఎస్ వేతనంపై విధిస్తారని, కాబట్టి ఇది సెబీ ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కిందకే వస్తుందని పవన్ ఖేడా అన్నారు. మొత్తమ్మీద 2017 నుంచి ఇప్పటి వరకు సెబీ చైర్‌పర్సన్ మాధబి బచ్‌కు ఐసిఐసిఐ నుంచి రూ.16.80 కోట్లు వచ్చాయని, ఈ మొత్తం సెబీ నుంచి ఆమె పొందిన వేతనం కంటే సుమారు ఆరు రెట్లు ఎక్కువ అని పవన్ ఖేడా ఆరోపించారు.

# ఇజ్రాయెల్‌లో రోడ్డెక్కిన జనం

(మొదటి పేజీ తరువాయి)

మంది, ఇతర నగరాలలో రెండు లక్షల మంది ప్రజలు నిరసన ప్రదర్శనలలో పాల్గొన్నట్లు ఇజ్రాయిల్ మీడియా తెలిపింది. జెరూసలెంలోని ప్రధాని బెంజామిన్ నెతన్యాహూల కార్యాలయం ఎదుట కూడా ప్రజలు పెద్ద ఎత్తున నిరసనలకు దిగారు. పలు చోట్ల వాహనాలను అడ్డుకున్నారు. ప్రదర్శకులపై పలు చోట్ల పోలీసులు వాటర్ క్యానన్‌లను ప్రయోగించారు. ప్రధాని బెంజామిన్ నెతాన్యహూ దుందుడుకు వైఖరితో యుద్ధాన్ని కొనసాగిస్తున్నారని, కాల్పుల విరమణ జరిపి ఉంటే ఆ ఆరుగురు బందీలు సజీవంగానే తిరిగి వచ్చేవారని, బందీల కుటుంబసభ్యులు, స్నేహితులు మండిపడుతున్నారు. సోమవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు బెన్ గురియోన్ అంతర్జాతీయ విమానాశయంలో బైటికి వెళ్ళాల్సిన విమానాలను నిలిపివేశారు. హిస్టాడ్రుట్ కార్మిక సంఘం నేతలు మాట్లాడుతూ బ్యాంకులు, పెద్ద మాల్స్, ప్రభుత్వ కార్యాలయాలలో పని చేసే వారంతా సమ్మెలో పాల్గొంటున్నారని తెలిపారు. సమ్మెలో ఇంటర్ సిటీ రైళ్ళను , ప్రధాన బస్ మార్గాలను చేర్చలేదని వెల్లడించారు. పాఠశాలల సమయాలను పలు చోట్ల కుదించారు. కెజి, పబ్లిక్ డే కేర్‌లకు సెలవులు ప్రకటించారు. జెరుసలేం సహా అనేక మున్సిపాలిటీలలో అధికార పార్టీ పట్టు ఉన్న చోట సమ్మెకు పాక్షిక స్పందన లభించినట్లు తెలుస్తోంది.

కోర్టు ఆదేశాలతో ముందుగానే ముగిసిన సమ్మె : రాజకీయ ప్రేరేపితమైన సమ్మెను రద్దు చేయాలని కోరుతూ లేబర్ కోర్టును సోమవారం నాడు ఇజ్రాయిల్ ప్రభుత్వం ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన కోర్టు తక్షణమే సమ్మెను నిలిపివేయాలని మధ్యాహ్నం 2:30 గంట సమయంలో ఆదేశించింది. ఒక్క రోజు సమ్మెకు పిలుపునిచ్చిన హిస్టాడ్రుట్ లేపర్ ఫెడరేషన్ అధ్యక్షుడు అర్నార్ బార్ డేవిడ్ మాట్లాడుతూ కోర్టు తీర్పును గౌరవిస్తూ అనుకున్న సమయం కంటే 3:30 గంటల ముందే సమ్మెను విరమిస్తున్నట్లు ప్రకటించారు. సమ్మెను రాజకీయ ప్రేరేపితమని ప్రచారం చేసినప్పటికీ లక్షల మంది పౌరులు తమకు మద్దతుగా నిలిచారని, బందీలు ప్రాణాలను పోయేందుకు తాము అంగీకరించబోమని వ్యాఖ్యానించారు. బందీల కుటుంబ సభ్యుల వేదిక మాత్రం ప్రదర్శనలను కొనసాగించాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

మొండిగా ముందుకు సాగుతున్న ప్రధాని : ప్రధాని నెతన్యాహూ మాత్రం హమాస్‌పై పూర్తి విజయం సాధించేంత వరకు ఆగేది లేదని ప్రతినబూనారు. మెజారిటీ ఇజ్రాయిలీలు దీనిని వ్యతిరేకిస్తున్నారు. యుద్ధాన్ని ముగించి, గాజా నుంచి ఇజ్రాయిల్ బలగాలను ఉపసంహరించుకొని, ఇజ్రాయిల్‌లో పెద్ద సంఖ్యలో ఉన్న పాలస్తీనా ఖైదీలను విడుదల చేస్తే , తమ వద్ద ఉన్న బందీలను అప్పగిస్తామని హమాస్ ప్రతిపాదిస్తుండగా, ఇజ్రాయిల్ మాత్రం మొండిగా వ్యవహరిస్తోంది. గత అక్టోబర్ 7న ఇజ్రాయిల్‌పై హమాస్ చేసిన మెరుపు దాడిలో 1,139 మంది ఇజ్రాయిలీలు చనిపోయారు. అప్పుడు 250 మందిని హమాస్ బందీలుగా చేసుకుంది. అందులో నవంబర్ మాసంలో కాల్పుల విరమణ సమయాంలో ఇజ్రాయిల్ తమవ వద్ద ఉన్న పాలస్తీనా ఖైదీలను అప్పగించడంతో, వంద మందికి పైగా ఇజ్రాయిల్ బందీలను ఆ దేశానికి హమాస్ అప్పగించింది. ప్రస్తుతం 97 మంది వరకు ఇజ్రాయిలీలు,విదేశీయులు హమాస్ వద్ద బందీలుగా ఉన్నట్లు భావిస్తునారు. అక్టోబర్ 7 తరువాత ఇజ్రాయిల్ మిలిటరీ గాజాపై నిర్వహిస్తున్న దాడుల్లో 40,786 మంది పాలస్తీనావసులు మరణించగా, 94,224 మంది క్షతగాత్రులయ్యారని గాజా ఆరోగ్య శాఖ ప్రకటించింది. కాగా, తాము కాల్పుల విరమణకు సిద్ధంగా ఉన్నప్పటికీ ఇజ్రాయిల్ ప్రధాని ఉద్దేశ్యపూర్వకంగా జాప్యం చేస్తున్నారని హమాస్ ఆరోపించింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com